ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ కు కలదు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శనివారం 27 జూన్ 2026 | సంపుటి: 28 సంచిక: 85 | Saturday 27 June 2026 | Vol.No 28 Issue No .85 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA | www.visionandhra.in

## తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి
- జూన్ 30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం



హైదరాబాద్, జూన్26 : తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత

మిగతా2లో..

## ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి

- ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం
- ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీ
- డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ



న్యూఢిల్లీ,జూన్26 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా గురువారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య

మిగతా2లో..

## హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

- దేశంలోనే సరికొత్త అధ్యాయానికి నాంది
- 1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ నగరం
- వికారాబాద్ జిల్లా వేవెల్ల త్వరలో ఏర్పాటు
- సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం




హైదరాబాద్, జూన్26 : సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్టుకు వేదిక కాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా, కేవలం డేటా సెంటర్ల కోసమే ఒక పూర్తి 'డేటా సెంటర్ నగరాన్ని' అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఈ ప్రాజెక్ట్ దేశంలోనే ఒక సరికొత్త

మిగతా2లో..

## 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యం

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా



అమరావతి,జూన్ 26 :వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్)సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు నిచ్చారు.శుక్రవారం ఆయన ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,పోలీసు

మిగతా2లో..

## 235కు చేరిన భూకంప మృతుల సంఖ్య

- క్రమంగా పెరుగుతోన్న మృతుల సంఖ్య
- ఇంకా దొరకని 40వేల మంది ఆచూకీ
- భవన శిథిలాల కింద అనేక మంది!?
- వెనెజువెల వ్యాప్తంగా తీవ్ర విధ్వంసం
- సహాయం కోసం ముందుకొచ్చిన దేశాలు



కారకాస్, జూన్26 : దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాను భారీ భూకంపాలు వణికించాయి. సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు శక్తిమంతమైన భూప్రకంపనలతో దేశవ్యాప్తంగా తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. ఈ ప్రకృతి విపత్తులో మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 235 మంది మృతి చెందినట్లు వెనెజువెలా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4,300 మంది గాయపడినట్లు తెలిపింది. అనేక మంది భవన శిథిలాల కింద చిక్కుకుపోవడంతో సహాయక బృందాలు వారిని

మిగతా2లో..

## డ్రగ్స్ రహిత తెలంగాణ మా లక్ష్యం

- డ్రగ్స్‌పై పోరాటంలో ఈగిల్ ఫోర్స్ కృషి అసామాన్యం
- డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలి
- ఈగిల్ ఫోర్స్ డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భట్టి






హైదరాబాద్,జూన్26 : విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్‌కు ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకునే తల్లిదండ్రుల ఆశ, రాష్ట్ర ప్రభుత్వ కల ఒక్కటేనని.. అది యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండటమేనని ఉద్ఘాటించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ

మిగతా2లో..



## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే

- ఈ మహమ్మారిని తరిమి కొట్టడంలో కలసి రండి
- ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

హైదరాబాద్,జూన్26 : సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

మిగతా3లో..

## రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

- సిఎంఓ నుంచి అజిత్ రెడ్డి ఔట్,
- కొత్తగా ఇన్వెస్ట్ తెలంగాణ సివివోగా నియామకం
- సిఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్,
- జిఏడి ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్
- అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్




హైదరాబాద్,జూన్ 26 : తెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు

మిగతా3లో..

## వేల మంది సైన్యానికి ఇమామ్ ఎదురు నిలిచారు

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఇమామ్ త్యాగాన్ని స్మరించుకున్న ప్రధాని



న్యూఢిల్లీ,జూన్26 : మొహర్రం పవిత్ర మాసం సందర్భంగా.. సత్యం, ధర్మం కోసం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన అత్యున్నత త్యాగాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్మరించుకున్నారు. ఈ మేరకు ఆయన తన

మిగతా3లో..

## సీఆర్ పాటిల్‌తో సీఎం ఏం మాట్లాడారో ప్రజలకు చెప్పాలి

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



హైదరాబాద్, జూన్26 : భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ప్రస్తావించిన ప్రాజెక్టులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ,

మిగతా3లో..

## తిరుపతికి 2 బుల్లెట్ ట్రైన్స్!!

- హైదరాబాద్-చెన్నైమార్గం గుండా తిరుపతి
- ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదన
- ప్రతిపాదనకు లభించిన ప్రాథమిక అంగీకారం
- త్వరలోనే కార్యరూపం దాల్చనున్న ప్రాజెక్టు



తిరుపతి, జూన్26 : దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుల మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా మారనుంది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్‌ను రాజధాని అమరావతి మీదుగా నిర్మించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్) సానుకూలంగా స్పందించింది. అదే సమయంలో చెన్నై-బెంగళూరు కారిడార్‌లోని చిత్తూరును, హైదరాబాద్-చెన్నై మార్గంలోని తిరుపతితో అనుసంధానించే ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదనకు సైతం ప్రాథమిక అంగీకారం లభించింది. ఈ కీలక నిర్ణయంతో

మిగతా2లో..

## ఈనెల 30న గిరిజన వర్సిటీ స్నాతకోత్సవం

### తొలి స్నాతకోత్సవానికి రానున్న రాష్ట్రపతి



విజయనగరం, జూన్26 : విజయనగరంలోని గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

మిగతా2లో..

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి
- అందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి
- క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలి
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన



అమరావతి, జూన్26 : వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల్ని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి భద్రత, దోమల నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ

మిగతా2లో..

## కొత్త హంగులతో భోగాపురం విమానాశ్రయం

- జూలై 5న ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం!,
- 8నుంచి విమానాల రాకపోకలు ప్రారంభం!!,
- ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ





భోగాపురం, జూన్26 : ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, నవ్యాంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి

మిగతా2లో..

## ఈనెల 30న గిరిజన వర్సిటీ స్నాతకోత్సవం

ఈ కార్యక్రమం కోసం ఆమె ఈ నెల 30న రాష్ట్రానికి రానున్నారు. విశ్వవిద్యాలయానికి సంబంధించిన సొంత భవనాలు ఇంకా సిద్ధం కాకపోవడంతో, ఈ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి లోకేశ్? పాల్గొంటారు. రాష్ట్ర విభజన అనంతరం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి వద్ద సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపన జరిగింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విశ్వవిద్యాలయ స్థలాన్ని మెంటాడ దత్తిరాజేరు మండలాల సరిహద్దు ప్రాంతానికి మార్చారు అక్టోబర్ 2023లో కొత్తగా శంకుస్థాపన చేశారు. అయితే, ఆ తర్వాత ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, జూలై 2024లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టుకు భాగంగా చినమేడపల్లి మర్రివలస గ్రామాల్లో 519 ఎకరాల విస్తీర్ణంలో రూ.834 కోట్ల వ్యయంతో భవనాలను నిర్మిస్తున్నారు. అకడమిక్ బ్లాక్‌లోని ఐదు భవనాలు పరిపాలనా భవనం (అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్) నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది భవనాలు అప్పగించిన వెంటనే తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. నాణ్యమైన నిర్మాణం జరిగేలా పర్యవేక్షణ కొనసాగుతోందని, వచ్చే ఏడాది నాటికి ప్రాజెక్ట్ మొత్తం పూర్తవుతుందని అధికారులు పేర్కొన్నారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ భవనాలు ఇంకా వినియోగానికి పూర్తిగా సిద్ధం కానప్పటికీ తొలి స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రారంభ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 30న విశాఖపట్నం చేరుకుంటున్నారు. విజయనగరంలోని సెంట్రల్ యూనివర్సిటీ భవనాల నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంతో విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొంటారు. రాష్ట్రపతి పర్యటనకు ముందు విశాఖపట్నంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిజిత్ కిషోర్ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణ, ప్రోటోకాల్, భద్రత, వాహనాల పార్కింగ్, అతిథుల కోసం సీటింగ్ ఏర్పాట్లు అత్యవసర సేవలపై వారు అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్, ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి కూడా పాల్గొనాల్సి ఉన్నందున, వారు సంబంధిత అంశాలన్నింటినీ క్షుణ్ణంగా సమీక్షించారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయగలుగుతామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయపద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. "ఫ్రైడే -- డ్రై డే" కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్?మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే తాగునీటి నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ పై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.జారోగ్య పరిరక్షణకు ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి, అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలి. ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయాలి. శుభ్రత పాటించాలని సూచించారు.

## ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి

పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం.. ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు. ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే 'జన్ ధన్' పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

## 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యం

ఉన్నతాధికారులు,నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్ పై వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 2047 నాటికి డ్రగ్స్ రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఇందుకు సాంకేతిక సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు.ముఖ్యంగా మాదక ద్రవ్యాల సరఫరా,విక్రయం చేసే వారిపై కఠినంగా మరియు జీరో టోలరెన్స్ గా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన నిఘా ఉంచి కింగ్ పిన్ లను పట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలన్నారు.ప్రత్యేక రోడ్ మ్యాప్ ను రూపొందించుకోవడంతో పాటు కమ్యునిటీ పోలీసింగ్ ను మరింత పెంపొందించుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రాలకు స్పష్టం చేశారు.అదే విధంగా మాదక ద్రవ్యాల సేవనం, సరఫరా, విక్రయాల వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలని చెప్పారు.విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎపిలో [illegible] విభాగం ప్రత్యేక రాష్ట్ర స్థాయి మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు.ఒకప్పుడు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలులో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని అన్నారు. రైల్వే నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రాల మధ్య జరిగే మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు,జీఆర్‌పీ,ఆర్‌పీఎఫ్,ఈగల్ మరియు శునక దళాలను సంయుక్తంగా మోహరించి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.ఈగల్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన డేటా సెంటర్‌ను నిర్వహించడంతో పాటు రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని తెలిపారు.ఈవీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ,ఈగల్ ఎస్పి ఆపరేషన్స్ కెయం. మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎస్పిబి ఎస్పి జెడి పంకజ్,ఎస్పిబి డిఎస్పి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 235కు చేరిన భూకంప మృతుల సంఖ్య

వెలికితీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నాయి. అధికారుల సమాచారం ప్రకారం, ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40 వేల మంది ఆచూకీ తెలియడం లేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. రాజధాని కారకాస్‌తో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో భూప్రకంపనలు సంభవించినప్పటికీ, తీర ప్రాంత నగరమైన లా గువేరాలో అత్యధిక నష్టం వాటిల్లింది. భూకంపం ధాటికి అక్కడి పరిస్థితి దయనీయంగా మారింది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల వివరాల ప్రకారం, లా గువేరాలో 100కు పైగా భవనాలు పూర్తిగా కూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించడం, వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం అత్యంత క్లిష్టంగా మారిందని వారు తెలిపారు. భారీ కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు ప్రత్యేక యంత్రాలను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా నేలమట్టమైనట్లు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తెలిపారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విపత్తు సమయంలో తమ దేశానికి అండగా నిలిచిన ప్రపంచ దేశాలకు డెల్సీ రోడ్రిగ్స్ కృతజ్ఞతలు తెలిపారు. మానవతా దృక్పథంతో సహాయక చర్యల్లో భాగస్వాములవుతున్న అన్ని దేశాలకు వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ప్రపంచ దేశాలు చూపుతున్న సంఘీభావం తమకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని ఆమె అన్నారు.భూకంపం అనంతరం సమాచార మార్పిడిని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు, సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. అత్యవసర సమాచారాన్ని ప్రజలకు త్వరగా చేరవేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని సూచించారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలాలో 'ఎక్స్' సామాజిక మాధ్యమ వేదికను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. 2024లో అప్పటి ప్రభుత్వం ఈ మైక్రోబ్లాగింగ్ వేదికపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, వెనెజువెలాకు అంతర్జాతీయంగా భారీగా సహాయం అందుతోంది. అమెరికా 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని పంపనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసినట్లు తెలిపింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలు కూడా వైద్య బృందాలు, సహాయక సిబ్బంది, అత్యవసర సామగ్రిని పంపేందుకు ముందుకొచ్చాయి. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని సజీవంగా రక్షించేందుకు సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ప్రభుత్వం, బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపడుతోంది.

## కొత్త హంగులతో భోగాపురం విమానాశ్రయం

సర్వం సిద్ధమైంది. జూలై 5న భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అత్యంత వైభవంగా ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, రికార్డు సమయంలో పనులను పూర్తి చేయించారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తుది అధికారిక షెడ్యూల్ ఆమోదం కోసం రాష్ట్ర అధికార యంత్రాంగం ప్రస్తుతం వేచి చూస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం ఐఎన్ఎస్ డేగా నేవీ రక్షణ పరిధిలో ఉండటం వల్ల అంతర్జాతీయ సర్వీసులకు, రాత్రి వేళల్లో విమానాల రాకపోకలకు అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించారు. అత్యాధునిక రన్‌వే, అంతర్జాతీయ కార్గో టెర్మినల్, ఏకకాలంలో పదుల సంఖ్యలో విమానాలు పార్క్ చేసే ఏప్రాన్ సౌకర్యాలతో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ రూపుదిద్దుకుంది. ఇది అందుబాటులోకి వస్తే ప్రపంచ దేశాల నుండి నేరుగా విశాఖకు విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.భోగాపురం విమానాశ్రయం కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ఆర్థిక వృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మారబోతోంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న ఫార్మా హబ్‌లు, ఐటీ కారిడార్లు, ఆక్వా రంగానికి ఈ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ కార్గో సేవలు విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయి. ఇక్కడి ఉత్పత్తులను నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. దీనివల్ల వందలాది గ్లోబల్ కంపెనీలు ఉత్తరాంధ్ర వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని, తద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన సిక్స్ లేన్ బీచ్ కారిడార్ రోడ్డు పనులను కూడా వేగవంతం చేసింది. ఈ కనెక్టివిటీ వల్ల భోగాపురం పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి రెక్కలు వచ్చాయి. అలాగే రుషికొండ, భీమిలి, తొట్లకొండ తీరప్రాంతాలు గ్లోబల్ టూరిజం స్పాట్స్‌గా మారబోతున్నాయి. అంతర్జాతీయ పర్యాటకులు నేరుగా ఇక్కడికి చేరుకునే వీలుండటంతో హోటల్, హాస్పిటాలిటీ రంగాలు ఊపందుకోనున్నాయి.గతంలోనే ఈ ప్రాజెక్టుకు బీజం వేసిన చంద్రబాబు నాయుడు, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం పనులపై ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించారు.

నిధుల కొరత లేకుండా చూస్తూ, నిర్మాణ సంస్థ జీఎమ్ఆర్‌పై ఒత్తిడి తెచ్చి పనులను పరుగులు పెట్టించారు. పౌర విమానయాన శాఖ నుంచి అవసరమైన అన్ని రకాల అనుమతులు, ట్రయల్ రన్స్‌ను ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశారు. జూలై 5న ఈ మెగా ప్రాజెక్ట్‌ను ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించి, తమ ప్రభుత్వ డెవలప్‌మెంట్ విజన్‌ను దేశవ్యాప్తంగా చాటాలని కూటమి భావిస్తోంది. ఎయిర్‌పోర్ట్ రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ పనులు వంద శాతం పూర్తవడంతో పీఎమ్‌ఓ నుంచి క్లియరెన్స్ రాగానే అధికారికంగా ప్రారంభోత్సవ తేదీని ప్రకటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన ఖరారైతే.. అదే రోజు ఉత్తరాంధ్రలో మరికొన్ని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ సిద్ధం చేస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం అనేది నవ్యాంధ్రప్రదేశ్ జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి ఒక మైలురాయి కాబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదని సామాన్య ప్రజల భావన.

## డ్రగ్స్ రహిత తెలంగాణ మా లక్ష్యం

వస్తారు. ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు. ఈగల్ ఫోర్స్ సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించాం. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటాం. తెలంగాణలో పుట్టిపెరగడం ఓ భరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నాం. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యం. సినీ నటులు ఇచ్చే సందేశం సమాజంలోకి బలంగా వెళ్తుందని భట్టి విక్రమార్క అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రాణాలకు తెగించి, నిరంతరం రిస్క్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే అలాంటి ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని నమ్ముతూ, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక అవేర్‌నెస్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ బలోపేతం, రాష్ట్ర రక్షణ విషయాలలో ప్రభుత్వం ఎంతో కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. డ్రగ్స్ రవాణా లేదా వినియోగంలో ఎంతటి పెద్దవారు, ఎంతటి ప్రభావశీలురు ఉన్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని భట్టి విక్రమార్క తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చలనచిత్ర రంగానికి చెందిన హీరోలు, హీరోయిన్లు, ఇతర కళాకారులు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని శిల్పకళా వేదిక నుంచి ఆయన విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమలో ఉన్నవారు కూడా సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం తరఫున కఠినమైన చట్టాలు చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మార్పు రానంతవరకు ఆశించిన ఫలితాలు రావని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. దేశంలో వరకట్న నిషేధ చట్టం ఉన్నప్పటికీ, అది ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడానికి సామాజిక మార్పు లోపించడమే కారణమని ఉదాహరించారు. డ్రగ్స్ నిర్మూలన వంటి కఠినమైన చట్టాలు వంద శాతం విజయవంతం కావాలంటే, చట్టాలతో పాటు సమాజంలో, ప్రజల ఆలోచనా విధానంలో స్పష్టమైన పరివర్తన రావాలని ఆయన ఆకాంక్షించారు.

## హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

అధ్యాయానికి నాంది పలకనుంది. హైదరాబాద్‌కు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో దాదాపు 1,500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ అత్యాధునిక డేటా సెంటర్ నగరాన్ని నిర్మించనున్నారు. డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు ఉండే భవనాలు మాత్రమే కాదు. వాటిలో వేలాది హై-ఎండ్ సర్వర్లు ఉంటాయి. వాటిని నిరంతరం రన్ చేయడానికి, సురక్షితంగా ఉంచడానికి విస్తృతమైన శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ పరికరాలు, భవిష్యత్ విస్తరణకు భారీ స్థలం అవసరం. అందుకే ఈ ప్రాజెక్ట్ కోసం 1,500 ఎకరాల భూమిని కేటాయించారు. డేటా సెంటర్ సిటీలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలకు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించనున్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ కంపెనీల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్-అండ్-ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హై-స్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచినీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కి చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుండి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్‌ల ద్వారా ఈ డేటా సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకు డేటా సెంటర్లను కేవలం వెబ్‌సైట్‌లు, సాధారణ క్లౌడ్ స్టోరేజ్ కోసం వాడేవారు. కానీ నేడు జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వాడకం విపరీతంగా పెరిగింది. గతంలో ఒకే సర్వర్ ర్యాక్ 5 నుండి 15 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, ప్రస్తుత జీపీయూ-ఆధారిత ఏఐ సిస్టమ్‌లకు 30 నుండి 120 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ఈ భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ ప్రాజెక్ట్‌లో కంపెనీలకు నిరంతరాయంగా 'ఓపెన్ యాక్సెస్ పవర్' అందించనున్నారు. హైదరాబాద్ ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, కంట్రోల్‌ఎస్, క్యాపిటాల్యాండ్, ఎస్‌టిటి గ్లోబల్, ఎన్‌టిటి డేటా వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ 150 నుండి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పనిచేస్తుండగా, సుమారు 5 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా, తెలంగాణలో మరో 11 గిగావాట్లకు పైగా సామర్థ్యం గల ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ సంస్థలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. చందనవెల్లి, భారత్ ఫ్యూచర్ సిటీ, ఫ్యాబ్ సిటీ ప్రాంతాలు కూడా డేటా సెంటర్ క్లస్టర్లుగా అభివృద్ధి చెందుతున్నాయి.

## తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు.సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార-ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి.ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాకుండా, కేంద్ర నిధుల సాధనలోను, కేంద్ర-రాష్ట్రాల మధ్య పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ మరియు పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

## తిరుపతికి 2 బుల్లెట్ ట్రైన్స్!!

దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలన్నీ ఒకే నెట్‌వర్క్‌తో అనుసంధానమయ్యే అద్భుత అవకాశం ఏర్పడింది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్ మొత్తం 760.09 కిలోమీటర్ల మేర మూడు రాష్ట్రాల మీదుగా విస్తరించనుంది. ఇందులో తెలంగాణలో 180.32 కిలోమీటర్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 518.54 కిలోమీటర్ల మేర మార్గం ఉండనుంది. తమిళనాడులో 61.23 కిలోమీటర్ల మేర ఈ మార్గం సాగుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 18 స్టేషన్లను ప్రతిపాదించారు. తెలంగాణలో హైదరాబాద్, శంషాబాద్ సహా ఆరు స్టేషన్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో కలిపి తొమ్మిది స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు చిత్తూరు-తిరుపతి మధ్య సుమారు 65 కిలోమీటర్ల పొడవున ప్రత్యేక హైస్పీడ్ లింక్ కారిడార్ ఏర్పాటును ఎన్హెచ్‌ఎస్ఆర్సీఎల్ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. దీనికోసం తుది స్థల నిర్ధారణ సర్వే, వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నివేదిక సిద్ధమైన వెంటనే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు పంపి తుది ఆమోదం తీసుకోనున్నారు. ఈ లింక్ కారిడార్ అందుబాటులోకి వస్తే, బెంగళూరు నుంచి చిత్తూరు, తిరుపతి మీదుగా అమరావతి వరకు నేరుగా బుల్లెట్ రైలులో ప్రయాణించే వెసులుబాటు కలుగుతుంది.మరోవైపు



306 కిలోమీటర్ల పొడవైన చెన్నై-బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌లో చిత్తూరు ప్రధాన స్టేషన్‌గా నిలవనుంది. ఇందులో తమిళనాడులో 133 కిలోమీటర్లు, కర్ణాటకలో 101 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 72 కిలోమీటర్ల మార్గం ఉండనుంది. మూడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ఏడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ నెట్‌వర్క్ పూర్తయితే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు ఊహించని రీతిలో భారీ ఊతం లభిస్తుంది. ముఖ్యంగా తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే లక్షలాది భక్తులకు అత్యంత వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారత హైస్పీడ్ రైలు వ్యవస్థకు కేంద్ర బిందువుగా మారుతోంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అమరావతి నగరాలను ఒకే నెట్‌వర్క్‌లో అనుసంధానం చేయడం ద్వారా భారీగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉంది. పరిశ్రమలు విస్తరించడం, ఉపాధి అవకాశాలు పెరగడం వంటి సానుకూల ఫలితాలు రాష్ట్రానికి దక్కనున్నాయి. ప్రస్తుతం సర్వేలు, డీపీఆర్ తయారీ ప్రక్రియలను వేగవంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులను ఆదేశించడంతో ఈ కలల ప్రాజెక్టు త్వరలోనే కార్యరూపం దాల్చనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో రవాణా సమయం భారీగా తగ్గడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ హైస్పీడ్ మార్గాలు దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. పర్యాటక రంగానికి కూడా ఈ బుల్లెట్ రైళ్లు కొత్త ఊపిరిని పోయనున్నాయి. ఏపీ కేంద్రంగా సాగే ఈ అభివృద్ధి ప్రయాణం రాబోయే కాలంలో అనేక మైలురాళ్లను అధిగమించనుంది. ప్రస్తుతం అధికారులు సర్వే పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. భూసేకరణ, సాంకేతిక అనుమతుల విషయంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం నిధులను కూడా దశలవారీగా విడుదల చేసేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. బుల్లెట్ రైలు రాకతో ఏపీ మౌలిక వసతులు ప్రపంచ స్థాయికి చేరుకోవడమే కాకుండా, దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు మార్గం సుగమం కానుంది.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# వెనిజువెలా విలయం !

పర్యావరణ విధ్వంసం కూడా భూకంపాలకు కారణమై ఉండొచ్చని నిపుణులు కొందరు అభిప్రాయ పడుతున్నారు. జాపన్ భూకంపాలకు నిలయం. అయితే ఇప్పుడు వెనిజువెలాలో జరిగిన భూకంప విలయం అంతా ఇంతా కాదు. ఏకకాలంలో పలు దేశాల్లో భూకంపాలు ఆందోళనకు గురిచేశాయి. ఇవి మానవులకు హెచ్చరిక కావాలి. వెనెజువెలాలో సంభవించిన రెండు భారీ భూకంపాలు అక్కడి ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. ఒక్క నిమిషం వ్యవధిలో రెండు తీవ్ర భూకంపాలు రావడంతో భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయి. ఇకపోతే లాటిన్ అమెరికా దేశం వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో మృతులు అంతకంత కూ పెరుగుతుండగా గల్లంతైన వారి సంఖ్య వేలల్లో ఉండటం విచారకరం. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4300 మంది గాయపడి నట్లు తెలిపింది. భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది. ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40వేల మంది జాడ తెలియరాలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వెనెజువెలా రాజధాని కారకాస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ భూప్రకంపనలు సంభవించాయి. అయితే, అత్యంత తీవ్రంగా ప్రభావితమైన లా గువేరాలో మాత్రం పరిస్థితి దయనీయంగా ఉంది. భూకంపం ధాటికి ఈ తీర నగరం అతలాకుతలమైంది.ఇక్కడ 100కు పైగా భవనాలు నేలమట్టమైనట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న ఐరాస ప్రతినిధులు వెల్లడించారు. వీటి కింద చిక్కుకున్నవారిని గుర్తించడం కూడా కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. శిథిలాలను తొలగించడానికి చాలా సమయం పడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా శిథిలాల దిబ్బగా మారినట్లు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు. భూకంపం నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐరాస ప్రతినిధులు వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. సోషల్ మీడియాతో ప్రజలు కీలక సమాచారాన్ని వేగంగా తెలుసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలా పౌరులకు 'ఎక్స్' అందుబాటులోకి వచ్చింది. 2024లో మదురో అధికారంలో ఉన్నప్పుడు ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను నిషేధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలాను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకు వస్తున్నాయి. 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. దీన్ని తరలించేందుకు ఇప్పటికే రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్,జర్మనీ,ఫ్రాన్స్, స్విట్జర్లాండ్,నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు కూడా సహాయక సిబ్బంది, వైద్య సిబ్బంది, మానవతా సాయం అందించేందుకు సిద్ధమయ్యాయి. ఈ భూకంపాల ప్రభావం భారత్‌పై కూడా తీవ్రంగా పడనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల వాణిజ్యపరంగా ఆదేశంతో పలు ఒప్పందాలు జరిగాయి. ఇప్పుడు దెబ్బతిన్న వెనిజువెలాతో మనకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో వెనెజువెలా నుంచి భారత్ చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో భారత చమురు శుద్ధి సంస్థలు ఇటీవల వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటిగా వెనెజువెలా ఎదిగింది. ఈ పరిస్థితుల్లో భూకంపం వల్ల అక్కడి ఎగుమతి వ్యవస్థకు అంతరాయం కలిగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భూ÷ఔకంపం కారణంగా వెనెజువెలా నౌకాశ్రయాల కార్యకలాపాలు దెబ్బతినడం, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థలో సమస్యలు, అత్యవసర ఆంక్షలు అమలులోకి రావడం వల్ల చమురు ట్యాంకర్ల రాకపోకలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో సరుకు రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, నౌకల నిరీక్షణ వ్యయాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్‌కు వెనెజువెలా చమురు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఉన్నాయి. భూకంప ప్రభావం ఎక్కువకాలం కొనసాగితే ఆ పెట్టుబడుల నిర్వహణ, ఉత్పత్తి కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే వెనిజువెలా కోలుకుంటేనే మళ్లీ వ్యాపార కార్యకలాపాలు ముమ్మరం కానున్నాయి. అందువల్ల అప్పటి వరకు భారత్ వ్యాపారాలకు దెబ్బగానే భావించాలి.

# ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం

**- తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి......**

**- బాన్సువాడ నియోజకవర్గం లోని అన్ని మండలాల కు చెందిన**

**- 51 మందికి 14,43,000 రూపాయలు చెక్కులను పంపిణీ చేశారు......**



బాన్సువాడ జూన్ 26 (విజన్ ఆంధ్ర ). ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసం వద్ద బాన్సువాడ నియోజక వర్గంలోని 51 మంది ముఖ్యమంత్రి సహాయ నిది ( సీఎంఆర్ఎఫ్ ) లబ్ధిదారులకు రూ 14,43,000/- ల చెక్కులను పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజక వర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు. మండలాల వారి గా సీఎం ఆర్ ఎఫ్ లబ్ధిదారుల వివరాలు. బాన్సువాడ గ్రామీణ మండలం 6 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల కు రూ 1,86,000, బాన్సువాడ మున్సిపాలిటీ ఇద్దరు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల కు రూ 35,500, బీర్కూర్ మండలం నలుగురు సీఎం ఆర్ ఎఫ్ లబ్ధిదారుల కు రూ 75,500, నసురుల్లాబాద్ మండలం 08 మంది సీఎం ఆర్ఎఫ్ లబ్ధిదారుల కు రూ 1,59,000, మోస్రా మండలం ఇద్దరు సీఎం ఆర్ ఎఫ్ లబ్దిదారుల కు రూ 28,000, చందూర్ మండలం నలుగురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ 1,22,000, వర్ని మండలం ఐదుగురు సీఎం ఆర్ ఎఫ్ లబ్దిదారుల కు రూ 1,57,000, రుద్రుర్ మండలం నలుగురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారుల కు రూ 1,56,000, కోటగిరి మండలం ఆరుగురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారుల కు రూ 2,52,500, పోతంగల్ మండలం 09 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల కు రూ 2,54,000, ఇతరులు ఒక్కరు సీఎం ఆర్ ఎఫ్ లబ్ధిదారునికి రూ 17,000, మొత్తం నియోజక వర్గం లో 51 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల కు రూ. 14,43,000, ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోని ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టిన ముఖ్యమంత్రిని ఏమనాలి - కేటీఆర్.



పరిగి, జూన్ 26(విజన్ ఆంధ్ర ): పరిగి పట్టణంలోని ఎస్ గార్డెన్ లో పరిగి నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు కొప్పుల మహేష్ రెడ్డి అధ్యక్షతన బియల్ఎ శిక్షణ, బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బియల్ఎల శిక్షణ, పార్టీ సభ్యత్వం గురించి పార్టీ నాయకులకు కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలనలో రైతులు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. రైతుబంధును మూడుసార్లు ఎగ్గొట్టారని, 420 హామీలిచ్చి ఓట్లు వేయించుకున్నారని విమర్శించారు. 30 నెలలైనా హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. పరిగి సభలో సవాల్ విసురుతూ, రాష్ట్రంలో 1.67 కోట్ల మంది ఆడబిడ్డల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.1.5 లక్షలు జమ చేస్తే తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, పార్టీ సభ్యత్వ ఇంచార్జ్ ఎంఎన్ శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్ రెడ్డి, కొప్పుల నాగి రెడ్డి, మీర్ మహమ్మద్ అలీ, అరవింద్ రావ్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, సురేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ జడ్పీటీసీ లు, మాజీ ఎంపీటీసీ లు, మాజీ సర్పంచులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బియల్ఎ లు తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్ పాటిల్‌తో సీఎం ఏం మాట్లాడారో ప్రజలకు చెప్పాలి

తుంగభద్ర అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని అన్నారు. తెలంగాణకు ఆ రెండు ప్రాజెక్టుల నుంచి 15.9 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉండగా, కేవలం 5 టీఎంసీలే చూపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణకు రావాల్సిన వాటా కంటే తక్కువకు అంగీకరించారని పేర్కొన్నారు. అలాగే ఎస్ఐఆర్‌పై ఓవైసీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, భాజపా ఐడీ కార్డు మాత్రమే కాదు, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాల చెల్లుబాటుపై ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు.

# డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడి.**

**- అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 2 కే రన్.**



నిజామాబాద్ జూన్26:( విజన్ ఆంధ్ర ): డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు.డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని , యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం అందరి బాధ్యత అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సెక్యూరిటీ కౌన్సిల్, ఐఎంఏ డాక్టర్స్ సహకారంతో డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 2కే నిర్వహించారు. 2కే రన్ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీ పీ మాట్లాడుతూ , వేదికపై ఉన్న నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు , ఐఎంఏ ప్రతినిధులు , కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులు , సభ్యులకు అభినందనలు తెలిపారు. చిన్న చిన్న మంచి అలవాట్లతోనే సమాజంలో పెద్ద మార్పు తీసుకురావచ్చని అన్నారు. డ్రగ్స్ సమస్య కొత్తది కాదని , దేశాన్ని బలహీనపర్చేందుకు శత్రు దేశాలు యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వ్యాప్తిని ప్రోత్సహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశ బలం యువతేనని , వారిని మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చే కుట్రలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని , సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు వెచ్చిస్తున్నాయని , ఈ సమస్య లేకుంటే ఆ నిధులను విద్య వంటి అభివృద్ధి రంగాలకు వినియోగించే అవకాశం ఉండేదని చెప్పారు. రానున్న రెండు నుంచి మూడు నెలల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలలు , ఇంటర్మీడియట్ కళాశాలలు , ప్రొఫెషనల్ కళాశాలల్లో విస్తృత స్థాయిలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సే నో టూ డ్రగ్స్ సే ఎస్ టూ లైఫ్ అనే సందేశాన్ని సమాజంలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకుని కృషి చేయాలని పోలీస్ కమీషనర్ పిలుపునిచ్చారు. డాక్టర్ కవిత రెడ్డి మాట్లాడుతూ , రాష్ట్ర ముఖ్యమంత్రి డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పోలీస్ శాఖలో ఈగల్ (జూూ+ూజు) బృందం డ్రగ్స్ నియంత్రణ కోసం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. అనంతరం సంతోష్ కుమార్ విద్యార్థులు, యువతతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణ ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ నియంత్రణ కోసశీ పోలీస్ కళాబృందం చేసిన నాటిక విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నది. 2కే రన్ కార్యక్రమమును పోలీస్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుండి ప్రారంభమై - రైల్వే కమాన్ - పోలీస్ పరేడ్ గ్రౌండ్ - ఎన్టీఆర్ చౌరస్తా - ఆర్ అండ్ బి ఆఫీస్ - రైల్వే స్టేషన్ - జిల్లా ఫైర్ స్టేషన్ - పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , జిల్లా ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ ఐశ్వర్య , ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ విశాల్ , నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లు దర్శన్ సింగ్ , శిరీష్ కుమార్ , హితేన్ బిమాని , రజనీకాంత్ , శ్రీనివాస్ రెడ్డి , డి వై ఎస్ ఓ పవన్ కుమార్ , ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ , సీఐలు , ఎస్. ఐ లు పోలీసు సిబ్బంది , పోలీస్ కళాబృందం , నవ్య భారతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు , మెడికల్ కాలేజ్ విద్యార్థులు , ఎన్సిసి క్యాండిడేట్స్ వివిధ కళాశాల పాఠశాలల విద్యార్థులు , ప్రతినిధులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వేల మంది సైన్యానికి ఇమామ్ ఎదురు నిలిచారు

అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ (గతంలో ట్విట్టర్) ద్వారా ఒక సందేశాన్ని పంచుకున్నారు. "హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన త్యాగం... సత్యం, న్యాయం కోసం స్థిరంగా పోరాడేలా ఎంతో మందికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఇది అచంచలమైన ధైర్యం, విశ్వాసానికి సజీవ ప్రతీకగా నిలుస్తుంది" అని ప్రధాని మోదీ తెలిపారు. స్లాం మత ప్రవక్త అయిన మహమ్మద్ ప్రవక్త మనవడే (కూతురు ఫాతిమా, అల్లుడు అలీల కుమారుడు) హజ్రత్ ఇమామ్ హుస్సేన్. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రంలో 10వ రోజును 'ఆషూరా' ( అని పిలుస్తారు. ఈ రోజున షియా ముస్లింలు ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరుల అమరత్వాన్ని స్మరించుకుంటూ, దీనిని అత్యంత విషాద దినంగా పాటిస్తారు. క్రీస్తుశకం 680 (హిజ్రీ సంవత్సరం 61)లో ప్రస్తుత ఇరాక్ దేశంలోని 'కర్బలా' అనే ప్రాంతంలో జరిగిన చారిత్రాత్మక యుద్ధంలో ఈ మహా త్యాగం జరిగింది. ఆ సమయంలో ఉమయ్యద్ రాజవంశానికి చెందిన పాలకుడు యజీద్ , తనను ఇస్లామిక్ సామ్రాజ్యానికి ఏకైక నాయకుడిగా (ఖలీఫాగా) అందరూ అంగీకరించాలని డిమాండ్ చేశాడు. అయితే, యజీద్ ఒక క్రూరుడు, అవినీతిపరుడు, ఇస్లాం ప్రాథమిక, నైతిక సూత్రాలకు విరుద్ధంగా పాలించేవాడు. ఆయన పాలనను అంగీకరిస్తే, అది సత్యం, ధర్మాన్ని కాలరాయడమే అవుతుందని ఇమామ్ హుస్సేన్ దృఢంగా భావించారని ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా లోని ఇస్లామిక్ హిస్టరీ అండ్ బ్యాటిల్ ఆఫ్ కర్బలా చెబుతోంది. అధికార దాహంతో ఉన్న యజీద్‌కు లొంగిపోవడానికి నిరాకరించిన ఇమామ్ హుస్సేన్, కేవలం 72 మంది కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి యజీద్ పంపిన వేల మంది సైన్యంతో కర్బలా మైదానంలో ఎదురునిలిచారు. ఆ చిన్న సమూహంలో 6 నెలల పసికందుతో పాటు మహిళలు, వృద్ధులు కూడా ఉన్నారు. శత్రువులు వారి దారుణత్వాన్ని ప్రదర్శిస్తూ, యూఫ్రటీస్ నది నుంచి ఇమామ్ హుస్సేన్ బృందానికి చుక్క నీరు కూడా అందకుండా మూడు రోజుల పాటు అడ్డుకున్నారు. మండుటెండలో దాహంతో అలమటిస్తున్నప్పటికీ వారు ధర్మాన్ని వీడలేదు. చివరగా, ఆషూరా రోజున జరిగిన అసమాన పోరులో హజ్రత్ ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరులు అత్యంత దారుణంగా, వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారు.

## రాష్ట్రంలో పలువురు ఐఎఎస్‌ల బదిలీ

సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులు అయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ / ఎక్స్-ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# వరంగల్ లో ఇసుక దుమారం



వరంగల్ జూన్ 26, : వరంగల్ జిల్లా పాలిటిక్స్‌లో ఇప్పుడు ఇసుక దుమారం రేగుతోంది. ఇసుక దందాతో ఇద్దరు మంత్రులు వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపిస్తూ అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నంలో ఉంది బీఆర్ఎస్. ములుగు జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా ఇసుక దోపిడీ జరుగుతోందని విపక్షం చేస్తున్న ఆరోపణలు పొలిటికల్ మంటలు పుట్టిస్తున్నాయి. దోపిడీకి సంబంధించి మా దగ్గర డ్రోన్ విజువల్స్, ఇతర ఆధారాలు ఉన్నాయంటూరోజుకో ప్రెస్ మీట్ పెట్టి హడావిడి చేస్తున్నారు గులాబీ నేతలు. అలాగే? దీనికి సంబంధించి సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సందర్భంలో దీనికి కౌంటర్ ఇవ్వడంలో జిల్లా కాంగ్రెస్ నేతలు విఫలమవుతున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. ఇద్దరు మంత్రులు అంటూ? బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంపై కేవలం ములుగు జిల్లా పార్టీ నేతలు మినహా? కాస్తంత హోదా ఉన్న, పెద్ద నాయకులు ఎవరూ ఎందుకు రియాక్ట్ అవడం లేదన్న చర్చలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. రాష్ట్ర మంత్రులు ఇద్దరు కలిసి ములుగు జిల్లా పరిధిలోని గోదావరి ఇసుకను మింగేస్తున్నారంటూ డైరెక్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీతమ్మ సాగర్‌లో అక్రమంగా ఇసుక తవ్వి దాదాపు 4 వేల కోట్ల రూపాయలు వెనకేసుకునేందుకు మంత్రులు ఇద్దరూ ప్రయత్నిస్తున్నారన్నది కేటీఆర్ ఆరోపణ. ఇసుక మాఫియా సూత్రధారులను బయటకు లాగాలన్నది ఆయన డిమాండ్.దీనికి సంబంధించి ములుగు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు గులాబీ నేతలు. ఇలా ఇసుక దోపిడీ పేరుతో అధికార పక్షాన్ని ఇరుకునపెట్టేలా బీఆర్ఎస్ నేతలు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నా. అధికార పక్షం నుంచి గట్టిగా తిప్పికొట్టే ప్రయత్నం మాత్రం జరగడంలేదని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం ములుగు నాయకులు, అందునా ఒక మంత్రి అనుచరగణం తప్ప? ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏ ముఖ్య నేతా ఎందుకు స్పందించలేదన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఆ విషయంలో కాంగ్రెస్ వాళ్ళు ఎందుకు వెనకడుగు వేస్తున్నారంటూ ఎవరికి వారు రకరకాల విశ్లేషణల్లో మునిగిపోయారు. ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు అశోక్, జిల్లా పార్టీలోని కొందరు నాయకులు మాత్రమే బీఆర్ఎస్ ఆరోపణలకు రియాక్ట్ అయి నిరూపించమంటూ సవాల్ విసిరారు. మిగతా మంత్రులు, ఎమ్మెల్యేల సంగతి తర్వాత? కనీసం ఉమ్మడి వరంగల్ పరిధిలో ఇప్పుడున్న మిగిలిన ఐదు జిల్లాల డీసీసీ అధ్యక్షులు కూడా మినిస్టర్స్ మీద వస్తున్న ఇసుక ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదన్నది ఆలోచించాల్సిన విషయమేనని అంటున్నారు రాజకీయ పరిశీలకులు. ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతుల విషయంలో ఎక్కడా తప్పు జరగలేదని, మంత్రులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా వ్యవహరించలేదని కాంగ్రెస్ నేతలు గట్టిగా ఎందుకు చెప్పలేకపోతున్నారన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి.ఇందుకు సమాధానంగా వినిపిస్తున్న కొన్ని మాటలు కాంగ్రెస్ పార్టీలోని ప్రస్తుత పరిస్థితి ప్రతిబింబిస్తున్నాయని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. ఏం మాట్లాడితే ఏమవుతుందోనన్న భయంతోనే ఎక్కువ మంది కామ్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. చేతిలో పూర్తి సమాచారం లేకుండా. ఏదో, మంత్రుల్ని వెనకేసుకుని రావాలి కాబట్టి నోటికొచ్చింది మాట్లాడేస్తే రేపు మనం ఇరుక్కుపోతామన్న భయం వాళ్ళలో ఉందట. అందుకే ఇసుక ఆరోపణల విషయంలో మంత్రులు ఇద్దరికీ బాసటగా నిలవలేకపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మంత్రుల నుంచి కూడా మనం కరెక్ట్‌గానే ఉన్నాం, మీరు ఖండించండన్న గ్రీన్ సిగ్నల్ కూడా రాలేదని అంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అధిష్టానం సైతం ఈ విషయంపై నేతలకు క్లారిటీ ఇవ్వకపోవడం వల్ల ఇసుక దందా అంశాన్ని పట్టించుకోకుండా ఎవరికి వారు తమ పని తాము చేసుకుంటూ వెళ్తున్నారట. కానీ? విపక్షం ఆరోపణలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళక ముందే మేలుకుని ప్యాచ్‌వర్క్ చేయకుంటే నష్టపోవాల్సిన పరిస్థితులు వస్తాయన్న టెన్షన్ కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది.

# సంఘాల పేరుతో విద్యాసంస్థలను ఇబ్బంది పెట్టవద్దు..

**- పాఠశాల వాతావరణాన్ని దెబ్బతీవద్దు..**
**- సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్..**



సూర్యాపేట జూన్ 26:(విజన్ ఆంధ్ర) : ప్రవేట్ విద్యాసంస్థల ను సంఘాల పేరుతో ఇబ్బందులు, బెదిరింపులకు గురి చేస్తున్నారని వివిధ సమస్యలపై ప్రవేట్ విద్యాసంస్థల నుండి పిర్యాదు వస్తున్నాయన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల త్రివేణి పాఠశాలలోకి కొంత మంది వ్యక్తులు విద్యార్థి సంఘాల పేరుతో అక్రమంగా చొరబడి కార్యాలయం తాళాలు పగలగొట్టి, పెద్దగా నినాదాలు చేస్తూ విద్యార్థులను భయాందోళనకు గురిచేసిన విషయమై యాజమాన్యం పిర్యాదు మేరకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు చట్టపరకారం క్రిమినల్ కేసు నమోదు చేశాం అని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి సంఘాల పేరుతో విద్యార్థులకు అసౌకర్యం కలిగించవద్దు, విద్యాసంస్థల యాజమాన్యాలను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయవద్దు అని ఈ సందర్భంగా వివిధ రకాల సంఘాలకు డీఎస్పీ సూచించారు. పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం, విద్యార్థులను రవాణా చేసే బస్సులను అడ్డుకోవడం, యాజమాన్యాలను లేదా ఉపాధ్యాయులను బెదిరించడం, పెద్ద శబ్దాలతో నినాదాలు చేస్తూ విద్యార్థులు భయపడేలా వాతావరణం సృష్టించడం, చందాల రూపంలో డబ్బు వసూళ్లు చేయడం వంటి చర్యలకు పాల్పడడం చట్ట విరుద్ధం అని హెచ్చరించారు. ప్రవేటు విద్యాసంస్థల్లో ఏవైనా సమస్యలు ఉంటే, వాటిపై సంబంధిత జిల్లా అధికారులకు, విద్యాశాఖ అధికారులకు పిర్యాదు చేయాలి, సమస్యలపై అధికారులు నిబంధనల ప్రకారం విచారణ, దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అంతే కానీ, విద్యార్థి సంఘాల పేరు చెప్పుకుని పాఠశాలల్లో ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవద్దని, విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ వారికి అసౌకర్యం కలిగించకూడదని సూచించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే విద్యాశాఖ అధికారులకు లేదా ఉన్నతాధికారులకు మాత్రమే నివేదించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విద్యాసంస్థల నిర్వహణకు ఆటంకం కలిగిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ స్పష్టం చేశారు. కేసులు నమోదు చేయడం, బైండోవర్ చేయడం లాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు.

# ప్రమాదశాత్తు కరెంటు స్థంబానికి డి కొట్టి సిపిఎం కార్యకర్త మృతి

**- అనదులగా మిగిలిపోయిన భార్యపిల్లలు.**



జూలూరుపాడు జూన్ 27 విజన్ ఆంధ్ర జూలూరుపాడు మండలం బేతాళపాడు పంచాయతీ రాచబండ కోయగూడెం గ్రామానికి చెందిన పూనం సమ్మయ్య శుక్రవారం ఉదయం దాదాపు తొమ్మిదిన్నర గంటల సమయంలో ( బాబు )49 మృతి చెందాడు. వివరాలలోకి వెళ్తే బేతాళ పాడు పంచాయతీ రాచ బండ కోయగూడెం గ్రామముకి చెందిన పూనం సమ్మయ్య తాను రోజువారి కూలీ సుతార్ మేస్త్రి పనులు నిమిత్తం టేకులపల్లి మండలం ముత్యాలమ్మ పాడు గ్రామానికి బయలుదేరి వెళ్లారు. సుజాతానగర్ మండలం పాత అంజనాపురం గ్రామం వద్ద మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు బైకు అదుపుతప్పి రోడ్డు ప్రక్కనే ఉన్న కరెంటు స్తంభానికి ఢీ కొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనం మీద వెళ్తున్న ఫోను సమ్మయ్య బాబు అక్కడికక్కడే చనిపోయాడు అది గమనించిన కొందరు ప్రజలు కోన సమ్మయ్య ఇంటికి సమాచారం అందించగా సమ్మయ్య భార్యా సంధ్య రాణి సుజాతనగర్ మండలం పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించగా స్పందించిన సుజాతనగర్ ఎస్ఐ వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పంచినామా చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులు అప్పగించారు.

**జోహార్ కామ్రేడ్ పూనెం సమ్మయ్య (బాబు )**
**భారీగా తరలి వచ్చిన సిపిఎం నాయకులు కార్యకర్తలు.**

సిపిఎం పార్టీ సీనియర్ కార్యకర్త సిపిఎం పార్టీ బాద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వరరావు మండల కార్యదర్శి యాస నరేష్ బేతాళ పాడు గ్రామ శాఖ కార్యదర్శి రెడ్డిబోయిన శ్రీను సభ్యులు పుప్పాల వెంకటేశ్వరావు పార్టీ కార్యకర్తల అధ్వర్యంలో ఘన నివాళి అర్పించి సమ్మయ్య కుటంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ సిపిఎం పార్టీ కి సమ్మయ్య చేసిన సేవలు మరువలేనివి సమ్మయ్య కుటంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది అని తెలిపారు. చివరిగా సిపిఎం పార్టీ లంచనాలతో అంత్యక్రియలు కార్యక్రమం పూర్తి చేశారు.

# ప్రభుత్వం రజక ఫెడరేషన్ కు రూ, 9 వేల కోట్ల నిధులు కేటాయించాలి

**- జులై 6 న చాకలి ఎస్సీ సాధన సమితి వార్షికోత్సవ మహాసభ**
**- చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీ లక్ష్మి**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 26,(విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం రజకుల సంక్షేమం గురించి ఆలోచించాలని రజక ఫెడరేషన్కురూ,9 వేల కోట్లు నిధులు కేటాయించి రజకుల అభ్యున్నతికి పాటుపడాలని చాకలి ఎస్సీ సాధన సమి తి రాష్ట్ర అధ్యక్షురాలు చాకలి శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రజక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంటుకు పంపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ జాబితాలో చేరుస్తామని అసెంబ్లీలో ప్రస్తావించారని గుర్తు చేశారు. రజక వృత్తిదారులు బట్టలు ఉతుకుతూ చెరువులు, ఇతర నీటి వనరుల్లో పడి కరెంటు షాక్ కు గురై ప్రమాద వశత్తు చనిపోయిన వారికి కార్మిక చట్టం వర్తింపజేసి, ఐదు లక్షల రూపాయలు భీమా అందించాలని, చాకలి ఐలమ్మ పేరును జనగామ జిల్లాకు నామకరణం చేయాలని,ట్యాంకు బాండ్ పై ఐలమ్మ విగ్రహం ప్రతిష్టించాలని ఆమె డిమాండ్ చేశారు. వచ్చే నెల 6న హైదరాబాదులో జరిగే చాకలి ఎస్సీ సాధన సమితి తొమ్మిదవ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు ఎస్సి రిజర్వేషన్ అనేది చాకలి కులస్తుల జన్మహక్కు అని తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా బీహార్ మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే శ్యామ్ రజక్,తెలంగాణ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ మాదరపు యాదగిరి తో పాటు అతిరథ మహారథులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణ రజక సంఘం తమకు సంపూర్ణ మద్దతు తెలియ జేయడం ఆనందంగా ఉందన్నారు. సంఘాలు వేరైన హక్కుల కోసం అందరు కలిసి కట్టుగా పోరాడాలన్నారు. అంతకు ముందు మహాసభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ రజక సంఘం అధ్యక్షులు పారుపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ పోషం, కోశాధికారి నస్పూరి పోశం, ఉపాధ్యక్షులు పోచంపల్లి ధర్మయ్య, నల్లూరి మల్లయ్య, ముఖ్య సలహాదారు నేరెళ్ల రమేష్, రజక సంఘం డైరెక్టర్లు పున్నం సమ్మయ్య, శేఖర్, తిరుపతి సభ్యులు పాల్గొన్నారు.

# మత్తు రహిత సమాజమే లక్ష్యం..

**- సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్..**

సూర్యాపేట జూన్ 26:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లాను మత్తు రహితంగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ కేంద్రాన్ని పట్టణ సీఐ వెంకట్‌తో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న నలుగురు బాధితులను పరామర్శించి, వారికి పండ్లు పంపిణీ చేశారు. మత్తు అలవాట్ల నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా క్యారమ్స్, చెస్ వంటి ఇండోర్ గేమ్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై యుద్ధం ప్రకటించామని, పాత నేరస్థులపై నిరంతర నిఘా ఉంచామన్నారు. మద్యం తాగిన వారిని గుర్తించినట్లే, గంజాయి సేవించిన వారిని



పట్టుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కిట్లను అందించిందని అన్నారు. వ్యసనాల బారిన పడిన యువతను మార్చడానికి డీ అడిక్షన్ కేంద్రం ఎంతో దోహదపడుతుందని, బాధితులు స్వచ్ఛందంగా చేరవచ్చని సూచించారు. మత్తు పదార్థాల సమాచారం కోసం ప్రజలు డయల్ 100, 112 లేదా 1908 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈగల్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది, డాక్టర్స్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ఉన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

**- చెడు వ్యసనాలను దూరంగా తరిమేద్దాం.**
**- బంగారు భవిష్యత్తు కోసం యువత వ్యసనా లకు దూరంగా ఉండాలి.**
**- కలెక్టర్ ప్రియాంక ,ఎస్పీ వినీత్.**



నారాయణపేట ,జూన్ 26 (విజన్ ఆంధ్ర) : డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెడు వ్యస నాలకు దూరంగా ఉండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టా లని, యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి ఎచ్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ లు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్ర వ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శు క్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, ఎస్పీ డా వినీత్ లు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్పీ కార్యాలయం నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ కు వ్యతిరేకంగా అందరూ కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తోటి వారూ ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య దశలో బంగారు భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఫ్రెండ్స్ , ఎంజాయ్ అంటూ ఇప్పుడు తిరిగితే మన సమయం బాగా లేనప్పుడు మనకు తోడుగా ఎవ్వరూ రారని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. మిమ్మల్ని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వాళ్ళు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్టేట్ ఈగల్ ఫోర్స్ టీం డ్రగ్స్ పై దాడులు నిర్వహిస్తున్నాయని, ప్రజలు యువత వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ అనేవి ఒక విధంగా టెర్రరిస్టులాంటివని, ఇవి దేశ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారాయని తెలిపారు. యువత ఎక్కువగా ఉన్న భారతదేశాన్ని బలహీనపరచేందుకు డ్రగ్స్‌ను ఒక ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణుబాంబులు అవసరం లేదని, ఆ దేశ యువతను చెడు మార్గంలోకి నెట్టేస్తే చాలు అని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత భవిష్యత్తు పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోతుందని, అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్ అనేది జాతీయ భద్రత కు భంగం కలిగించేలా చేస్తుందని, అందువల్ల విద్యార్థులు, యువత ఈ చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండి దేశ అభివృద్ధికి పునాదులు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో అవగాహన పెంచుతూ యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్స్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు గమనించినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. డ్రగ్స్‌ను ఒక్కసారి తాకితే జీవితాంతం దాని ప్రభావం ఉండే ప్రమాదం ఉందని, అందువల్ల యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ సమాజాన్ని కాపాడే యోధులుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్,ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, గాయత్రి, కృష్ణ చైతన్య, ఎక్సైజ్ ఎస్ఐ లు,మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బి ఎల్ ఓ, బి ఎల్ ఏ లకు సహకరించండి

**- 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ పిలుపు**

కొత్తగూడెం బ్యూరో , జూన్ 27(విజన్ ఆంధ్ర) : దేశవ్యాప్తంగా జరుగుతున్న (ఎస్ ఐ ఆర్) ప్రత్యేక ఓటర్ సవరణ సర్వే పురస్కరించుకొని సర్వేలో మన ఇంటి ముందుకు వచ్చే బిఎల్ఓ,బి ఎల్ ఏ లకు ఓటర్లు సహకరించాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం నియోజకవర్గం లోని రామవరం లో 182వ బూతు బిఎల్ఓ బిఎల్ఏ లు ఇంటింటికి తిరిగి సంబంధిత పత్రాలను పంచే కార్యక్రమం లో కార్పొరేటర్ మునిగడప పద్మ పాల్గొని మాట్లాడుతూ సర్వేలో ఓటర్లు అప్రమత్తంగా ఉండి తమ ఓటును కాపాడుకోవాలని, మన ఇంటికి వచ్చే బీఎల్ఓ లకు వారు అడిగిన సమాచారాన్ని ఇచ్చి మీకు ఇచ్చిన ఫారం ను పూర్తి చేసి మరల బిఎల్ఓ కు ఇచ్చేంతవరకు సహకరించాలని ఆమె తెలిపారు. 25 నుండి జూలై 24 వరకు ఈ సవరణ సర్వే జరుగుతుందని దీనిలో కొత్త ఓటర్లను



చేర్చుకోవడం, చనిపోయిన ఓటర్లను తొలగించడం ,ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్న ఓట్ల లో అదనపు ఓటును తొలగించడం మన ఓటర్ లిస్ట్ లో ఉన్న తప్పులను సరి చేసుకోవడం చేస్తారని ఆమె తెలిపారు. దరఖాస్తును పూర్తిచేసే సందర్భంలో మనకు అర్థం కానట్లయితే బి ఎల్ ఎ ల సహాయం తీసుకొని, మీకు ఇచ్చిన పారాలను పూర్తి చేసి బిఎల్ఓ లకు ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ శివరాం ,సిపిఐ జిల్లా నాయకులు మునిగడప పద్మ వెంకటేశ్వర్లు, సిపిఐ 182 వ బూతు లెవల్ బిఎల్ఏ జావిద్ పాష, టిఆర్ఎస్ బి ఎల్ ఏ అంజుమ్ నాయకులు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారంలో వాస్తవ వివరాలు నమోదు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 26, విజన్ ఆంధ్ర : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందిస్తున్న ఎన్యుమరేషన్ ఫారంలో వాస్తవ వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కెరమెరి మండలం మల్లంగి గ్రామంలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదు ప్రక్రియను అధికారులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అందిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు నిర్వహించే సర్ ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఈ క్రమంలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వద్దకు వెళ్లిన సమయంలో ఎన్యుమరేషన్ ఫారం అందించినప్పుడు బి ఎల్ ఓ యాప్ లో మార్క్ చేయాలని తెలిపారు. సదరు ఓటరు ఎన్యుమరేషన్ ఫారం నింపిన తరువాత తిరిగి సేకరించి యాప్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్ళిన వారు, 2 అంతకు మించి ఎపిక్ కార్డులు కలిగి ఉండడం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకరికి ఒక ఓటరు గుర్తింపు కార్డు మాత్రమే ఉండేలా స్పష్టమైన జాబితా రూపొందించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపిన తరువాత తిరిగి సేకరించి బి ఎల్ ఓ యాప్ లో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా





నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో బూత్ స్థాయి ఏజెంట్లు, యువజన సంఘాల ప్రతినిధులు, వాలంటీర్లు, కుల పెద్దల సహకారం తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకై.ఎందుకు చింత ఎఐఎస్ఎఫ్ ఉందిగా మీ చెంత...!

**-కూల్చిన ఇండ్ల చోటనే పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలిలి**
**-ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు**
**-గుండ్ల సింగారంలో నిరాశ్రయులైనా విద్యార్థులకు నోట్ బుక్స్, విద్యావసరాల వస్తువుల పంపిణీ**





హన్మకొండబ్యూరో ఛీఫ్(విజన్ఆంధ్ర) జూన్ 26 : విద్యార్థుల హక్కులు, సంక్షేమం కోసమే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) పనిచేస్తోందని, గుండ్ల సింగారంలో ఇండ్ల కూల్చివేతతో నిరాశ్రయులైనా విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ అండగా ఉంటుందని, కూల్చిన ఇండ్ల చోటనే పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హనుమకొండ మండలం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఇటీవలే కాలంలో ఇండ్ల కూల్చివేతతో నిరాశ్రయులైనా కుటుంబాల విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు 500 నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్, విద్యావసరాల వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు, అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మాజీ రాష్ట్ర నాయకులు కర్రె బిక్షపతి లు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ అధ్యక్షతన జరిగిన సభలో తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుండ్ల సింగారంలో గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు వేసుకొని నివసిస్తున్న 360 మంది పేదల ఇళ్ళను కూల్చి వేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వం పేదల గుడిసెలు కూల్చి వేసే ముందు సర్వే నిర్వహించాలని, అనర్హులు ఉంటే తొలగించాలని, కానీ ఏమాత్రం సమాచారం లేకుండా ఒక్కసారిగా పేదల గుడిసెలపై బుల్డోజర్ లతో దాడి చేయడం ప్రభుత్వానికి తగదని అన్నారు. రోజు రోజుకు నగరం విస్తీర్ణం పెరుగుతున్న క్రమంలో గ్రామీణ ప్రాంతాల వలస వచ్చి కూలీ, నాలీ చేసుకుని జీవించే వారు ఇండ్లలో కిరాయిలు కట్టలేని పరిస్థితిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుండి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఈ ప్రభుత్వం పేదలను లక్ష్యంగా చేసుకున్నదని, పేదల జీవించే హక్కును కాలరాస్తున్నదని అన్నారు. సొంత ఇంటి కలను దూరం చేయడమే ఈ ప్రభుత్వానికి సరి కాదని అన్నారు. గుండ్ల సింగారంలో నిరాశ్రయులైనా కుటుంబాల విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, విద్యావసరాల వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. అదేవిధంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ నిరాశ్రయులైన విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు కర్రె బిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల పట్ల ప్రభుత్వం తీరు సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికల రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సొంతుకు ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు పుట్కూరి ప్రణీత్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదళ్ల శరత్, ములుగు జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, రాష్ట్ర నాయకులు అన్వర్, హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, అజయ్.. సీపీఐ హనుమకొండ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కోడపాక బాబు, మామునూరి దామోదర్, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాడికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, నలువాల సంధ్య, బైసా మౌనిక, తాటికంటి మమత, గుంటి రజిత, కాలనీవాసులు మరియు విద్యారులు తదితరులు పాల్గొన్నారు.

# భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య




ఎల్బీనగర్ జూన్ 26 (విజన్ఆంధ్ర): భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెందిన గుట్ల రాజేష్ (26) గుట్ల ఆశ ప్రవాళిక భార్యాభర్తలు. వృత్తి డిజైనర్. ఈ క్రమంలో గురువారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన టీజీపిఎల్ క్రికెట్ మ్యాచ్ చూడ్డానికి వెళ్లిన రాజేష్ అనంతరం ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వెళ్ల తర్వాత స్నేహితుడు విజయ్ కుమార్ తో కలిసి మద్యం సేవించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మృతుడు రాజేష్ తన భార్య ఆశ ప్రవళికతో స్వల్ప గొడవ జరిగిందన్నారు. ఉన్నట్టుండి అర్ధరాత్రి సమయంలో రాజేష్ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుల తండ్రి పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలాన్ని చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బేతాళపాడు అభివృద్ధి కై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్.

**- వైరా ఎమ్మెల్యే కృషి తో బేతాళపాడు లో అదనపు విద్యుత్ స్తంభాలు.**



జూలూరుపాడు జూన్ 27 విజన్ ఆంధ్ర: జూలూరుపాడు మండలం బేతాళపాడు పంచాయతీ లో ప్రతి గ్రామంలో వీధి వీధిలో కరెంట్ సరఫరా చేసే విధంగా ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తున్నా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేసిన బేతాళపాడు పంచాయతీ ప్రజలు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదేశాలమేరకు గ్రామ పంచాయతీ లో కరెంట్ సమస్య ఉండకుండా దగ్గర ఉండి ఎక్కడ కరెంట్ స్తంభం అవసరం ఉంటే అక్కడ దగ్గర ఉండి పనులను పర్వీక్షిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భద్రాద్రి డిసిసి కార్యదర్శి ఆర్కే నాయుడు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చలమల నరసింహారావు చౌడం లక్ష్మీ నారాయణరావు, గుగులోత్ భాస్కర్, గ్రామ నాయకులు చౌడం నరేష్, వాడ వెంకన్న,తెల్లం నరసింహారావు, గలిగి పాపయ్య,మద్దిబోయిన నవీన్ తదితరులు పాల్గొన్నరు.

# మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 26,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, గుడిపేట 13వ పటాలం కమాండెంట్ లతో కలిసి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐ.బి. చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి, యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని, అందరం సమిష్టిగా కృషి చేసి మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని, మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రగ్స్ రిహాబిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ మాదకద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధించడం జరుగుతుందని, ఎక్కడైనా మత్తుపదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100లో సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు వినియోగిస్తే కుటుంబం ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

**- బురాన్ పల్లి గ్రామ సర్పంచ్ రాథోడ్ రాందాస్**

**- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 26 ( విజన్ ఆంధ్ర ) : మాదకద్రవ్యాలను సేవిస్తే కుటుంబ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై సర్వనాశనమవుతుందని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ హెచ్చరించారు. దశుక్రవారము అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్ పి ఆధ్వర్యంలో 2కె రన్, అవగాహన సమావేశం వికారాబాద్ జిల్లా బ్లాక్ గ్రౌండ్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తో పాటు బురాన్ పల్లి గ్రామ సర్పంచ్ రాథోడ్ రామ్ దాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ డ్రగ్స్ అనేది ఒక మహమ్మారి, సరదాగా మొదలయ్యి, వ్యసనంగా మారి జీవితాలను సర్వనాశనం చేస్తుందని హెచ్చరించారు. బంగారు భవిష్యత్తు ఉన్న యువత సాలెగూడు లాంటి డ్రగ్స్ ఊబిలో చిక్కుకొని తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బురాన్ పల్లి గ్రామ సర్పంచ్ రాథోడ్ రామ్ దాస్ మాట్లాడుతూ ఇంట్లో ఒక్కరు డ్రగ్స్ కు బానిస అయితే ఆ వ్యక్తితో పాటు కుటుంబం అంతా నాశనం అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా అప్పులపాలు అవ్వడంతో పాటు అనారోగ్యాల పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ అలవాటు ఉన్న వ్యక్తులకు సమాజంలో గౌరవం ఉండదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు యువజన సంఘాల సభ్యులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రజకుల కుల గణనపై రీ సర్వే చేయండి

**- -తెలంగాణ రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర కమిటీ డిమాండ్**

రంగారెడ్డి జిల్లా బ్యూరో జూన్ 26 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించిన కులగనన సర్వే ప్రకారం రజక జనాభ సంఖ్యపై పలు అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని, ప్రభుత్వం రీ సర్వే చేసి సర్వే కరెక్ట్ గా రజకుల జనాభా సంఖ్యను ప్రకటించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ కి మెమొరం ఇవ్వడం జరిగిందని రాష్ట్ర కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో రజకుల కుల గణన జరిగిన తీరుపై అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 33 లక్షల మంది ఉన్నట్టుగా అధికార గణాలు ప్రకటిస్తూ వచ్చాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రాష్ట్రంలో రజకుల జనాభా సంఖ్యను ప్రకటించిన తీరు పారదర్శకంగా లేదని వారు అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి వేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి రీ సర్వే చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన తొమ్మిది లక్షలపై రజకుల జనాభా సంఖ్యపై పలు అనుమానాలు ఉన్నాయని, ఇది రజకులకు బడ్జెట్ కేటాయింపుల్లోగాని వివిధ శాఖల నుండి జరగవలసిన పనులు తీరును గాని, ప్రభావితం చేస్తాయన్నారు. సమాజంలో ప్రత్యక్ష సేవకులు అయినటువంటి రజకులను నేటి పాలకులు గుర్తించి న్యాయం చేస్తారని, అందుకు రీ సర్వే చేపట్టే విధంగా బీసీ కమిషన్ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికే వెనుకబడిపోయినటువంటి సామాజిక వర్గం రాజకీయంగా వెనుకబడిపోతున్న మా సామాజిక వర్గానికి నేటికీ న్యాయం జరగట్లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రజకుల జీవితాల్లో వెలుగులు నింపడానికి కోసం, సంరక్షణ కోసం, రాజకీయంగా, సామాజికంగా, భద్రత పరంగా, తగు చర్యలకు పూనుకుంటారని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పగిళ్ల జోజి, గోరుగంటి కృష్ణ, దండు నిరంజన్, జి.నరేందర్, యు.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు

**- సంఘ బలోపేతం ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం**

**- జిల్లా అధ్యక్షుడు అనంతుల లక్ష్మీనారాయణ**




కొత్తగూడెం బ్యూరో జూన్ 27(విజన్ ఆంధ్ర) హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్రస్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సదస్సు రాష్ట్ర సంస్థాగత అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగుల ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలు, సేవా కార్యక్రమాల విస్తరణకు సమిష్టి కృషి అవసరమని పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన ప్రతినిధులతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు సదస్సులో పాల్గొని సంఘ బలోపేతం, ఉద్యోగుల సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, సేవా కార్యక్రమాల విస్తరణ వంటి అంశాలపై జరిగిన చర్చల్లో తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనంతుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సదస్సులు సంఘ అభివృద్ధికి, సభ్యుల్లో ఐక్యత పెంపొందించడానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కీలక వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. సదస్సును విజయవంతంగా నిర్వహించిన రాష్ట్ర కమిటీకి జిల్లా కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అనంతుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి దూలం నట్రాజ్, సంస్థాగత కార్యదర్శి పసునూతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు కొండి పద్మజ, సంయుక్త కార్యదర్శి వన్నాల విద్యాసాగర్, నిర్వాహక కార్యదర్శి బాతాల వెంకటేశ్వర్లు, క్రియాశీలక సభ్యురాలు కొండి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జాజాపూర్ లో మొహరం వేడుకల్లో పోటెత్తిన భక్తులు

**- కర్ణాటక, మహారాష్ట్ర సహా పలు ప్రాంతాల నుంచి భక్తుల రాక**



నారాయణపేట , జూన్ 26 (విజన్ ఆంధ్ర) నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలో మొహరం మహోత్సవాలు శుక్రవారం నవమి సవారి మౌలాలి సవారి సందర్భంగా అత్యంత వైభవంగా కొనసాగాయి. మౌలాలి సవారి తో పాటు వివిధ పీర్ల ఉత్సవాల్లో పాల్గొనేందుకు తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు జాజాపూర్ కు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. నారాయణపేట మండలంలో అత్యంత వైభవంగా నిర్వహించే మొహరం వేడుకలకు జాజాపూర్ పీర్ల ఉత్సవాలు ప్రత్యేక గుర్తింపు పొందింది.నవమి సవారి సందర్భంగా పీర్ల ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. ఊరేగింపు మార్గమంతా భక్తులు నీటితో రహదారులను శుభ్రపరచి పీర్లకు దట్టీలు, పూలమాలలు, చాదర్లు సమర్పించి బుక్క వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. హిందూముస్లిం సోదరభావానికి ప్రతీకగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు వేడుకల్లో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ వేడుకల్లో గ్రామంలో చిన్నపిల్లల వస్తువుల దుకాణాలు మిఠాయి దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి.మొహరం వేడుకలను తిలకించేందుకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పీర్ల వద్ద కందూర్లు చేసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై సతీష్ రెడ్డి తోపాటు పోలీసులు, గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ సంగీత, కుమ్మరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కొనసాగింది.

# మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత -జిల్లా కలెక్టర్

**- ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజమే లక్ష్యం - పోలీస్ కమిషనర్**



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లాకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర చాల కీలకమని, యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని సూచించారు . గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అప్రమత్తం కావాలని అన్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూమాధకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత దృష్టి అంతా జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తునమన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1908 కు సమాచారం అందించాలన్నారు. మీ వివరాలు గోప్యం గా ఉంచడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, యువత, అధికారులతో కలిసి మాదక ద్రవ్యాల నిర్ములనకై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాధకద్రవ్యల నిర్ములన కై "ఐయమ్ యాంటీ డ్రగ్ సోల్జర్స్" సెల్ఫ్ పాయింట్ వద్ద ఫోటో, సైన్ బోర్డు వద్ద సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఎస్సై లు, పెద్ద సంఖ్యలో యువత , విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**- ఒక్కరు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఆ కుటుంబం అంతా నాశనం**

**- మాదక ద్రవ్యాల వలన ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం**

**- మాదక ద్రవ్యాలు తీసుకున్న వ్యక్తిని సమాజం చిన్నచూపు చూస్తుంది**

**- ఇక్బాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రముఖ వ్యాపారస్తులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 26 ( విజన్ ఆంధ్ర ) : మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఇక్బాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రముఖ వ్యాపారస్తులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఒక్క వ్యక్తి మాదకద్రవ్యాలు సేవిస్తే ఆ కుటుంబమంతా సర్వనాశనం అవుతుందనే ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన వివరించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోగల శివారెడ్డి పెట్ ప్రాంతానికి చెందిన ఇక్బాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రముఖ వ్యాపారస్తులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. రెక్కాడితే గాని డొక్కాడని శ్రమ జీవులు మాదకద్రవ్యాలు ఎట్టి పరిస్థితుల్లో తీసుకోరాదని ఆయన హితవు పలికారు. మాదకద్రవ్యాలను వినియోగిస్తే తన కుటుంబం ఆర్థిక వ్యవస్థ తో పాటు కుటుంబ సభ్యులందరినీ రోడ్డు పాలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలు సేవించిన వ్యక్తిని సమాజం గౌరవంతో చూడదని ఆయన తెలిపారు. మాదకద్రవ్యాలు సరదాగా మొదలై వ్యసనంగా మారి జీవితాలను సర్వనాశనం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువత తమ బంగారు భవిష్యత్తును డ్రగ్స్ ఊబిలో చిక్కుకునేలా తమ జీవితాలను మార్చుకోరాదని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడిన వ్యక్తి కుటుంబ సభ్యులను డబ్బుల గురించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తాడని ఆయన గుర్తు చేశాడు. ఆ కుటుంబాన్ని అంతా అప్పుల ఊబిలోకి నెత్తి వేస్తాడని ఆయన అన్నారు. డ్రగ్స్ తీసుకున్న వారితో పాటు ఆ కుటుంబ సభ్యులంతా అనారోగ్యం పాలయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన చెప్పారు. హెరాయిన్ కోకేన్ గంజాయి వంటి మాదకద్రవ్యాలు ఎవరైనా సేవిస్తే పంట పండిస్తే వారిపై చట్టపరంగా కఠిన శిక్షలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రతి వ్యక్తి తనతో పాటు తన కుటుంబాన్ని కూడా సభ్య సమాజంలో గౌరవంగా బ్రతికేటట్లు చూసుకోవాలనే ఆయన తెలిపారు.

# శాంతియూతంగా ధర్నా చేస్తే. కార్మికుల అక్రమ అరెస్టులా...!

**-అరెస్ట్ చేసిన 17మందిని వెంటనే విడుదల చేయాలి.**

**-వెంటనే 318 మంది కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా అజాంజాహి మిల్లు స్థలంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**

**- ఓల్డ్ సిటీ క్లబ్బు లో కూడా ఆధ్వర్యంలో జరుగుతున్న అజయ్ మిల్లు భూముల వేలంపాటను తక్షణమే నీలిపివేయాలి..**

**- ప్రభుత్వన్ని డిమాండ్ చేసినపి డి ఎస్ యూ జిల్లాప్రధాన కార్యదర్శి మర్రి మహేష్...**



హన్మకొండ జిల్లా బ్యూరో ఛిఫ్( విజన్ఆంధ్ర ) జూన్ 26: శుక్రవారం రోజున శాంతియుతంగా ధర్నా చేస్తున్న లార్మికులను అరస్ట్ చేయడం సమాజసం కాదని పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకటనలో తెలిపారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ 134మంది కార్మికులకు ఇచ్చిన విధంగానే మిగిలిన 318మంది కార్మికులకు ఇవ్వాలని 2021సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసే విధంగా ప్రభుత్వం జీవో తీసుకురావాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్న కార్మికులను అక్రమ అరెస్టులు చేయడం అప్రాజాస్వామ్యమని అని దీనిని పిడిఎస్యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. అంతేకాకుండ తక్షణమే మిల్లు భూముల్లోనే ఈ 318 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని. అక్రమంగా అరెస్టు చేసి మట్టేవాడలో పోలీస్ స్టేషన్లో ఉంచినటువంటి కొమ్ముల సందీప్ యూనియన్ అధ్యక్షులు బస్సుల హరినారాయణ యూనియన్ ప్రధాన కార్యదర్శి గంగుల దయాకర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గద్దల సంజీవ యూనియన్ గౌర అధ్యక్షులు పసుల దాసు సింగిరెడ్డి యశోద ఉపాధ్యక్షురాలు కుట్ల యాదగిరి రాజు వెంకటేశ్వర్లు తదితర మొత్తం 17 మందిని కార్మికులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# బిజెపి ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ గా "నంబూరి విజయశ్రీ చౌదరి"



రంగారెడ్డి జిల్లా బ్యూరో జూన్ 26 (విజన్ ఆంధ్ర): భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ సెల్ ధార్మిక పరిషత్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ గా హస్తినాపురం సాగర్ రింగ్ రోడ్డు మల్లికార్జున్ నగర్ కాలనీకి చెందిన సీనియర్ బిజెపి నాయకురాలు నంబూరి విజయశ్రీ చౌదరి ఎన్నికయ్యారు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని జిల్లా కన్వీనర్ గా బాధ్యతలు అప్పగిస్తూ బిజెపి ఎండోమెంట్స్ రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాష్, కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు నంబూరు విజయశ్రీ చౌదరి వెల్లడించారు. ఈ సందర్భంగా నంబూరు విజయశ్రీ చౌదరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ధార్మిక పరిషత్ పటిష్టం చేస్తూ వివిధ కార్యక్రమాలు చేపడతామని, వారు ఇచ్చిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ఆ విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఈ బాధ్యతను ఉత్తర్వులు జారీ చేసిన సూర్యప్రకాష్, నిరంజన్ దేశాయి, గౌతమ్ రావులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 2026-27 విద్యా సంవత్సరానికి కెఎల్ఈఎఫ్ లో స్పాట్ అడ్మిషన్లు




హైదరాబాద్, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ(కెఎల్ఈఎఫ్) 2026-27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్, విజయవాడ క్యాంపస్‌లలో స్పాట్ అడ్మిషన్లను ప్రారంభించిందని అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.ఎస్.ఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ జూన్ 22 నుంచి 30 వరకు కేఎల్ విజయవాడ క్యాంపస్, కే.ఎల్.హెచ్ అజీజ్ నగర్ క్యాంపస్, కే.ఎల్.హెచ్ బాచుపల్లి క్యాంపస్, కే.ఎల్.హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ క్యాంపస్‌లలో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీటెక్, బీబీఏ, ఎంబీఏతో పాటు ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, కామర్స్, వ్యవసాయం, న్యాయశాస్త్రం, ఫార్మసీ, సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్, యానిమేషన్ అండ్ గేమింగ్ కోర్సుల్లో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2026-27 బ్యాచ్ విద్యార్థులకు రూ.100 కోట్లకు పైగా మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు తిరిగి చెల్లించని రూ.1,000 దరఖాస్తు రుసుముతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, ఎన్ఆర్ఐ, పీఐఓ, ఓసీఐ అభ్యర్థులకు కూడా ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

# ఖబర్దార్.... ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి!!

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఇకనైనా వక్రబుద్ధి మార్చుకో....
- మచ్చలేని మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ పై లేనిపోని ఆరోపణ చేస్తే సహించం
- ఎల్బీనగర్ సీనియర్ కాంగ్రెస్ నేత దేరంగుల కృష్ణ ఆగ్రహం



ఎల్బీనగర్ జూన్ 26 (విజన్ ఆంధ్ర): అనునిత్యం ఎల్బీనగర్ ప్రజల సంక్షేమానికై నిరంతరం కృషి చేస్తున్నటువంటి మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ పై ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఆయన అనుచరులతో లేనిపోని ఆరోపణలు చేయించడం సిగ్గుచేటని, మరోమారు ఈ విధమైనటువంటి ఆరోపణలు చేస్తే సహించబోమని ఎల్బీనగర్ సీనియర్ కాంగ్రెస్ నేత దేరంగుల కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో దేరంగుల కృష్ణ మాట్లాడుతూ.. ఎల్బీనగర్ సాగర్ రింగ్ బైరామల్ గూడా చెరువు అభివృద్ధి విషయంలో పర్యటించిన మధుయాష్కిగౌడ్ పై దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తన అనుచరులతో లేనిపోని ఆరోపణలు చేయించడం సరికాదని అన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్థానిక బారాస నాయకుడు గజ్జల మధుసూదన్ రెడ్డిలు కలిసి బైరాములగూడ చెరువుతోపాటు భూపేష్ గుప్తా నగర్ చేపల చెరువును కూడా కబ్జా చేశారని ఆరోపించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చేసిన చెరువు కబ్జాల గురించి ఎల్బీనగర్ ప్రజలందరికీ తెలుసునని, రానున్న రోజుల్లో సుధీర్ రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. ప్రభుత్వ భూమినే ప్రభుత్వానికి అమ్మిన గనులు వీరని ఆయన అన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, గజ్జల మధుసూదన్ రెడ్డిపై పూర్తి విచారణ చేపడితే వారి భూకబ్జాలు భాగోతాలు బయటికి వస్తాయని అన్నారు. ఒక్క చెరువును పరిశీలిస్తేనే ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వనికి పోతున్నారని ఎద్దేవ చేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి భూకబ్జా బాగోతాలు అక్రమాలు అన్ని బయటికి తీస్తామని అన్నారు. మచ్చలేని మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్పై లేనిపోని ఆరోపణలు చేస్తే ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఇకనైనా ఆయన పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బాగోతాలు ఒక్కొక్కటిగా అన్ని బయటకు తీస్తామని తెలిపారు.

# సీతక్క వల్ల నాకు ప్రాణహాని ఉంది

- బీఆర్ఎస్ నేత భూక్య జంపన్న సంచలన ఆరోపణలు.
- కాంగ్రెస్ అవినీతిని ప్రశ్నిస్తే వ్యక్తిగత దాడులు చేస్తున్నారని విమర్శ.



ములుగు జూన్ 26, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తున్నందుకు తనకు మంత్రి సీతక్క నుంచి ప్రాణహాని ఉందని బీఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు భూక్య జంపన్న సంచలన ఆరోపణలు చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, "సీతక్క గురించి మాట్లాడితే చాలు ములుగు జిల్లాలో రాజకీయ భవిష్యత్తు మాత్రమే కాదు, అసలు భవిష్యత్తే ఉండదన్నట్టు పరిస్థితి ఉంది. కాంగ్రెస్ అవినీతిని ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలు, దాడులు చేయడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి నియోజకవర్గంలో ఉంది" అని విమర్శించారు. "నిస్వార్థ సేవ చేస్తున్న నాపై ఆమె అనుచరులతో వ్యక్తిగత విమర్శలు చేయిస్తున్నారు. ఇలాగే ప్రశ్నిస్తే హత్యలకు పాల్పడే అవకాశం ఉంది. ములుగు జిల్లాలో 'అంతా నా ఇష్టం' అన్నట్టు సీతక్క వ్యవహారం నడుస్తోంది. ప్రశ్నిస్తే చాలు వారి అనుచరులు దూషణలకు దిగుతారు" అని ఆరోపించారు. సుమారు 4000 కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా తవ్వారని, శాటిలైట్ ద్వారా ఈ విషయం ప్రపంచానికి తెలుసని, దీనిపై విచారణ జరపాలని కోరానని తెలిపారు. "కాంగ్రెస్ పార్టీ లోపాలు, రైతులకు రైతు బంధు ఇవ్వకపోవడం, మద్దతు ధర, 2 లక్షల రుణమాఫీ కోసం ప్రశ్నించడం నా తప్పా? మహిళలకు 2500 మహాలక్ష్మి పథకం, విద్యార్థినులకు స్కూటీలు ఏవని నిలదీయడం నా తప్పా?" అని జంపన్న ప్రశ్నించారు.

# జాకారం వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యం

- మృతుడి గుర్తింపునకు ములుగు పోలీసుల విజ్ఞప్తి



ములుగుజూన్ 26 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మండలం జాకారం గ్రామ సమీపంలో వరంగల్ములుగు ప్రధాన రహదారి పక్కన శనివారం గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభ్యమైందని ములుగు పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 4050 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు టీ-షర్ట్, తెలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. తెల్లని గడ్డం, చేతికి మెటల్ కడెం, నల్ల దారం, వేళ్లకు ఉంగరాలు ఉన్నాయని, ముఖంపై గాయాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం మృతదేహాన్ని ములుగు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. పై వివరాల ఆధారంగా మృతుడిని గుర్తించిన వారు లేదా సమాచారం తెలిసిన వారు వెంటనే ములుగు పోలీసులను సంప్రదించాలని కోరారు.

సంప్రదించాల్సిన నంబర్లు:
ఎస్సై - ములుగు: 8712670081
సీఐ - ములుగు: 8712670111

# 28 న తెలంగాణ ఉద్యమ కారుల భారీ ర్యాలీకి మేడ్చల్ జిల్లా నుండి అధిక సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు హాజరు కావాలి

- దొమ్మటి కిరణ్ కుమార్ రావు,
- కీర్తి శ్రీనివాస్, గరిక సుధాకర్, వీర చారీ,



కాప్రా /జూన్ 26(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారంగా ఇచ్చిన హామీ అమలులో భాగంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం గురించి తెలంగాణ ప్రభుత్వం కె .కేశవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమకారుల బంధువుగా మారిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపేందుకు ఈ నెల 28 వ (ఆదివారం )తేదీన ఉదయం 10 గంటలకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. చీమ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో చేవెళ్ల వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి కొడంగల్ కు జరిగే భారీ ర్యాలీకి మేడ్చల్ జిల్లా నుండి అధిక సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు హాజరు కావాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వీడియో కన్వీనర్ దొమ్మటి కిరణ్ కుమార్ రావు, కో- కన్వీనర్ కీర్తి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గరిక సుధాకర్, డి. వీరాచారి, పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో అశోక్, దసరం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# జాకోర లిఫ్ట్ పనులను పర్యవేక్షించిన పోచారం.



బాన్సువాడ జూన్ 26 (విజన్ ఆంధ్ర ). జాకోర లిఫ్ట్ పనులను శుక్రవారం పర్యవేక్షించిన పోచారం. జాకోరా లిఫ్ట్ పనులను పర్యవేక్షించి, కూనీపూర్ లో డిసి పని, జలాల్ పూర్ గ్రామంలో కొంతమేర పైపులైను పనులు ఆగిపోయిన సందర్భం లో అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచనలు త్వరగా త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగు నీరు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, పిసిసి డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి, డిసిసి కార్యదర్శి వెలగపూడి గోపాల్, మాజీ జెడ్పిటిసి రంజానాయక్, ఉపసర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు దారం బాబు, జలాల్పూర్ సర్పంచ్ ఇలుతం మమతా బాలు, సీనియర్ నాయకులు సింగంపల్లి గంగారం, భారీ, మాజీ సొసైటీ చైర్మన్ లు కృష్ణరెడ్డి, సిహెచ్ గంగాధర్, మాజీ ఎంపీటీసీ లు సాయ గౌడ్, మధు, కృష్ణరెడ్డి, డై రక్టర్ బుడ్డన్న, రాంచంధర్ రెడ్డి, గంగ ప్రసాద్, గోవర్ధన్, శివ పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యాన్ని పండించిన 'శ్రీకృష్ణ రాయబారం', ఆకట్టుకున్న చారిత్రక

- 'శ్రీ ప్రతాపరుద్ర విజయం' రూపకం




హైదరాబాద్ జూన్ 2026 విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ విశ్వనాథ్ ) : తెలుగు పౌరాణిక పద్యనాటకాల వైభవాన్ని, తెలంగాణ సాంస్కృతిక సంపదను ప్రతిష్ఠాత్మకంగా కళాకారులు చాటిచెబుతున్నారని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అభిప్రాయపడ్డారు. రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న మూల వేదికపై తెలంగాణ ప్రజాకళ 99 రోజుల కళా మహోత్సవంలో భాగంగా బుధవారం ప్రదర్శించిన సుప్రసిద్ధ పౌరాణిక పద్యనాటకం 'శ్రీకృష్ణ రాయబారం' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. తిరుపతి వేంకటకవులు రచించిన ఈ అపూర్వ పౌరాణిక నాటకాన్ని 'శ్రీ చౌడేశ్వర నాట్యమండలి' కళాకారులు ఆవిష్కరించారు. మహాభారత ఇతివృత్తంలోని భావోద్వేగ ఘట్టాలను, కౌరవ సభలో శ్రీకృష్ణుని శాంతి సందేశం, ధర్మాధర్మాల మధ్య సంఘర్షణ గట్టాలలో కళాకారులు అద్భుతమైన అభినయం, పద్యాల ఆలాపన, హావభావాలు, సంభాషణల ద్వారా సజీవంగా ప్రదర్శించి ప్రేక్షకుల హృదయాలను భక్తి పారవశ్యంలోకి తీసుకెళ్లింది. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సందేశాత్మక గీతాలను ఆలపించారు. "ముద్దొచ్చే ముద్దొచ్చే హైదరాబాద్" గీతం హైదరాబాద్ నగర వైభవం, చారిత్రక గొప్పతనం, విభిన్న సంస్కృతుల సమ్మేళనం, హిందూ-ముస్లిం సోదరభావం, గోల్కొండ కోట, చార్మినార్ వంటి చారిత్రక కట్టడాల విశిష్టతను హృద్యంగా ఆవిష్కరించింది. ఈ గీతం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. గురువారం సాంస్కృతిక మహోత్సవంలో నిర్వహించిన కార్యక్రమాలలో భాగంగా డాక్టర్ సంఘభట్ల నరసయ్య రచన, దర్శకత్వంలో కాకతీయుల కళాపోషణకు, తెలుగు సాహిత్య వైభవానికి సాక్షంగా నిలిచిన 'శ్రీ ప్రతాపరుద్ర విజయం' పాల్కురికి సోమన్న మూల వేదికపై ప్రదర్శించిన ఈ రూపకం మన చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి చేరవేస్తోంది. గొప్ప భావం, భక్తి, వినోదం, సందేశంతో సమ్మిళితమైన ఈ ప్రదర్శన ప్రేక్షకుల మన్ననలు పొందుతూ కళారంగ మహోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాలకు విద్యానందాచారి, శ్రీనివాస్ రాజు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

# టి ఎస్ ఎస్ డబ్ల్యూ జేఏ ఆధ్వర్యంలో 29న ఐ & పి ఆర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

- అక్రిడేషన్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్
- దళిత, గిరిజన జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకుల వెల్లడి
- మేడ్చల్ జిల్లా ప్రెస్‌మీట్‌లో ప్రకటించిన నాయకులు




కాప్రా /జూన్ 26(విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న హైదరాబాద్‌లోని ఐ & పి ఆర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర ఉత్సవ సమితి చైర్మన్ ఎల్ల సంతోష్ కుమార్, వైస్ చైర్మన్ ఇడపాక సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న వివక్షను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అక్రిడేషన్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీల్లో ఇతర వర్గాల ఆధిపత్యం కొనసాగిస్తూ దళిత, గిరిజన జర్నలిస్టులను పక్కన పెట్టే విధానాన్ని నిలిపివేయాలని కోరారు. దళిత, గిరిజన జర్నలిస్టులకు అక్రిడేషన్ కమిటీల్లో స్థానం కల్పించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో దళిత, గిరిజన జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న వారి పిల్లలకు నూరుశాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ముట్టడి కార్యక్రమానికి దళిత, గిరిజన జర్నలిస్టులు, సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక న్యాయవాదులు మద్దతు తెలిపి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దత్రపు దేవా, నెమ్మది వెంకన్న, మేడ్చల్ జిల్లా నాయకులు కందుకూరి ప్రశాంత్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో మురికి కాలువలు, నాలాల పూడిక తీత పనులు ముమ్మరం...



నిర్మల్ జిల్లా, జూన్ 26(విజన్ ఆంధ్ర); నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డ్ లలో.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా నిర్మల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ వార్డుల్లో మురికి కాలువలు, నాలాల పూడిక తీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటూ, నీటి నిల్వలు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.

# మరో అరుదైన ఘనత సాధించిన న్యాయవాది సుంకర నరేష్..!

*రైఫిల్ అండ్ పిస్టల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ సౌత్ జోన్, ఓపెన్ నేషనల్, ప్రీ-నేషనల్ పోటీలకు అర్హత*





కాప్రా/ జూన్ 26(విజన్ ఆంధ్ర ప్రతినిధి ): కాప్రాకు చెందిన ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త, రాజకీయ నాయకుడు సుంకర నరేష్ మరో విశిష్ట విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. గచ్చిబౌలిలోని తెలంగాణ షూటింగ్ రేంజ్‌లో జూన్ 20 నుంచి 25 వరకు నిర్వహించిన 12వ. తెలంగాణ రాష్ట్ర రైఫిల్ అండ్ పిస్టల్ షూటింగ్ ఛాంపియన్ షిప్ లో ఆయన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. సీనియర్ పురుషుల వ్యక్తిగత విభాగంలోని 50 మీటర్ల పిస్టల్ ఫైర్ ఆర్మ్ (.22 బుల్లెట్) ఈవెంట్‌లో పాల్గొన్న సుంకర నరేష్ రాష్ట్ర స్థాయి అర్హత స్కోరును నమోదు చేసి సౌత్ జోన్, ఓపెన్ నేషనల్, ప్రీ-నేషనల్ షూటింగ్ పోటీలకు అర్హత పొందారు. ఈ విజయానికి గత కొన్ని నెలలుగా చేసిన కఠోర సాధనే కారణమని ఆయన తెలిపారు. గచ్చిబౌలిలోని తెలంగాణ షూటింగ్ రేంజ్‌లో రాష్ట్ర ప్రధాన కోచ్ వారణాసి సందీప్ కుమార్ వద్ద ఆయన శిక్షణ పొందారు. ప్రముఖ నేషనల్ షూటర్ కిశోర్ పర్యవేక్షణలో నిరంతరం సాధన చేసి ఈ ఘనతను అందుకున్నారు. ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురైనప్పటికీ వాటిని అధిగమిస్తూ పట్టుదలతో ముందుకు సాగిన సుంకర నరేష్ ఈ విజయం సాధించడం విశేషం. న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, మరోవైపు క్రీడల్లోనూ ప్రతిభ చాటటం పలువురి ప్రశంసలను అందుకుంటుంది. "సాధించాలనే సంకల్పం ఉంటే వయసు, సమయం ఎప్పుడూ అడ్డంకులు కావు" అనే విషయాన్ని తన కృషితో సుంకర నరేష్ మరోసారి నిరూపించారని పలువురు అభినందనలు తెలిపారు. ఆయన భవిష్యత్ జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి రాష్ట్రానికి మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.

# చర్లపల్లి ఫేజ్-2లో గుంతల రోడ్లు..!

- ప్రమాదాలకు నిలయంగా మారిన పారిశ్రామిక ప్రాంతం..!
- తక్షణమే మరమ్మతులు చేపట్టాలి
- సిఐటియూ అధ్యక్షుడు బి.వి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు



కాప్రా/ జూన్ 26(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతం ఫేజ్-2లో రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో వాహనదారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ అనుబంధ చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బి.వి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన రహదారుల దుస్థితి కారణంగా ప్రతిరోజూ వేలాది మంది ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో రోడ్లపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. ఫేజ్-2 పరిధిలోని వందలాది పరిశ్రమలకు చెందిన కార్మికులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుండటంతో సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరస్పర సమన్వయంతో రోడ్ల మరమ్మతులు, పునర్నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకోవడం మంచిదని, ప్రాణనష్టం జరిగే పరిస్థితులు తలెత్తకముందే అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికులు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని గుంతలను పూడ్చి రోడ్లను సక్రమంగా అభివృద్ధి చేయాలని, పారిశ్రామిక ప్రాంతానికి తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని బివి.సత్యనారాయణ, జి.శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

# జిల్లా ఎస్టి మోర్చా అధ్యక్షునికి ఘన సన్మానం



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (విజన్ ఆంధ్ర ): మహబూబాబాద్ జిల్లా కార్యాలయంలో ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన గూగులోతు సురేష్ కు మహబూబాబాద్ జిల్లా ఎస్టీ నాయకులు బీసీ నాయకులు ఎస్సీ నాయకులు అందరు కలిసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా బిజెపి మాజీ కార్యదర్శి చిట్టి మల్ల శ్రీను వార్డు కౌన్సిలర్ మాలోత్ శ్రీదేవి బాలు నాయక్ టౌన్ ఉపాధ్యక్షుడు పెద్దబోయిన రవి యాదవ్ గుగులోత్ చంద్రశేఖర్ శనిగాపుర బూత్ అధ్యక్షులు బానోత్ శ్రీనివాస్ నాయక్ భాను హథి రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


# గ్రామస్థాయిలో గోదాంల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

- అవగాహన సదస్సులో నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్ వెల్లడి.



నిజామాబాద్ జూన్26:( విజన్ ఆంధ్ర) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి గ్రామంలో ధాన్యం నిల్వల కోసం గోదాములను నిర్మించాలని నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్ అన్నారు. నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లో భారత ప్రభుత్వం, నాబార్డు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన ధాన్యం, తృణధాన్యాలు నిలువలకు సంబంధించి అతి పెద్ద గోదాముల నిర్మాణం అనే అంశం పై సహకార సంఘాల అధ్యక్షులకు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, సహకార సంఘాలు నాబార్డ్ ద్వారా అతి తక్కువ వడ్డీ తో ఋణము పొంది, సుమారు 2000 మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణం చేపట్టవచ్చని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు సరైన ధర లభించేలా, అకాల వర్షాలు, ఇతర కారణాలచే పండించిన పంటలు పాడైపోకుండా నివారించేందుకు, గ్రామ స్థాయిలో ఈ గోదాముల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దీనివలన రైతులు తమ పంటలను అత్యవసరంగా కాకుండా, మార్కెట్ డిమాండ్ బట్టి సరైన సమయంలో అమ్ముకునే వెసులుబాటు లభిస్తుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగభూషణం వందే , నిజామాబాద్ జిల్లా సహకార అధికారి శ్రీనివాస రావు , కామారెడ్డి జిల్లా సహకార అధికారి రామ్ మోహన్ రావు , ఎఫ్ సిఐ ప్రతినిధులు, బ్యాంకు ఉన్నతాధికారులు, సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# మేజర్ జి.శివ కిరణ్ మృతి పట్ల ఎఫ్.బీ.హెచ్ సంతాపం



హైదరాబాద్, జూన్ 26 (విజన్ ఆంధ్ర) : ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్(ఎఫ్.బీ.హెచ్) వ్యవస్థాపకుడు సుకుకి ఎక్స్‌నోరా, జియో మ్యాప్ సొసైటీ స్థాపకుడు మేజర్ జి.శివ కిరణ్(రిటైర్డ్) మరణం పట్ల ఎఫ్.బీ.హెచ్ చైర్మన్ మణికొండ వేదకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రఖ్యాత సామాజిక సేవకుడిగా గుర్తింపు పొందిన మేజర్ శివ కిరణ్, స్థిరమైన వ్యర్థాల నిర్వహణ(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) ప్రోత్సాహం, చెత్త ఏరుకునే కార్మికుల(రాగ్ పికర్స్) పునరావాసం, సంక్షేమం కోసం విశేష కృషి చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా హైదరాబాద్‌లో పౌర మౌలిక వసతుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాల ద్వారా సమాజానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, పౌర సంక్షేమానికి సంబంధించిన అనేక కార్యక్రమాల్లో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం లభించిందని తెలిపారు. ఆయన సేవలు సమాజానికి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మరణం సామాజిక సేవా రంగానికి తీరని లోటని అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివితే పోటీ పరీక్షల్లో విజయం..




సూర్యాపేట జూన్ 26:(విజన్ ఆంధ్ర) : విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే క్రమశిక్షణ, సమయపాలన, నైపుణ్యాల పెంపు అత్యంత అవసరమని రిటైర్డ్ మాజీ సిబిఐ డైరెక్టర్ ఐపీఎస్ అధికారి జేడి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రం హోటల్ శ్రీ గ్రాండ్ రెసోనెన్స్ వేదికగా ఫౌండేషన్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం,నాయకత్వ లక్షణాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులభమవుతుందని తెలిపారు. రెసోనెన్స్ సంస్థ 2001 నుంచి ఐఐటీ-జేఈఈ, నీట్, ఒలింపియాడ్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దుతూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అనేక కేంద్రాల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తోందని సంస్థ ప్రతినిధులు వివరించారు. వేలాది మంది విద్యార్థులు దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం సంస్థ విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సూర్యాపేటలో ఈశ్వర్ మూవీ మాక్స్ ఎదురుగా ఫౌండేషన్ కోచింగ్ ను అందుబాటులోకి తీసుకువస్తున్న రెసోనెన్స్ విద్యాసంస్థలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సి ఓ ఓ మార్కండేయ,రెసొనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ వర్ర పూర్ణచందర్రావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ మోహన్ నేతృత్వంలో "చైతన్య - సమాజం" సందేశాత్మక నాటిక ప్రదర్శన



హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : కళాకారులు సమాజ చైతన్య మూర్తులు అనే మంచి ఆశయంతో మంచి మార్పు కోసం స్ఫూర్తి దాయకమైన సందేశాన్ని సమాజానికి అందించాలనే దృక్పథంతో ప్రముఖ సాంస్కృతిక సంస్థ "మండవిల్లి ఆర్ట్స్ అసోసియేషన్"", తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర టి.వి. నాటక రంగసంస్థ, హైదరాబాద్ సౌజన్యంతోసమర్పించిన సందేశాత్మక నాటిక ప్రదర్శన "చైతన్య - సమాజం" ప్రేక్షకులను మైమరిపింపజేసింది. గురువారం సాయంత్రం శ్రీ రామానుజాచారి కళ్యాణ మండపము వేదిక, నెహ్రూనగర్, మల్లాపూర్, హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ఈ సందేశాత్మక నాటిక "చైతన్య - సమాజం" ప్రదర్శనకు బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రఖ్యాత నటుడు మాడుగుల కృష్ణమోహన్ నిర్వహణ, దర్శకత్వం అలాగే నాటికలో ప్రధాన పాత్ర పోషించి తన అద్భుతమైన సందేశం తో కూడిన డైలాగులతో ప్రేక్షకుల మనస్సులను ఆకట్టుకున్నారు. ఇతర పాత్రలలో ప్రముఖ రంగస్థల టీ.వి. సినీ నటీ నటులు జి. మనుప్రియ, ఐరేని రమేష్ గౌడ్, డి. జంగయ్య గౌడ్, గోవింద్ సత్యనారాయణ, కొంటికర్ల లక్ష్మణ్ సాయి పోషించి అలరించి కనువిందు చేశారు. ఈ నాటికకు సినీ సంగీత దర్శకుడు ఆర్. ప్రసాద్ సంగీతం వహించగా, లైటింగ్ సురభి రాయల్ అందించారు. మంచి సందేశాత్మక నాటికను ప్రదర్శించి అందరి ప్రశంసలను అందుకున్న మాడుగుల కృష్ణమోహన్ ఇతర నటుల బృందాన్ని ఈ సంధర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, అతిథులు అభినందించి ఘనంగా సత్కరించారు.

# హరిత గాంధీనగర్ దిశగా అడుగులు

### *థామ్సన్ రాయిటర్స్, మ్యాజిక్ బస్సు సహకారంతో 1000 కొబ్బరి మొక్కలు నాటిన ఎన్జీవోలు.*



ములుగు జూన్ 26, విజన్ ఆంధ్ర ప్రతినిధి : గోవిందరావుపేట్ మండల గాంధీనగర్ గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో థామ్సన్ రాయిటర్స్, మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం 1000 కొబ్బరి మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో థామ్సన్ రాయిటర్స్ ప్రతినిధులు స్వయంగా పాల్గొని మొక్కలు అందజేసి నాటారు. పర్యావరణ పరిరక్షణపై తమ సంస్థకు ఉన్న నిబద్ధతను చాటుకున్న ప్రతినిధులు, అనంతరం గ్రామంలో సంప్రదాయంగా తయారయ్యే మట్టి కుండలు, ఇతర చేతివృత్తుల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామీణ కళాకారుల నైపుణ్యాన్ని అభినందించి, సంప్రదాయ వృత్తులను కొనసాగిస్తున్న గ్రామస్తులను ప్రశంసించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిర్మల వెంకన్న మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తున్న రెండు సంస్థలకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను గ్రామస్తులంతా సంరక్షించి గాంధీనగర్‌ను ఆదర్శ గ్రామంగా మార్చాలని పిలుపునిచ్చారు.

# కాప్రా సర్వే నంబర్ 11 లో అక్రమ ఇండస్ట్రియల్ షెడ్ల కలకలం..!

- కస్టోడియన్ భూమిపై ల్యాండ్ మాఫియా కన్ను.. నివాస ప్రాంతాల మధ్య భారీ షెడ్లు..!
- నిబంధనలకు విరుద్ధంగా త్రీ-ఫేస్ కరెంట్ మీటర్ల కేటాయింపుపై స్థానికుల ఆగ్రహం..!



కాప్రా/జూన్ 26(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : కాప్రా మండల పరిధిలోని రెవెన్యూ కార్యాలయం పక్కన, సాకేత్ టవర్స్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 11 భూమి అక్రమాలకు, భూ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నివాస ప్రాంతాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా భారీ ఇండస్ట్రియల్ షెడ్లు వెలుస్తున్నా, వాటికి విద్యుత్ శాఖ అధికారులు యధేచ్ఛగా త్రీ-ఫేస్ కరెంట్ మీటర్లు కేటాయిస్తుండటంపై స్థానికుల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడటంలో మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం లోపించడం ఆక్రమణదారులకు వరంగా మారింది. కాప్రా రెవెన్యూ కార్యాలయం పక్కనే ఉన్న సర్వే నంబర్ 11 లోని దాదాపు 3 ఎకరాలకు పైగా భూమి గతంలో 'కస్టోడియన్ ల్యాండ్' గా రికార్డుల్లో ఉంది. అయితే, ఈ భూమిపై రెవెన్యూ రికార్డుల పరంగా ల్యాండ్ అలటీస్ నుండి కొందరు వ్యక్తుల పేరిట టైటిల్ డీడ్స్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుండగా, అదే ల్యాండ్‌లో రిజిస్ట్రేషన్ మరియు నోటరీ పేపర్ల ద్వారా మరికొందరు వ్యక్తులు తామే యజమానులమంటూ చలామణి అవుతున్నారు. ఒకే సర్వే నంబర్ భూమికి సంబంధించి విభిన్న రకాల యాజమాన్య పత్రాలు సృష్టించబడటం ఇక్కడి భూ వివాదాల వెనుక ఉన్న రికార్డుల మాయాజాలాన్ని స్పష్టం చేస్తోంది. ఈ సర్వే నంబర్ చుట్టుపక్కల అంతా నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం జనవాసాల మధ్య కాలుష్యానికి, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే భారీ పరిశ్రమలు లేదా ఇండస్ట్రియల్ షెడ్ల ఏర్పాటుకు అనుమతులు ఉండవు. గతంలో ఈ సర్వే నంబర్ 11 లో భారీ ఇండస్ట్రియల్ షెడ్లను ఏర్పాటు చేయగా, స్థానికుల ఫిర్యాదుల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు వాటిని నేలమట్టం చేశారు. కానీ, అధికారుల చర్యలను, చట్టాలను ఏమాత్రం బేఖాతరు చేయని ఆక్రమణదారులు, ల్యాండ్ మాఫియా అండతో మళ్లీ అదే స్థానంలో అంతకంటే భారీ షెడ్లను లేపారు. అంతటితో ఆగకుండా, ఈ మధ్యకాలంలో ఆ భూమిలో చిన్న చిన్న ఐరన్ బాక్సులు (క్యాబిన్లు) కూడా వెలిశాయి. ఇక్కడ గమనించాల్సిన ప్రధానమైన విషయం ఏమిటంటే, ఈ అక్రమ షెడ్లకు మున్సిపల్ లేదా రెవెన్యూ శాఖల నుండి ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు లేదా ఎలాంటి అభ్యంతర పత్రాలు లేవు. అయినప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు ఈ భారీ షెడ్లకు, తాజాగా వెలిసిన చిన్న చిన్న ఐరన్ బాక్సులకు సైతం కమర్షియల్, ఇండస్ట్రియల్ అవసరాలకు వాడే భారీ 'త్రీ-ఫేస్' కరెంట్ మీటర్లను మంజూరు చేసేశారు. ల్యాండ్ టైటిల్ స్పష్టంగా లేని వివాదాస్పద భూమిలో, నివాస ప్రాంతాల మధ్య ఇలాంటి భారీ కరెంట్ మీటర్లు ఏ ప్రాతిపదికన ఇచ్చారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. విద్యుత్ శాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది ఆక్రమణదారులతో చేతులు కలిపి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సాధారణంగా విద్యుత్ శాఖ అధికారులు ఎక్కడైనా కొత్త కరెంటు మీటరు ఇవ్వాలంటే కచ్చితంగా మున్సిపల్ మరియు రెవెన్యూ శాఖల నివేదికలను, అనుమతులను పరిశీలించాల్సి ఉంటుంది. అలా చేస్తే భవిష్యత్తులో భూ వివాదాలకు, అక్రమ ఆక్రమణలకు కొంతమేర అడ్డుకట్ట వేయవచ్చు. కానీ, కాప్రా సర్వే నంబర్ 11 లో అన్ని నిబంధనలను తుంగలో తొక్కారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు మరియు విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగానికి చెందిన అధికారులు స్పందించి, సర్వే నంబర్ 11 లో వెలిసిన భారీ ఇండస్ట్రియల్ షెడ్ల చట్టబద్ధతపై, వాటికున్న విద్యుత్ మీటర్ల లీగాలిటీపై సమగ్ర విచారణ జరపాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా నిర్మించిన షెడ్లను వెంటనే తొలగించి, నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన కరెంట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతున్నారు.

# జీలకుంటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం!!

- రూ. 15.28 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో మహిళా సమాఖ్య భవనం
- ఇంటి స్థలం ఉన్న ప్రతి అర్హునికి రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇల్లు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు





పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): గ్రామాల సమగ్ర అభివృద్ధికి, మహిళల ఆర్థిక సాధికారతకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు అన్నారు. ఓదెల మండలం జీలకుంట గ్రామంలో రూ. 15.28 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, జీలకుంట గ్రామ బీజేపీ సర్పంచ్ రాగిడి మంగ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

భూదాతకు గౌరవం

నాడు భవన నిర్మాణానికి 2.5 గుంటల స్థలాన్ని దానం చేసిన దివంగత మల్లారెడ్డి జ్ఞాపకార్థం ఈ భవనానికి భూదాత మల్లారెడ్డి మహిళా సమాఖ్య భవనంగా నామకరణం చేశారు. మహిళా సాధికారతలి జీలకుంట గ్రామానికి రూ. 54 లక్షల బ్యాంక్ లింకేజీ, రూ. 80 లక్షల స్త్రీనిధి రుణాలు అందించినట్లు తెలిపారు. అలాగే గ్రామంలో కొత్తగా 313 మందికి రేషన్ కార్డులు మంజూరు చేశారు.

విద్యాభివృద్ధి

ఓదెల కేజీబీవీ పాఠశాలలో రూ. 20 లక్షలతో నిర్మించిన అదనపు డార్మిటరీ, టాయిలెట్లను ప్రారంభించారు. రహదారుల నిర్మాణం జీలకుంట - పందిల్ల రోడ్డును త్వరలోనే బీటీ రోడ్డుగా మారుస్తామని, పెద్దపల్లి ప్రధాన రహదారికి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 4 దశల్లో రూ. 5 లక్షల 'ఇందిరమ్మ ఇల్లు' ఇంటి స్థలం ఉన్న ప్రతి అర్హునికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బేస్‌మెంట్ దశ రూ. 1 లక్ష, లింటెల్ లెవెల్ రూ. 1 లక్ష, స్లాబ్ లెవెల్ రూ. 2 లక్షలు, ఇల్లు పూర్తయ్యాక రూ. 1 లక్ష మంజూరు చేస్తామని తెలిపారు. కాల్వల ద్వారా నిరంతరాయంగా సాగునీరు అందించడం వల్లే ఈసారి రైతులకు ఎకరాకు 35 నుండి 45 క్వింటాళ్ల వరి, మక్కజొన్న దిగుబడి వచ్చిందని, ఓదెల మల్లికార్జున స్వామి ఆలయాన్ని కూడా అద్భుతంగా అభివృద్ధి చేస్తామని విజయరమణ రావు ప్రకటించారు.

# మంచానపడ్డ 'తెలంగాణ గళం'!!

- పక్షవాతంతో కొమురయ్య దీనస్థితి
- ఏడాదిగా అందని సీఎంఆర్ఎఫ్
- ఆదుకోవాలని దాతలకు, ప్రభుత్వానికి కన్నీటి విజ్ఞప్తి



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ఉద్యమంలో తన ఆటపాటలతో జనాన్ని చైతన్యపరిచిన ఆ గొంతు ఇప్పుడు మూగబోయింది. వేలాది మందిలో ఊపు తెచ్చిన ఆ పాదం.. నేడు పక్షవాతంతో కదల్లేని స్థితికి చేరింది. రామగుండం 6వ డివిజన్ జనగామకు చెందిన సీనియర్ ప్రజా కళాకారుడు, సిపిఐ నాయకుడు సంబోధు కొమురయ్య గత ఏడాదిగా పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యారు. కాలు, చేయి పడిపోవడంతో ఆదాయం లేక, ప్రతీ నెలా మందుల ఖర్చులు భరించలేక ఆ కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది. విషయం తెలుసుకున్న తోటి కళాకారుడు, సింగరేణి ఉద్యోగి చీకటి అంజన్న శుక్రవారం కొమురయ్య ఇంటిని సందర్శించి, ఆయన పరిస్థితి చూసి చలించిపోయారు. తక్షణ సాయంగా కొంత ఆర్థిక సహాయాన్ని అందించి, తోటి కళాకారుడిని కాపాడుకోవాలని కోరారు. తలకు రెండు సార్లు ఆపరేషన్ కోసం లక్షలాది రూపాయలు అప్పులు చేశామని, ఏడాది క్రితం సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసినా ఇంతవరకు రూపాయి సాయం అందలేదని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి సాయం అందించాలని కోరారు.

ఒక కళాకారుడి ప్రాణం నిలపండి!

ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు

స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, నిలిచిపోయిన సీఎంఆర్ఎఫ్ నిధులను తక్షణమే విడుదల చేయించి ఆదుకోవాలి.


రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు సమాజం కోసం బతికిన ఈ ప్రజా కళాకారుడి కుటుంబానికి మానవత్వంతో అండగా నిలవాలి.

కళాభిమానులు, సేవకులు

మందుల ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న కొమురయ్యకు తోచిన ఆర్థిక సహాయం అందించి పుణ్యం కట్టుకోవాలి. ఒకప్పుడు ప్రజలను తన పాటలతో ఆలోచింపజేసిన కళాకారుడు నేడు మందుల కోసం ఎదురుచూస్తున్నాడు.. ప్రతి ఒక్కరూ స్పందించి ఆర్థిక సాయం అందించాలని పలువురు వేడుకుంటున్నారు.

# గోదావరిఖనిలో భారీ మానవహారం!!

- మత్తు పదార్థాల నిర్మూలనకు డీసీపీ పిలుపు
- వ్యసనపరులు నేరస్తులు కారు, బాధితులు
- శిక్షలతో కాదు.. చికిత్సతోనే మత్తుకు ముగింపు
- గోదావరిఖని ఏసీపీ రమేష్ పిలుపు



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 26 (విజన్ ఆంధ్ర): అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా శుక్రవారం గోదావరిఖని మున్సిపాలిటీ జంక్షన్ వద్ద విద్యార్థులు, యువతతో కలిసి పోలీసులు భారీ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి మాట్లాడుతూ, జూన్ 22 నుంచి 26 వరకు సబ్‌డివిజన్ వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించామని, సమాజానికి శాపంగా మారిన గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. యువతను ఈ మహమ్మారి బారిన పడకుండా కాపాడేందుకు, తమ పరిసరాల్లో డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం తెలిస్తే వెంటనే డయల్-100 లేదా 1908 నెంబర్లకు తెలియజేయాలని కోరారు. అనంతరం గోదావరిఖని ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. మత్తుకు బానిసలైన వారిని నేరస్తులుగా కాకుండా బాధితులుగా చూడాలని, శిక్షల కంటే చికిత్స ద్వారానే వారిలో మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. వ్యసనపరులను పునరావాస కేంద్రాలకు (డీ-అడిక్షన్ సెంటర్లు) తరలించి కౌన్సెలింగ్, వైద్యం అందించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని, ప్రజల సహకారంతోనే డ్రగ్స్ రహిత సమాజ స్థాపన సాధ్యమని పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, అఫ్జలొద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్‌కు స్వల్ప అసౌకర్యం కలిగినా సహకరించిన వాహనదారులకు, పాల్గొన్న ఎస్సైలు మనోహర్, అనూష, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలకు అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఇక్కడ ఫ్లై ఓవర్లు... అక్కడ ఎయిర్ పోర్టులు

హైదరాబాద్ జూన్ 26, : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి 12 ఏళ్లు గడిచింది. ఒకే రాష్ట్ర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయాయి. విభజన తర్వాత తెలంగాణలో కరెంటు ఉండదని, నక్సలిజం పెరుగుతుందని అప్పట్లో కొందరు నేతలు వ్యాఖ్యానించారు. మరో బిహార్ అవుతుందని హెచ్చరించారు. అయితే ఇందుకు విరుద్ధంగా రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి వేగం పుంజుకుంది. వేర్వేరు ప్రాధాన్యతలతో అభివృద్ధి పనులు చేపట్టాయి. ఒక్కొక్క రాష్ట్రం తన ప్రధాన సమస్యలను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలను నిర్మించుకుంది. ఇది రెండు రాష్ట్రాల మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని సృష్టించింది.

**హైదరాబాద్‌లో ఫ్లై ఓవర్లు?**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినత ర్వాత అధికారం చేపట్టిన కేసీఆర్ హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంపై ఎక్కువ దృష్టి పెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత దాదాపు ఒక దశాబ్దంలో హైదరాబాద్‌లోనే 35కిపైగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, సబ్‌వేలు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచింది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, రోడ్ల విస్తరణ, చెరువుల సుందరీకరణ వంటి పనులు కూడా చేపట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఈ క్రమాన్ని కొనసాగిస్తూ మరిన్ని ఫ్లై ఓవర్లను ప్రారంభించింది.

**ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాలు..**

ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర విభజన తర్వాత విమానాశ్రయాల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారించింది. కర్నూల్, కడప, భోగాపురం వద్ద కొత్త అంతర్జాతీయ విమానాశ్రయాలు ఏర్పాటు చేయడం, అమరావతిలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం, గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలకు సన్నాహాలు చేయడం ద్వారా రాష్ట్రంలో ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచాలని ప్రయత్నిస్తోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికులకు త్వరలో అందుబాటులోకి రానుంది.

**ఏపీలో నగరాభివృద్ధి లోపం..**

ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణం చాలా తక్కువగా ఉంది. మెట్రో ప్రాజెక్టులతో ఫ్లై ఓవర్లను ముడిపెట్టే ప్రతిపాదనలు కేంద్రం నుంచి ఆమోదం పొందలేకపోవడం ఒక కారణం. రాజధాని అమరావతి నిర్మాణంపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల మిగిలిన జిల్లాలు, నగరాల్లో ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ పనులు వెనకబడ్డాయి. అలాగే నగరాల్లో పచ్చదనం పెంచడంలో కూడా తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉంది.

**రెండు రాష్ట్రాల ప్రాధాన్యతలు**

తెలంగాణ ప్రభుత్వం పట్టణీకరణ వల్ల ఏర్పడిన ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి ఫ్లై ఓవర్లు, రోడ్ల అభివృద్ధిని ప్రాధాన్యతగా తీసుకుంది. అయితే కొత్త విమానాశ్రయాల ఏర్పాటులో వెనుకబడింది. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఆమోదం వచ్చినా నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. ఆంధ్రప్రదేశ్ మాత్రం రాష్ట్ర విభజన తర్వాత కనెక్టివిటీ, ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకుని విమానాశ్రయాలు, హైవేల నిర్మాణంపై ఎక్కువ దృష్టి పెట్టింది. కానీ నగరాల్లో ట్రాఫిక్ సౌకర్యాలు, ఫ్లై ఓవర్ల నిర్మాణంలో ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉంది.ప్రస్తుతం తెలంగాణకు కొత్త విమానాశ్రయాలు అవసరం ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు నగరాల్లో ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ, పచ్చదనం పెంచడం అత్యవసరం. రెండు రాష్ట్రాలు తమ బలహీనతలను గుర్తించి, ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటూ సమతుల్య అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉంది.

# రెండు బైకులు ఢీ.. ఇద్దరు మృతి

హైదరాబాద్ : గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 07:25 గంటలకు, ఏఎంబీ ఫ్లైఓవర్పై రోడ్డు ప్రమాదం జరిగింది. గచ్చిబౌలి నుండి హాఫీజ్పేట్ వైపు వెళ్తున్న రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్సైకిల్ హాఫీజ్పేట్ నుండి గచ్చిబౌలి వైపు రోడ్ రాంగ్ రూట్ లో ప్రయాణిస్తున్న స్కూటీని ఎదురుగా ఢీకొట్టింది. స్కూటీ నడుపుతున్న శ్రీకాంత్, వెనుక కూర్చున్న విట్టల్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మరణించారు. రాయల్ ఎన్ఫీల్డ్ రైడర్ వినోద్కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం మేరకు సమీపంలో ఉన్న హాస్పిటల్ తరలించారు కేసు నమోదు చేసుకొని పూర్తి వివరాలు సేకరిస్తున్నమని తెలిపారు

# నేడు బీజేపీ నూతన జిల్లా కార్యాలయ వాస్తు పూజ

## బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. నారాయణ



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 26 (విజన్ ఆంధ్ర)వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరంలో నూతనంగా నిర్మించిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా కార్యాలయంలో శనివారం ఉదయం 7:00 గంటలకు వాస్తు పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శుభ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయి నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, అలాగే కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విచ్చేసి, వాస్తు పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పంచముఖ సంకటహర మహాగణపతి రూపంలో

హైదరాబాద్, జూన్ 26, ఈ ఏడాది ఖైరతాబాద్ బడా గణపతి 69 అడుగుల ఎత్తులో రూపొందించనున్నారు. పంచముఖ సంకటహర మహాగణపతి రూపంలో ఖైరతాబాద్ మహా గణేషుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నాడు. ఇక ఆ విగ్రహానికి ఒకవైపు సోమనాథ్ జ్యోతిర్లింగం.. మరోవైపు కాళీమాత విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఈసారితో ఖైరతాబాద్ ఉత్సవాలకు 72 ఏళ్లు పూర్తి కానున్నాయి. సెప్టెంబర్ 14న వినాయక చవితి జరగనుండగా.. తాజాగా కర్ర పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రసిద్ధి చెందిన వినాయక మండపాల్లో ఒకటైన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహా గణేశుడి ఉత్సవాలు నేటితో అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. తాజాగా ఈసారి ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించే మహా గణపతి నమూనా పోస్టర్‌ను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఇవాళ ఆవిష్కరించింది. ఈ క్రమంలోనే ఘనంగా కర్రపూజను నిర్వహించింది. ఈసారి 69 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని.. పంచముఖ సంకటహర మహా గణపతి రూపంలో తయారు చేయనున్నారు. ఈ విగ్రహ నిర్మాణం పూర్తి కావడానికి 82 రోజులు పట్టనుంది. ఈసారి ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహంలో సోమనాథ్ జ్యోతిర్లింగం, కాళికామాత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రోజున ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా కర్రపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగినట్లయింది. ఈ పూజా తర్వాత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. ఈ ఏడాది అక్కడ కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. వినాయక చవితి ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన రానుండగా.. నేటితో సరిగ్గా 82 రోజులు మిగిలి ఉన్నాయి. దీంతో ఈ 82 రోజుల్లోనే సర్వ హంగులతో కూడిన 69 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని.. ఉత్సవ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఇక ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు.. ఉద్రిక్తతలు తగ్గిపోయి.. అన్ని దేశాల్లో శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈసారి ఖైరతాబాద్ గణేశుడిని పంచముఖ సంకటహర మహా గణపతి రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తేల్చి చెప్పారు. ఈ భారీ వినాయకుడి విగ్రహానికి కుడివైపున ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని ఏర్పాటు చేయనున్నారు. అదే సమయంలో ఎడమ వైపున భక్తులను ఎల్లవేళలా కాపాడే కాళికామాత విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నట్లు ఉత్సవ కమిటీ స్పష్టం చేసింది. లోక కల్యాణార్థం కొలువుదీరనున్న ఈ పంచముఖ గణపతి విశేష రూపం ఇప్పుడు భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.

# తిరుపతి పిసిబి అధికారి మునిప్రసాద్ ఇంట్లో ఏసిబి సోదాలు

## ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు

కర్నూలు,జూన్26: నగరంలోని చాణక్యపురి కాలనీలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) జోనల్ అధికారి యుగంధర్ మునిప్రసాద్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. తిరుపతిలోని పీసీబీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనకు ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలతో ఏసీబీ తనిఖీలు చేసింది. కర్నూలుతో పాటు తిరుపతి, హైదరాబాద్‌లో ఏకకాలంలో సోదాలు జరుగుతున్నాయి. ఈ దాడులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఏసీబీ డీఎస్పీ సోమన్న వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.5.87 లక్షల నగదు, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్‌బీఐ లాకర్, రెండు ఇళ్లు, భార్య పేరున 4 ఓపెన్ ఎ÷-లాట్లు, 17 తులాల బంగారం, 3 కిలోల వెండి ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆస్తుల విలువ రూ.4 కోట్లు ఉంటుందని ఏసీబీ అంచనా వేసింది. బహిరంగ మార్కెట్‌లో ఈ విలువ మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.

# హాకీ యువకులకు ఎమ్మెల్యే సన్మానం

## స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులకు శాలువాలతో అభినందన



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 26 (విజన్ ఆంధ్ర) హాకీ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన వనపర్తి నియోజకవర్గానికి చెందిన ముగ్గురు యువకులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం ఘనంగా సత్కరించారు. వనపర్తిలోని నంది హిల్స్‌లో గల తన నివాస కార్యాలయంలో యువకులకు శాలువాలు కప్పి అభినందించారు. గుండ్యావాల నాయక్ తండాకు చెందిన దివాకర్ ఎయిర్‌ఫోర్స్‌లో, ముందరితాండకు చెందిన అర్జున్ టెండూల్కర్ అగ్నివీర్‌లో, గట్లఖానాపురం తండాకు చెందిన ఎం. భాస్కర్ టెరిటోరియల్ ఆర్మీలో ఉద్యోగాలు సంపాదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "ఈ ముగ్గురు యువకులు హాకీ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరచడం ద్వారానే చిన్న వయసులోనే ఉద్యోగాలు సాధించారు. వీరి విజయం ఇతర యువతకు స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు. యువకులు ఉన్నత విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, కౌన్సిలర్ ధనలక్ష్మి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి. కృష్ణ, హాకీ అసోసియేషన్ అధ్యక్షులు మన్నెం యాదవ్, ప్రధాన కార్యదర్శి బోలెమోని కుమార్, సభ్యులు రామ్మోహన్, నిరంజన్ గౌడ్, స్వామి, వహీద్, ప్రశాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# గిరిజన అభివృద్ధికి పాటుపడ్డ ఏకైక పార్టీ కాంగ్రెస్

## వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రతి గిరిజన ఆవాసంలో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి చర్యలు

## ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ బస్సు యాత్ర సన్నాహక సమావేశం



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 26 (విజన్ ఆంధ్ర) ఉక్కు మహిళ ఇందిరా గాంధీ కాలం నుంచి నేటి వరకు గిరిజన అభివృద్ధి కోసం పాటుపడ్డ ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీనేనని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ వేడుకల బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 1976 లోనే గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి ప్రోత్సహించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే గుర్తు చేశారు. గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించడం వల్ల గిరిజన కుటుంబాలకు అన్ని విధాలుగా ప్రభుత్వపరమైన సహాయ సహకారాలు అందుతున్నాయన్నారు. నేడు రేవంత్ రెడ్డి సర్కారులో గిరిజనులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలోని గిరిజనులు ఉండే ప్రతి ఆవాస ప్రాంతంలో సేవాలాల్ ఆలయాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత కరెంటు, విద్యార్థులకు ఉన్నత విద్య, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రైతు భరోసా వంటి రాయితీపైన అనేక పథకాలను ప్రభుత్వం అందజేస్తోందని వివరించారు. ఇందిరమ్మ కాలం నుంచి గిరిజనులు కాంగ్రెస్ పార్టీకి అండదండగా నిలుస్తున్నారని అన్నారు. రేపు శనివారం వనపర్తి జిల్లా కేంద్రానికి ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ వేడుకల బస్సు యాత్ర వస్తుందని, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున గిరిజన సోదరులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరిజన నాయకులతో కలిసి బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపిటీసీలు, మాజీ సర్పంచులు, గిరిజన సంఘం నాయకులు, గిరిజన యువకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.ఎ

# ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భారీ బీమా పథకం

## హర్షం వ్యక్తం చేసిన జేఏసీ నేతలు రూ.60 లక్షల బీమా రక్షణ ఉద్యోగుల కుటుంబాలకు గొప్ప భరోసా భరత్, వినోద్ సాగర్



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 26 (విజన్ ఆంధ్ర) తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారీ బీమా పథకాన్ని రాష్ట్రంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపజేయడంపై వనపర్తి జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భరత్, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ సాగర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, స్థానిక సంస్థలలో వేలాది మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. వారికి కూడా రూ.60 లక్షల వరకు బీమా రక్షణ కల్పించడం ఉద్యోగుల కుటుంబాలకు గొప్ప భరోసా కలిగిస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు. గతంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషించినప్పటికీ అనేక సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరంగా ఉండే పరిస్థితి నెలకొనేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం వారిని కూడా ఈ బీమా పథకం పరిధిలోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. అదేవిధంగా ఏజెన్సీ వ్యవస్థను తొలగించి కార్పొరేషన్ ద్వారా లేదా ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

# పెబ్బేరులో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

## జూన్ 28, 29, 30 తేదీలలో సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహణ

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన మండ్లరాజు




పెబ్బేరు జిల్లా ప్రతినిధి, జూన్ 26 (విజన్ ఆంధ్ర) భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వనపర్తి జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జూన్ 28, 29, 30 తేదీలలో పెబ్బేరు పట్టణ కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్లరాజు తెలిపారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులకు వనపర్తి జిల్లాలోని ముఖ్య నాయకులు హాజరవుతారని, బోధించేందుకు సీపీఎం రాష్ట్ర నాయకత్వం వచ్చి కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని ఆయన పేర్కొన్నారు. పెబ్బేరు పట్టణంలో మొదటిసారిగా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మండ్లరాజు తెలిపారు. ఈ తరగతుల్లో దేశ రాజకీయ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ కంపెనీలకు భారతదేశ సంపదను అప్పజెప్పిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఈ 12 సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలను విస్మరించిందని, మతోన్మాద విధానాలను అవలంబిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారంటీల అమలులో విఫలమైందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ విధానాలపై భవిష్యత్ పోరాటాలను రూపకల్పన చేయడం కోసమే ఈ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. వనపర్తి జిల్లాలోని సీపీఎం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ జి. బాలయ్య, నాయకులు ఆర్. భాస్కర్, దేవన్న, ఉషన్న, మన్యం తదితరులు పాల్గొన్నారు.

# 10 రెస్టారెంట్లలో 9 దారుణం

హైదరాబాద్, జూన్ 26, జొమాటో లేదా స్విగ్గి.. ఉబర్.. ఇలా ఎన్నో ఉన్నాయి. జస్ట్ ఫోన్ ఆన్ చేయడం.. యాప్ ఓపెన్ చేయడం.. ఆఫర్లు చూడడం.. నచ్చిన ఆహారం సెలెక్ట్ చేయడం.. ఆర్డర్ పెట్టడం.. పేమెంట్ ఆన్లైన్లోనే చేసేయడం.. ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం.. సాయంత్రం డిన్నర్.. మధ్యలో స్నాక్స్.. చివరికి కేకులు.. బర్గర్లు.. పిజ్జాలు.. సూప్‌లు కూడా అందులోనే.. ఆర్డర్ పెట్టిన కొత్త సమయానికి కళ్ళ ముందుకు వస్తుంది. కాళ్ల దగ్గరికి వస్తుంది. అలాంటప్పుడు ఇలాంటి తిండిని ఎవరు కాదనుకుంటారు..కొంతకాలంగా హైదరాబాదులో సగటు నగర జీవి ఇటువంటి రెడీమేడ్ ఫుడ్ కే అలవాటు పడ్డాడు. చివరికి వివాహం జరిగిన వారు సైతం ఆన్లైన్లోనే ఆర్డర్ పెట్టుకుంటున్నారు. వండే శ్రమ లేకుండా.. చెమటలు చిందించకుండా దర్జాగా తింటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. తెస్తున్న ఫుడ్ ఎలా ఉంటుంది.. ఎలాంటి పరిస్థితుల్లో తయారుచేస్తున్నారు.. వాటి వల్ల ఎలాంటి రోగాలు వస్తాయి ఎవరూ గుర్తించడం లేదు. చివరికి ఆఫీసర్లు చేసిన దాడుల్లో.. దిగ్భ్రాంతి కరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ నగరంలో ఈ నెలలో 10 రెస్టారెంట్లను అధికారులు తనిఖీలు చేస్తే.. అందులో తొమ్మిది అత్యంత దారుణంగా ఉన్నాయని తేలింది. చెత్తబుట్టలో వేయాల్సిన ఆహారాన్ని వారు విక్రయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దారుణమైన ఆహారాన్ని రకరకాల రంగులు.. మసాలాలు దట్టించి ప్లేట్లో పెడుతున్నారు. అంతేరా.. ఈ రెస్టారెంట్ మదినగూడ లో ఉంది. ఇక్కడ కూరగాయలకు బూజు పట్టి ఉంది. వాడిన నూనె మళ్ళీ మళ్ళీ ఉపయోగించడానికి అధికారులు గుర్తించారు. పైగా ప్యాకెట్ల మీద లేబుల్స్ కూడా లేవు. లులు హైపర్ మార్కెట్ చెత్తబుట్టలో వేయాల్సిన 150 కిలోల ఆహారాన్ని ఇక్కడ అధికారులు గుర్తించారు. వెంటనే దానిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైనేజీలు మొత్తం బ్లాక్ అయ్యాయి. అందులో పురుగులు ఉన్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలను గుర్తించిన అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉడిపి ఉపహార్ మూసాపేట్ డ్రైనేజీలో దారుణంగా సమస్యలు ఉన్నాయి. పురుగులు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. చెత్తబుట్టల మీద మూతలు లేవు. వంట చేసేవారు సరైన జాగ్రత్తలు పాటించడం లేదు. లైసెన్స్ కూడా ముగిసిపోయింది. చౌమన్, మాదాపూర్ ఇక్కడ మాంసాన్ని అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేశారు. శాకాహారం.. మాంసాహారం కలిపి నిల్వ చేశారు. కనీసం వాటి మీద మూతలు కూడా పెట్టలేదు. జిస్మత్ జైల్ మండి, మదినగూడ ఇక్కడ వంటలు వండే తీరు ఎలా ఉందంటే.. కనీసం వాటిని పందులు కూడా తినవు. ఐటమ్స్‌కు లేబుల్స్ లేవు. సరైన నిలవలేదు. దీనికి ఎటువంటి గుర్తింపు లేదు. వాతావరణం అత్యంత దారుణంగా ఉంది. రాయల్ స్పైసి, గచ్చిబౌలి కీటకాలు తాండవం చేస్తున్నాయి. దుర్వాసన ముక్కులను పగలగొడుతోంది. నీరు దారుణంగా నిలిచిపోయింది. కిచెన్ అత్యంత అపరిశుభ్రంగా ఉంది. వంట కాదు కదా, ఇక్కడ ఐదు నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి. సబ్ వే, కొండాపూర్ కుళ్ళిపోయిన కూరగాయలు వాడుతున్నారు. లేబుల్ లేని ఐటమ్స్ ఉపయోగిస్తున్నారు. సింక్ నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. ఆహార వృథా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. లాఫినోస్ పిజ్జా, జూబ్లీ ఎంక్లేవ్ బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇతర రెక్కల పురుగులు ఇష్టమొచ్చినట్టు తిరుగుతున్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉపయోగిస్తున్నారు. అపరిశుభ్రత అత్యంత దారుణంగా ఉంది.

# సింగపూర్ కు సముద్రమార్గంలో బంగినపల్లి

విజయవాడ, జూన్ 26,దేశీయ వ్యవసాయ రంగ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఒక కీలక మైలురాయి నమోదయ్యింది. అత్యంత ప్రసిద్ధి చెందిన బంగినపల్లి మామిడి పండ్లను వాణిజ్యపరంగా తొలిసారి సముద్ర మార్గం ద్వారా సింగపూర్‌కు విజయవంతంగా పంపారు. దీంతో తక్కువ ఖర్చు, పర్యావరణ హితంగా తాజా పండ్లను ప్రపంచ మార్కెట్లకు చేర్చేందుకు కొత్త మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మొత్తం ప్రక్రియను వ్యవసాయ, శుద్ధిచేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి పర్యవేక్షించింది. ఇందులో భాగంగా జూన్ 11న ఓసమ్ ఫుడ్ సొల్యూషన్స్ 5 మెట్రిక్ టన్నుల బంగినపల్లి మామిడి పండ్లను ఎగుమతి చేయగా.. ఈ కన్సైన్‌మెంట్ జూన్ 24న సింగపూర్ చేరుకుంది. ఈ ఎగుమతి ప్రక్రియ విజయవంతం కావడం వెనుక లక్నోలోని ఐకార్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ కీలక పాత్ర పోషించింది. ఎగుమతి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్' (జీఏపీ) ధ్రువీకరణ పొందిన తోటల నుంచి సేకరించిన మామిడి పండ్లను.. కర్ణాటకలోని అపెడా గుర్తింపు పొందిన ప్యాక్‌హౌస్‌లో శుద్ధి చేసి ప్యాకింగ్ చేశారు. ఈ ఎగుమతి ద్వారా రైతులకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. స్థానిక మార్కెట్‌లో మామిడి కిలో రూ. 25- రూ. 26 పలుకుతోంది. కానీ, సింగ్‌పూర్‌కు ఎగుమతి చేయడం ద్వారా కిలోకు సుమారు రూ. 50 వరకు లభించింది. దీంతో రైతుల ఆదాయం దాదాపు రెట్టింపయ్యింది. అలాగే, ఈ మామిడి పండ్లను దిగుమతి చేసుకున్న సింగూర్ సంస్థ ఈసీ-లింక్స్ లిమిటెడ్.. నాణ్యత అద్భుతంగా ఉందని ప్రశంసించింది. పండ్ల తియ్యదనం, ఒకేరీతిలో పక్వానికి రావడం, ఎక్కువ కాలం నిల్వ ఉండటం వంటి లక్షణాలను ఆ సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. సింగపూర్ నిర్దేశించిన నాణ్యత, ఫైటోశానిటరీ ప్రమాణాలను ఈ కన్సైన్‌మెంట్ విజయవంతంగా అందుకోవడం హర్షణీయం. శాస్త్రీయ విధానాల్లో మామిడి కోత, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, సముద్ర రవాణాలో కోల్డ్-చైన్ లాజిస్టిక్స్ సమర్థతను ఇది నిరూపించింది. బంగినపల్లి మామిడి పండు తన బంగారు పసుపు వర్ణం, పీచులేని గుజ్జు, చక్కటి సువాసన, అద్భుతమైన తీపిదనంతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ఇక, జలమార్గం ద్వారా ఎగుమతి ఖర్చు వాయు మార్గంతో పోలిస్తే తక్కువకావడమే కాదు, పర్యావరణ హితమైందని, వాణిజ్యపరంగా లాభదాయకమైందని రుజువు చేసింది. అలాగే, శక్తిమంతమైన కోల్డ్-చైన్ మౌలిక సౌకర్యాలు, శాస్త్రీయ నిర్వహణ విధానాల సహకారంతో సముద్ర మార్గాల ద్వారా రవాణా భారత ఉద్యానవన ఉత్పత్తుల ఎగుమతులను ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ ఎగుమతులను పెంచడం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా తగినంత గుర్తింపు తీసుకురావడం అనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అపెడా ఈ చొరవ తీసుకుంది. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని భారతీయ వ్యవసాయ ఉత్పత్తులను జల మార్గంలో ఎగుమతి చేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

# టీడీపీలో తమ్ముళ్ల తగాదాలు

నెల్లూరు, జూన్ 26నెల్లూరు జిల్లా ఉదయగిరి టిడిపిలో ఇంటర్నల్‌గా రీ సౌండ్స్ వస్తున్నాయట. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వ్యతిరేకంగా ఒక వర్గం రీ యూనియన్ అవుతున్నట్టు తెలుస్తోంది. పాత తరం పార్టీ నేతలకు, ఎమ్మెల్యేకి మధ్య బాగా గ్యాప్ పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. వరుస భూ వివాదాలు కాకర్ల మెడకు చుట్టుకుంటున్నాయట. అనుచరులు చేసే తప్పులకు కోర్టు మెట్లు ఎక్కాల్సి రావడం ఎమ్మెల్యేకి తలనొప్పిగా మారుతోందంటున్నారు. ఆయన వ్యవహార శైలి నచ్చని పాత తరం టిడిపి నేతలందరూ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకి టచ్‌లోకి వెళ్తున్నట్టు తెలుస్తోంది. మండలాల్లో తమకేం పనులు జరగడంలేదని.. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం ఎమ్మెల్యే మనుషులు చెప్పినట్టే పనిచేస్తున్నారంటూ సీనియర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. 2024 ఎన్నికలకు ముందు ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జిగా బొల్లినేని రామారావు ఉన్నారు. అయితే ఫైనల్‌గా ఆయన్ని కాదని టీడీపీ అధిష్టానం ఎన్నారై కాకర్ల సురేష్‌కు మొదటి లిస్ట్‌లోనే అవకాశం కల్పించింది. అప్పటి వరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేసిన సురేష్.. అన్ని వర్గాలను కలుపుకొని జనంలోకి వెళ్ళి ఫస్ట్ అటెంప్ట్‌లోనే విజయం సాధించారు. కానీ? గెలిచాక వైఖరి మారిందన్నది స్థానికంగా వినిపిస్తున్న మాట. వరుస వివాదాలు చుట్టు ముడుతుండగా? అటు బొల్లినేని వర్గాన్ని సైతం దూరం పెట్టేశారన్నది కేడర్ చెబుతున్న మాట. తన వర్గాన్ని దూరం పెట్టినా? బొల్లినేని రామారావు పెద్దగా రియాక్ట్ అవకుండా, నియోజకవర్గ రాజకీయాల్లో వేలు పెట్టకుండా.. నెలకోసారి తన వాళ్ళని కలుస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ చర్చ ఉదయగిరి నియోజకవర్గంలో జరుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక వివాహానికి మాజీ ఎమ్మెల్యే వెళ్ళగా.. అదే పెళ్ళికి ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పాతతరం టీడీపీ నేతలు, పలువురు మండలాధ్యక్షులు హాజరయ్యారు. వాళ్ళంతా కలిసి అప్పుడు ఎమ్మెల్యే మీదున్న అసంతృప్తిని బొల్లినేని దగ్గర వెళ్ళగక్కినట్టు తెలిసింది. కాకర్ల తమను పట్టించుకోవడంలేదని, ఒక సిఐ తో పాటు పలువురు అధికారులను మార్చాలని కోరినా.. చేద్దాం చూద్దామనే మాటలే తప్ప పని జరగడం లేదని వాపోయారట. పోలీస్ స్టేషన్లతో పాటు మండల కార్యాలయాల్లో కూడా తమకు పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. అలాగే?. ప్రజలకు, ఎమ్మెల్యేకి మధ్య గ్యాప్ పెరిగిపోవడం వల్లే.. పార్టీకి మైలేజ్ రావడం లేదని అంతర్గతంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది.

# శత్రువులుగా మిత్రపార్టీలు

ఏలూరు, జూన్ 26, కాపు కులం కేంద్రంగా రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణాలు ఆయన్ని ఇరకాటంలో పడేస్తున్నాయంటున్నారు. ఇటీవల వైసీపీ కాపు నేతలంతా కలిసి మీటింగ్ పెట్టుకున్నాక జరుగుతున్న పరిణామాల మీద, పార్టీ తరఫున కౌంటర్స్ వేసేందుకు ముందుండమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేని ఆదేశించిందట జనసేన అధిష్టానం. అందుకు తగ్గట్టే ప్రత్యర్థుల్ని అదీకూడా సొంత సామాజికవర్గానికి చెందిన వాళ్ళని గట్టిగానే టార్గెట్ చేస్తున్నారు బొలిశెట్టి శ్రీనివాస్. అలాగే? ఆయన ఏం మాట్లాడినా వెంటనే వైసీపీ కాపు నేతల వైపునుంచి రివర్స్ పంచ్‌లు కూడా స్ట్రాంగ్‌గా పడుతున్నాయి. దీంతో బొలిశెట్టి బాగా ఫీలవుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో చాలామంది జనసేన నాయకులు ఉన్నప్పటికీ? ప్రతిపక్ష నేతల్ని, ప్రత్యేకించి కాపు సామాజిక వర్గ నేతలను ఎదుర్కోవడం ఓ రకంగా ఇబ్బందికరమేనని భావిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యే అయ్యానన్న ఆనందంకంటే ఇదెక్కడి పొలిటికల్ కులగోల అన్న అసహనమే పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. మరోవైపు సొంత నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు ఆయనతో కలిసి పని చేయడానికి ముందుకు రాకపోగా ఇమేజ్‌ని డామేజ్ చేయడానికి చేస్తున్నారట. అందుకే శత్రువులుగా మారిన మిత్ర పార్టీ నేతలతో పోరాడడానికే రెండేళ్లు సరిపోయిందంటూ ఏ వేదికల మీద బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారాయన. కలిసి పని చేయండని రెండు పార్టీల అధిష్టానాలు ఆదేశిస్తున్నాతాడేపల్లిగూడెంలో తెలుగుదేశం నాయకులు మాత్రం జనసేనతో కలిసి ముందుకెళ్లేందుకు ససేమిరా అంటున్నారన్నది ఎమ్మెల్యే మాట. పైగా ఎమ్మెల్యే ఎంతో మేమూ అంతేనన్నట్టుగా టిడిపి ఇన్చార్జ్ వలవల బాబ్జీ వ్యవహరిస్తున్నారన్నది బొలిశెట్టి వర్గం కంప్లయింట్. ఇలాంటి సమయంలో వైసీపీని ఏకిపారేయాల్సి రావడం అదనపు తలనొప్పిగా మారిందన్నది

# 28న జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

## సర్ పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

## మేయర్ బుర్రి చైతన్య.

ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో,జూన్ 26,(విజన్ ఆంధ్ర)రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల28న కనగల్ మండల కేంద్రంలో రు.13వేల కోట్ల వ్యయంతో నిర్మించే ఆర్&బి హ్యాం రోడ్ల పనుల పైలాన్ శంకుస్థాపన అనంతరం ఎన్జీ కళాశాలలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని నల్గొండ నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అధ్యక్షతన సీఎం బహిరంగ సభ విజయవంతంపై సన్నాహక సమావేశం,సర్ పై సమీక్ష నిర్వహించారు.నల్గొండ పట్టణ,మండలానికి చెందినప్రజాప్రతినిధులు,బూత్ స్థాయి నాయకులు,కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ బుర్రి చైతన్య మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ మున్సిపల్



కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులుజరుగుతున్నాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేస్తోంది,మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తోంది.ఈ నెల28న జరిగే సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ చారిత్రాత్మకంగా నిలుస్తుంది.పార్టీ శ్రేణులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు సవరణ కార్యక్రమంసర్ పై ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కేంద్రం తనకు అనుకూలంగా లేని ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని,బూత్ స్థాయి కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎన్జీ కళాశాలలో జరిగే బహిరంగ సభకు నల్గొండ నియోజకవర్గం నుంచి 60వేల మందికి పైగా జన సమీకరణ చేస్తామన్నారు.సీఎం కనగల్ వద్ద హ్యాం రోడ్ల పైలాన్‌తో పాటు,రు.250 కోట్లతో మెడికల్ కళాశాల నుంచి దుప్పలపల్లి వరకు హ్యాం రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు.మంత్రి కోమటిరెడ్డి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు.రు 430 కోట్లతో ఎస్ ఎల్ బి సి కాలువ లైనింగ్ పనులు జరుగుతున్నాయి.సీఎం నల్గొండకు మరిన్ని అభివృద్ధి పనులు ప్రకటిస్తారు.సభను ఊహించని స్థాయిలో విజయవంతం చేసి మంత్రి కోమటిరెడ్డి పేరు నిలబెట్టాలనికోరారు.మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డిలుమాట్లాడారు.ఈ విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్,పి ఎ సి ఎస్ చైర్మన్లు ఆలకుంట నాగరత్నం రాజు,పాశం సంపత్ రెడ్డి,కార్పొరేటర్లు,మాజీ కౌన్సిలర్లు,సర్పంచులు,పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వినియోగదారుల మన్ననలు పొందాలి

## ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట జూన్ 26:(విజన్ ఆంధ్ర)నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగదారుల మన్ననలు పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎస్ ఐ కేర్ అండ్ ఆప్టికల్స్ దుకాణాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ వ్యాపారమైనా వినియోగదారుల మన్ననలతోనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. నాణ్యత కలిగిన కళ్లద్దాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని నిర్వాహకులకు సూచించారు.యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లోకి అడుగుపెట్టి ఆర్థికంగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్స్ గుణగంటి హేమ సతీష్, కొండపల్లి దిలీప్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ ఆలీ, చింతమళ్ళ రమేష్, విద్యాసాగర్, సతీష్, మున్నా, సాయి, ప్రసాద్, నిర్వాహకులు మధు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగం దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ప్రభావం

## శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 26 (విజన్ ఆంధ్ర) : మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలంగాణా రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారము అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్ పి ఆధ్వర్యంలో 2కె రన్, అవగాహన సమావేశం వికారాబాద్ జిల్లా బ్లాక్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ డ్రగ్స్ అనేది ఒక మహమ్మారి, సరదాగా మొదలయ్యి, వ్యసనంగా మారి జీవితాలను సర్వనాశనం చేస్తుంది. ముఖ్యంగా బంగారు భవిష్యత్తు ఉన్న యువత సాలెగూడు లాంటి డ్రగ్స్ ఊబిలో చిక్కుకొని తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. ఇంట్లో ఒక్కరు డ్రగ్స్ కు బానిసలు అయితే ఆ వ్యక్తితో పాటుగా ఆ కుటుంబం కూడా నాశనం అవుతుంది, చిన్నాభిన్నం అవుతుంది. ఆర్థికంగా అప్పులపాలు అవ్వడంతో పాటుగా అనారోగ్యాల పాలవుతారు. డ్రగ్స్ అలవాటు ఉన్న వ్యక్తులకు సమాజంలో గౌరవం ఉండదు. ఏ విధంగా చూసినా మాదకద్రవ్యాలతో అన్ని నష్టాలు ఉంటాయి. అందుకే అందరు కూడా వాటికి దూరంగా ఉండాలి. మనకు తెలిసిన వారు ఎవరైనా డ్రగ్స్ వాడుతుంటే వారికి అవగాహన కల్పించే బాధ్యత మన అందరి పై ఉందన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ 2కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించి,బ్లాక్ గ్రౌండ్ నుండి ఎం ఆర్ పి చౌరస్తా వరకు 2 కె రన్ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తి, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యాసంస్థలు సంబంధిత శాఖలు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా ఎస్ పి స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ,అధికారులు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించి, వాటి నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిన్న నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, ఎస్పి స్నేహా మెహ్రా, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజు గూటూరు, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహా రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలుపాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై కన్నేయాలి

హైదరాబాద్,జూన్26: విద్యార్థుల నుండి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజులు వసూలు చేసే కాలేజీలు కనీస విద్యా ప్రమాణాలను , వసతులను ఖచ్చితంగా పాటించాలన్నారు. గతంలో విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికల ఆధారంగా, కనీస ప్రమాణాలు పాటించని ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు విజయశాంతి స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఆదేశాలను గౌరవించి, వాటిని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన కనీస బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆమె స్పష్టం చేశారు. ఫీజుల బకాయిల కారణంగా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారి విద్యా సంవత్సరానికి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సద్వినియోగం అయ్యేలా, అర్హులైన విద్యార్థులకు తగిన న్యాయం జరిగేలా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజయశాంతి కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులందరికీ మెరుగైన వసతులతో కూడిన, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ఆమె ప్రభుత్వానికి హితవు పలికారు.

# యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి

సూర్యాపేట జూన్ 26:(విజన్ ఆంధ్ర)యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. పార్టీకి యూత్ కాంగ్రెస్ నాయకులు చాలా ముఖ్యమని అన్నారు.శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలని అన్నారు.సూర్యాపేట నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను పేదలకు కేటాయించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 175 కోట్లు ఖర్చు చేస్తుందని అన్నారు.ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.నూతనంగా జరుగుతున్న ఎస్ఐఆర్ సర్వేలో కాంగ్రెస్ పార్టీ తరఫున బిఎల్ ఎ ల నియామకం జరిగిందని, ప్రతి బూతులో కూడా ఏ ఒక్క ఓటు కూడా తీసివేయకుండా పనిచేయాలని ఆయన అన్నారు.ఎస్ఐఆర్ పై పార్టీ పరంగా వస్తున్న సమాచారాన్ని పార్టీ కార్యకర్తలకు అందించాలని , ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా పనిచేయాలని అన్నారు.యూత్ కాంగ్రెస్ పట్టణ కమిటీ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు, కార్యదర్శి, గ్రామాలలో కూడా అధ్యక్షులు , ఉపాధ్యక్షులు కార్యదర్శి పోస్టులకు యూత్ కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు.పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని తన తండ్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులను ఆదరించే వారిని, వారికి పార్టీలో ప్రాధాన్యత కల్పించారని



తాను కూడా అదే బాటలో పయనిస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ వేలిమినేటి సురేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ ఆలీ, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి,కౌన్సిలర్స్ కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, సునీల్ రెడ్డి, తన్వీర్ హుస్సేన్, సైదులు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కక్కిరేణి శ్రీనివాస్, బాలు గౌడ్, అబ్దుల్ రహీం, తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, చింతమళ్ళ రమేష్, వీరన్న నాయక్,రుద్రంగి రవి, బండారు వెంకన్న, ఏడ్ల వీరమల్లు,గుణగంటి సతీష్, కోడి శివ, పిడమర్తి లవన్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, పడిదల రవి, యువజన పట్టణ అధ్యక్షుడు బొడ్డు సాయి, జోహార్,విజయభాస్కర్, మాధవరెడ్డి, నవీన్ చారి, హజిమ్ నరేష్, జావిద్, వినయ్, సుదీర్, లక్ష్మణ్, శివ,తదితరులు పాల్గొన్నారు.

# 1975 జూన్ 25 భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు

## ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్ మౌనేశ్వర్ చారి



ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో,జూన్ 26,(విజన్ ఆంధ్ర)1975 జూన్ 25న దేశంలో విధించబడిన అత్యవసర పరిస్థితి భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా నిలిచిపోయిందని ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్ మౌనేశ్వర్ చారి పేర్కొన్నారు.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీని స్మరిస్తూ కాగడాల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మౌనేశ్వర్ చారి మాట్లాడుతూ అప్పటి కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించి రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాసిందని,పత్రికా స్వేచ్ఛను అణచివేసిందని తెలిపారు.రాజకీయ ప్రత్యర్థులను అక్రమంగా అరెస్టు చేసి జైళ్లలోనిర్బంధించిందని,భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ,సమావేశ హక్కు,ప్రజాస్వామ్య విలువలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు.ఎమర్జెన్సీ కాలంలో వేలాది మంది ప్రజాస్వామ్య పరిరక్షకులు,విద్యార్థి నాయకులు,సామాజిక కార్యకర్తలు నిర్బంధాలను ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని తెలిపారు.యువతకు ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి,భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ప్రాముఖ్యతతెలియజేయాలని,భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి,జిల్లా కన్వీనర్ సూర్య,స్టేట్ హాస్టల్ కో కన్వీనర్ సంపత్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్,రామావత్ సతీష్,యూనివర్సిటీ విద్యార్థి నాయకులువిజయ్,వెంకటేష్,నరసింహ,అక్షిత్,తరుణ్,మల్లిఖార్జున్,సాయి,సతీష్,రాజేష్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## జూన్ 28న బూత్ డే 29,30 తేదీల్లో ఇంటింటి సర్వే

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్-26(విజన్ ఆంధ్ర)జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న 'బూత్ డే' నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే చేపట్టి జిల్లాలోని 62,902 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమం కోసం జిల్లాలో 381 పోలియో బూత్‌లు, 25 మొబైల్ టీమ్‌లు, 24 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి చిన్నారుల వివరాలు సేకరించాలని సూచించారు.ముఖ్యంగా వలస కూలీలు, ఇటుక బట్టీలు, నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల పిల్లలు కార్యక్రమానికి



దూరంగా ఉండే అవకాశం ఉన్నందున వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల వంటి రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రయాణికుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించాలని పేర్కొన్నారు.వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల మధ్య సమన్వయం ఉండాలని, జిల్లాలో ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకుండా అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష కోరారు.

# ఓ యువతా మత్తువదిలి మంచిగ జీవించాలి: నంబూరి తిరుపతిరావు డిఎస్పి

## యువతను నిర్వీర్యం చేస్తున్న మత్తు పదార్థాలు

## డ్రగ్స్ రహిత తెలంగాణ తెలంగాణ మనందరి లక్ష్యం కావాలి

## డ్రగ్స్ పై సమాచారం ఇచ్చినవారికి ఐదువేలు నజరానా

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 26 ( విజన్ ఆంధ్ర):ఓ యువతా మత్తువదిలి మంచిగ బతకాలని మహబూబాబాద్ డిఎస్పీ నంబూరు తిరుపతి రావు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ సబ్ జైల్లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. జైలర్ మల్లెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఎస్పీ నంబూరు తిరుపతి రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జైల్లోని ఖైదీలచే డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అనేవి యువతను నిర్వీర్యం చేస్తూ వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్నాయన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఏరూపంలో వున్నా,, సేవించినా, ఇతరులకు అమ్మినా రవాణా చేసినా తీవ్ర నేరంగా పరిగణించ బడుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ బారిన పడ్డ యువత తీవ్ర నేరాలకు పాల్పడుతుండడంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని వాపోయారు. డ్రగ్స్ మహమ్మారిని తుదముట్టించేందుకు పోలీస్ శాఖ తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా గంజాయి సాగు, అమ్మకంతో పాటు ఉపయోగించే వారిపై నిరంతరం పోలీస్ డేగకన్ను ఉంటుందని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సమాజంలో భాధ్యత కలిగిన ప్రతి పౌరుడూ భాగస్వామ్యం కావాలని



కోరారు. ఎక్కడ డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించినా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఇందుకు ఐదువేల రూపాయల పారితోషకం కూడా ఉంటుందని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. నేర అవినీతి రహిత సమాజమే తెలంగాణ పోలీస్ లక్ష్యమని పేర్కొన్నారు. నాడు డ్రగ్స్ బారిన పడ్డ చైనా, మలేషియా దేశాల అభ్యర్థనతో ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు 1988లో జూన్ 26 తేదీని అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు. అనంతరం గంజాయితో పాటు వివిధ నేరాలకు పాల్పడిన ఖైదీలకు ప్రత్యేకంగా సూచనలూ సలహాలతో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇంకా ఈకార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు, జైలు సిబ్బంది మహ్మద్ ఖలీల్మో మేకపోతుల వీరన్న, పోషిని జనార్దన్, రామాంజనేయులు, నర్సింహారావుతో పాటు ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

# లండన్‌లో కామారెడ్డి యువకుడి అనుమానాస్పద మృతి

## మరణవార్తతో కన్నీరుమున్నీరయిన తల్లిదండ్రులు

కామారెడ్డి,జూన్26: లండన్‌లో తెలంగాణకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్రీనాథ్ రెడ్డి (25) రెండు రోజుల క్రితం అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం శ్రీనాథ్ గతేడాదే లండన్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మధుసూదన్ రెడ్డి, మంజుల దంపతుల కుమారుడు శ్రీనాథ్ రెడ్డి లండన్‌లోని లీసెస్టర్ యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన శ్రీనాథ్.. రాత్రి అక్కడే నిద్రించాడు. తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నట్లు స్నేహితులు అక్కడే ఉన్న శ్రీనాథ్ బంధువులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మరణ వార్తతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తమ కుమారుడు కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

# భీమిలి నుంచి తేజస్విని

విశాఖపట్టణం జూన్ 26, భీమిలీ నియోజకవర్గం విశాఖలో అతి ముఖ్యమైన సీటు. భీమిలీ స్వీట్ సీట్ అని కూడా అంటారు. టీడీపీకి కంచుకోట భీమిలీ. అత్యధిక సార్లు టీడీపీ అభ్యర్థులే గెలిచారు. ఇక ఇటీవల కాలంలో చూస్తే భీమిలీ ప్రాంతం అంతా మరో జూబ్లీ హిల్స్ గా మారిపోతోంది. అనేక ఐటీ పరిశ్రమలు రిసార్టులు హ్పటెల్స్ వస్తున్నాయి. భీమిలీ నియోజకవర్గంలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు అయింది. ఇన్ఫోసిస్ సహా కీలకమైన ఐటీ కంపెనీలు వస్తున్నాయి. దాంతో భీమిలీ మీద అందరికీ మోజు అయితే పెరిగిపోతోంది. భీమిలీ నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఎవరికి వారుగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేసుకుంటున్నారు అని కూటమిలో వినిపిస్తోంది. జనసేన అయితే వచ్చే ఎన్నికల్లో భీమిలీ నుంచి పోటీకి సిద్ధం అని ప్రచారం జరుగుతోంది. మరో వైపు చూస్తే మాజీ మంత్రి భీమిలీ నుంచి రెండు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరి భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా అంటున్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా తన రాజకీయ వారసుడిని భీమిలీ నుంచి 2029 ఎన్నికల్లో పోటీకి దించాలని చూస్తున్నారు అని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో సడెన్ గా ఒక గాసిప్ అయితే గట్టిగా వినిపిస్తోంది. అదేంటి అంటే విశాఖ ఎంపీ శ్రీ భరత్ సతీమణి సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని భీమిలీ నుంచి 2029 ఎన్నికల బరిలో దిగుతుందని ఆ గాసిప్ సారాంశం. ఇది సాధ్యపడుతుందా అంటే ఎందుకు కాదని అనేవారు ఉన్నారు. భరత్ ఎంపీగా ఉన్నారు. ఆయన 2024లో బంపర్ మెజారిటీతో గెలిచారు. వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్లీ ఎంపీగా పోటీ చేస్తారు అని అంటున్నారు. దాంతో తన ఎంపీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే భీమిలీ నుంచి సతీమణిని పోటీ చేయించాలని శ్రీ భరత్ అనుకోవడంలో తప్పు లేదని అనే వారూ ఉన్నారు. భీమిలీ నుంచి ఎవరు టీడీపీ నుంచి పోటీ చేసినా గ్యారంటీగా విక్టరీ ఉంటుందని అంతా చెబుతారు. అదే నిజం కూడా. ఇక ఏకంగా బాలయ్య కుమార్తె పోటీ చేయాలనుకుంటే భీమిలీ సీటు టీడీపీ వశం అని కళ్ళు మూసుకునే చెప్పాల్సి ఉంటుందని అంటున్నారు. ఇంతకీ తేజస్వినికి రాజకీయాల మీద ఇంట్రెస్ట్ ఉందా లేదా అన్నది చూడాల్సి ఉందని అంటున్నారు. ఇక్కడ కొసమెరుపు ఏంటి అంటే 1994 ఎన్నికల సందర్భంగా అన్న నందమూరి తారక రామారావు భీమిలీ నుంచి పోటీ చేయాలని అనుకున్నారని ప్రచారంలో ఉంది. చివరి నిముషంలో ఆయన టెక్కలికి వెళ్ళారు. ఇక 2019 ఎన్నికల సమయంలో నారా లోకేష్ భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా వార్తలు వచ్చాయి. మరి ఇపుడు ఈ గాసిప్ వస్తోంది. అది కూడా ఎన్నికలకు మూడేళ్ళ ముందు. మరి ఇది ఒట్టి పుకార్ నా లేక నిజమెంత అంటే కాలమే దీనిని జవాబు చెప్పాల్సి ఉంది అని అంటున్నారు

# ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలకు ఊరట

హైదరాబాద్, జూన్ 26,తెలంగాణ హైకోర్టులో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 9 లోని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోపాటు.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9పై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. వచ్చే మంగళవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.జీవో నంబర్ 9ని సవాల్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు .. రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటే యాజమాన్యాలు ప్రైవేటు కాలేజీలను ఎలా నడుపుతారని నిలదీసింది. అదే సమయంలో రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. బడ్జెట్ సమావేశాలు కూడా అయిపోయాయని.. ఇంకా పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడంతో కాలేజీలను నడపడం కష్టంగా మారిందని.. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం కూడా కాలేజీలకు భారంగా మారిందని హైకోర్టు పేర్కొంది.ఈ క్రమంలోనే ప్రైవేటు కాలేజీలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను ఎప్పటి లోగా చెల్లిస్తారో చెప్పారని హైకోర్టు ఆదేశించింది. ఈ ఏడాది ఆగస్ట్ 15వ తేదీ లోపు అన్ని బకాయిలను క్లియర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు వాదనలు వినిపించిన లాయర్ హైకోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రైవేటు కాలేజీల తరఫు వాదనలు వినిపిస్తున్న లాయర్.. ఆగస్టు 15వ తేదీ లోపు బకాయిలు మొత్తం క్లియర్ చేస్తే.. ఆరోజే తాము దాఖలు చేసిన పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని హైకోర్టుకు విన్నవించారు.ఇక ఈ వ్యవహారంలో పలువురు విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు మధ్య విద్యార్థులు తీవ్రంగా నలిగిపోతున్నారని విద్యార్థుల తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ పెండింగ్ బకాయిల ద్వారా విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. ఈ ఏడాది కొత్తగా కాలేజీల్లో చేరే విద్యార్థులకే ఇది వర్తించేలా చూడాలని.. విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మంగళవారానికి(జూన్ 30) వాయిదా వేసింది.

# అయోధ్య నిధుల గోల్‌మాల్‌పై జవాబివ్వండి

**200కోట్ల అవినీతిపై ప్రజలకు సమాధానం చెప్పాలి**

**భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్**

హైదరాబాద్,జూన్26: అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ పేరుతో రూ.200 కోట్లు అవినీతి చేశారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు చేశారు. రాముడి పేరు చెప్పి వసూలు చేసిన డబ్బుతో ఏం చేస్తున్నారో బీజేపీ ప్రజలకు చెప్పాలన్నారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల అవకతవకలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని.. కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని అన్నారు. చంపత్ రాయ్‌ను ట్రస్ట్ కార్యదర్శి పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. యూపీ సీఎం పదవికి యోగి ఆదిత్య నాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది యూపీకి సంబంధించిన వ్యవహారం కాదని.. దేశ ప్రజలకు సంబంధించిన అంశమన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్దవ్ థాక్రే ఎంపీలు 6 మందిని.. ఒక్కొక్కరికీ రూ.75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందంటూ వ్యాఖ్యానించారు. రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో ప్రధాని మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్య నాథ్ ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని చామల మండిపడ్డారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాను పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకుంటే సరిపోదన్నారు. దేశంలో ప్రజలు ఏ స్థితిలో ఉన్నా అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చారన్నారు. 'ప్రజలు దేవుడి కోసం డబ్బులు ఇచ్చారు. మీరు దోచుకోవడం కోసం కాదు' అంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# రాంగ్‌రూట్‌లో వచ్చిన స్కూటీని ఢీకొన్న బైక్

**స్కూటీపై ఉన్న ఇద్దరు అక్కడిక్కడే మృతి**

హైదరాబాద్,జూన్26: నగరంలోని గచ్చిబౌలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. రాంగ్ రూట్‌లో వచ్చిన స్కూటీని.. ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. గచ్చిబౌలిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వినోద్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో తన బైక్‌పై గచ్చిబౌలి నుంచి హాఫీజ్‌పేట్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో హాఫీజ్‌పేట్ నుంచి గచ్చిబౌలి వైపు రాంగ్ రూట్‌లో ఫ్లై ఓవర్ మీదుగా శ్రీకాంత్, విట్టల్ స్కూటీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మృతిచెందగా.. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందిన వెంటనే గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్

విజయవాడ, జూన్ 26, ఆంధ్రప్రదేశ్ బ్యూరోక్రసీలో వివాదాస్పద అధికారిణిగా గుర్తింపు పొందిన 1988 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎలాంటి బాధ్యతలు లేకుండా వెయిటింగ్ లో ఉన్న ఆమెను.. హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఆకస్మిక నిర్ణయం వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలు లేవని, కేవలం మానవతా దృక్పథంతో ఆమెకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే పచ్చి నిజం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారిక నిబంధనల ప్రకారం.. వై. శ్రీలక్ష్మి ఈ జూన్ 30వ తేదీతో తన సుదీర్ఘ ఐఏఎస్ సర్వీసు నుండి రిటైర్ కానున్నారు. అంటే ఆమె పదవీ కాలం ముగియడానికి కేవలం మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఒకవేళ ఎలాంటి పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లోనో లేదా లూప్ లైన్ పరిధిలోనే రిటైర్ అయితే, ఆ ప్రభావం ఆమె రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై, పెన్షన్ నిబంధనలపై పడే అవకాశం ఉంది. ఒక సీనియర్ మహిళా అధికారిణిగా ఆమె సుదీర్ఘ కెరీర్ ముగింపు దశలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, సర్వీసులో ఉంటూ గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెరీర్ ప్రారంభించిన వై. శ్రీలక్ష్మి.. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చాక.. ఏపీకి వచ్చేందుకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. క్యాట్ ఆదేశాల ద్వారా తెలంగాణ నుండి ఏపీ కేడర్‌లోకి బదిలీ చేయించుకున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆమెకు విపరీతమైన ప్రాధాన్యత దక్కింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆమె సచివాలయంలో చక్రం తిప్పారు. జగన్ హయాంలోనే ఆమెకు వరుస ప్రమోషన్లు లభించి బ్యూరోక్రసీలో టాప్ పొజిషన్‌కు చేరుకున్నారు.ఐఏఎస్ వై. శ్రీలక్ష్మి సుదీర్ఘ కెరీర్ ఎంత వైభవంగా సాగిందో.. దానికి రెట్టింపు స్థాయిలో పెను వివాదాలు, లీగల్ ఇబ్బందులు ఆమెను చుట్టుముట్టాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన ఓబులాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ కేసులో ఆమె తీవ్ర చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నాటి మైనింగ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా గాలి జనార్ధన్ రెడ్డికి అనుకూలంగా జీవోలు ఇచ్చారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను అరెస్ట్ చేసింది. ఈ కేసుల వల్ల ఆమె ఐఏఎస్ సర్వీసు నుండి సస్పెండ్ అవ్వడమే కాకుండా, చంచల్‌గూడ జైల్లో సుదీర్ఘ కాలం రిమాండ్ ఖైదీగా జైలు శిక్షను కూడా అనుభవించాల్సి వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో సైతం ఆమె పేరు ప్రముఖంగా వినపడింది.ఆమెపై ఇప్పటికీ పలు కోర్టు కేసులు, తీవ్రమైన అవినీతి ఆరోపణలు నడుస్తున్నప్పటికీ.. వాటన్నింటినీ పక్కనబెట్టి, రిటైర్మెంట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు ప్రభుత్వం ఆమె సీనియారిటీని గౌరవించింది. సచివాలయంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అధికారుల బదిలీలను చూసే జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించడం ద్వారా ఆమె ఐఏఎస్ కెరీర్‌కు ఒక సాఫీ ముగింపును ఇచ్చే ప్రయత్నం చంద్రబాబు సర్కార్ చేసింది.

# అడ్డంగా బుక్కైన సీఐ నాగరాజు

విజయవాడ, జూన్ 26, ఏపీలో సంచలనంగా మారుతోంది సాయి కృష్ణ లాకప్ డె×త్ మిస్టరీ. ఇప్పటికే వైసీపీ నేతలు కుల రాజకీయం మొదలుపెట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగతంగా, రాజకీయంగా, కుల పరంగా టార్గెట్ చేశారు. అదృశ్యం తరహాలో కేసు విచారణ మొదలుపెట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇందుకు ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజును అదుపులోకి తీసుకుంది. అయితే సాయి కృష్ణ మిస్సింగ్ మిస్టరీ కాస్త లాకప్ డె×త్ గా బయటపడింది. సీఐ రిమాండ్ రిపోర్టులో అత్యా అని తేల్చేసింది సిట్. పోలీస్ కస్టడీలో తగిలిన గాయాల వల్లే సాయి కృష్ణ మరణం సంభవించిందని నిర్ధారించింది. దీంతో కుటుంబ సభ్యుల అనుమానాలు నిజమయ్యాయి. అయితే సాయి కృష్ణ మృతదేహాన్ని ఖననం చేశారా? లేకుంటే ఎక్కడైనా విడిచి పెట్టారా? అన్నది తెలియాల్సి ఉంది.అయితే సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని చంపేశారు అంటూ ఆది నుంచి ఆరోపిస్తున్నారు. కచ్చితంగా ఆనవాళ్లు, అనుమానాలు ఉండడంతో పాటు సంకేతాలు రావడంతోనే ఆమె ఆ తరహా ఆరోపణలు చేశారని ఇప్పుడు అర్థం అవుతోంది. సాయి కృష్ణ మే 6న మార్కాపురంలో టాస్క్ ఫోర్స్ సిబ్బందికి పట్టుబడ్డారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇక్కడే నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజు వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు అర్థం అవుతుంది. మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ పూర్తిగా మాయమైంది. అయితే ఇప్పటివరకు అదృశ్యం కేసు గానే ఉండేది. ఇప్పుడు లాకప్ డె×త్ అని తెలియడంతో దాని వెనుక జరిగిన పరిణామాలపై అసలు సిసలైన విచారణ మొదలుకానుంది.అసలు సాయి కృష్ణ పై మోపిన అభియోగాలు ఏంటి? ఏ కేసులో టాస్క్ ఫోర్స్ పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు? సీఐ నాగరాజుకు సరెండర్ చేసిన తర్వాత ఏం జరిగింది? అసలు లాకప్ డె×త్ చేయాల్సిన అవసరం సిఐ నాగరాజుకు ఎందుకు వచ్చింది? దీని వెనుక పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయా? లేకుంటే పెద్దల పాత్ర వుందా? ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచకుండా ఎందుకలా చేశారు? అన్నింటికీ మించి సాయి కృష్ణ మృతదేహం ఇప్పుడు ఎక్కడ ఉంది? ఖననం చేశారా? దహనం చేశారా? లేకుంటే ఎక్కడైనా పారవేశారా? అనేది ఇప్పుడు రెండో చార్ట్ షీట్లో తప్పకుండా వెల్లడయ్యే అవకాశం ఉంది. అయితే ఈ కేసు వెనుక ఏం జరిగిందనే దానిపై పోలీసు వర్గాలకు ఇప్పటికే ఒక స్పష్టత ఉంది. ఎందుకంటే మృతుడు సాయి కృష్ణకు నేరచరిత ఉంది. అయితే నేరస్తులంతా లాకప్ డె×త్ చేస్తామంటే కుదరదు. అయితే ఈ స్థాయికి పరిస్థితి వచ్చింది అంటే తెర వెనుక ఏం జరిగింది అనేది ఇప్పుడు కచ్చితంగా బయటపడుతుంది. అంతవరకు వేచి చూడాల్సిందే.

# విద్యుత్ వైర్లు కట్ చేస్తున్న గంజాయి బ్యాచ్

గుంటూరు, జూన్ 26,గుంటూరు నగరంలోని ముస్లిం కాలేజ్ ప్రాంతం.. 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో స్థానికుల నుండి వరుస పోన్లు వచ్చాయి. అర్ధరాత్రి సమయంలో పెదకాకాని పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో వరుసగా ఫోన్లు వస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు సిబ్బంది హుటాహుటిన ఆ సబ్ స్టేషన్ పరిధిలో ఎక్కడ సమస్య వచ్చింది చూసి వెంటనే పరిష్కరించారు. ఇదే తరహాలో వారం రోజుల క్రితం రామిరెడ్డి తోట పరిధిలో కూడా అర్ధరాత్రి సమయంలో పవర్ నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇలా వరుసగా జరగటంతో విద్యుత్ శాఖాధికారులు ఆలోచనలో పడ్డారు. అసలు ఏంజరిగి ఉంటుందా అని లైన్లు పరిశీలించారు. వర్షం లేదు, ఈదురు గాలులు లేవు అయినా ఎందుకు అంతరాయం వస్తుందో పరిశీలించిన అధికారులకు ఆశ్చర్యపోయే పరికరాలు కొన్ని కనిపించాయి.పొడవాటి తీగలకు రాళ్లు లేదా ఇతర వస్తువులను కట్టిన గంజాయి బ్యాచ్ లు అర్ధరాత్రి సమయంలో వాటిని విద్యుత్ లైన్ల పైకి విసురుతున్నట్లు గుర్తించారు. ఐరన్ తీగలకు రాళ్లు కట్టి విసరడంతో అవి సులభంగా విద్యుత్ వైర్లపై పడుతున్నాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు గుర్తించారు. విద్యుత్ లైన్ల పై గంజాయి బ్యాచ్ లు ఆ విధంగా విసిరిన ఐరన్ తీగలను గుర్తించిన విద్యుత్ సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకున్నారు. వరుసగా ఈ తరహా ఘటనలు జరగడంపై విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఎస్ ఈ చల్లా రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటువంటి ఘటనలతో ఆర్థిక నష్టంతో పాటు ప్రజల భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని.. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రమేష్ తెలిపారు.

# కొండాపూర్ కల్చరల్ క్లబ్‌లో వడ్డెర సంఘం సర్వసభ్య సమావేశం



శేరిలింగంపల్లి జూన్ 26 : (విజన్ ఆంధ్ర)ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిట్ల శ్రీధర్ హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన వడ్డెర సమాజ ఐక్యత, అభివృద్ధి, యువతకు విద్యా, ఉపాధి అవకాశాల కల్పన, సంఘ బలోపేతంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. సమాజ పురోగతికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు, పెద్దలు, యువత, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పిట్ల శ్రీధర్ ని సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు.

# మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన


**వెలిగొండ ప్రాజెక్టు పరిశీలన...**

**లబ్ధిదారులతో భేటీ**

**గిద్దలూరులో సంజీవని కార్యక్రమంలో**

**పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి, జూన్ 26 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఒకే రోజున యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. జూలై నెలకు మొదటి ఫేజ్ పూర్తి చేయాలనే లక్ష్యంతో శరవేగంగా సాగుతోన్న వెలిగొండ ప్రాజెక్టు పనుల పరిశీలనతో పాటు గిద్దలూరు నియోజకవర్గంలో సంజీవని కార్యక్రమంలో పాల్గొంటారు. వెలిగొండ లబ్ధిదారులతో సమావేశంమార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు వెలిగొండ ప్రాజెక్టు ఎంతో కీలకం. ఇది పూర్తైతే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 జిల్లాల్లోని 30 మండలాల్లో 15.25 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరతాయి. అంతేకాదు దశాబ్దాలుగా నెలకొన్న ఫ్లోరైడ్ సమస్యకూ ముగింపు పలుకుతుంది. రెండు దశలుగా సాగుతోన్న ఈ ప్రాజెక్టులో.... స్టేజ్?ఎలో 1,19,000 ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు, స్టేజ్?ఎలో 3,28,300 ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. స్టేజ్?ఎ కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.5,000 కోట్లకు పైగా ఖర్చు చేసింది. దాదాపు 19 కి.మీ. మేర టన్నెల్?ఎ తవ్వకం, ఎగ్జిట్ ఛానల్ ఒ లింక్ ఛానల్ పనులు పూర్తయ్యాయి. ఫీడర్ కాలువ, తీగలేరు, గొట్టిపడియ ప్రధాన కాలువ సిద్ధమయ్యాయి. రెండు



హెడ్ రెగ్యులేటర్లు, టన్నెల్ లైనింగ్, అప్రోచ్ ఛానల్, తూర్పు ప్రధాన కాలువ పనులు చివరి దశకు వచ్చాయి. ఆర్ అండ్ ఆర్ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.190 కోట్లను ఖర్చు చేసింది. మొత్తం 11 గ్రామాల్లోని నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ఈ మేరకు రేపు ప్రాజెక్టును సందర్శించిన అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.సంజీవనితో మెరుగైన సేవలు ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రభుత్వం సంజీవని ప్రాజెక్ట్ తీసుకొచ్చింది. అందరికీ ఆరోగ్య సేవలు, ఆరోగ్య భద్రత చేకూర్చాలన్నది ఈ కార్యక్రమం లక్ష్యం. నాణ్యమైన, అందుబాటు ధరల్లో, సకాలంలో వైద్య సేవలు అందించే సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక ఈ సంజీవని. పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రి వరకు, ఆరోగ్య ఉప కేంద్రం నుంచి సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానం చేయనున్నారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్, మాతృ-శిశు ఆరోగ్య సేవలు, 108 ఎమర్జెన్సీ, 104 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఈ-ఔషధి వంటి అన్నింటినీ ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ కిందకు తెస్తోంది. గతేడాది జూలై 3న కుప్పంలో, ఈ ఏడాది మార్చి 15న చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా 'సంజీవని' ప్రభుత్వం ప్రారంభించింది. దీనిలో గొప్ప ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి అమలు చేయనుంది. సంజీవని ద్వారా డాక్టర్‌తో అపాయింట్మెంట్ బుక్ చేసుకునే సదుపాయం, వైద్యం తర్వాత డాక్టర్ స్వయంగా ఆరోగ్యంపై ఫాలోఅప్ చేయడం, వర్చువల్ కనెక్ట్ ద్వారా ఎక్సపర్ట్స్ ఉన్న ప్రాంతం నుంచి కూడా వైద్యం అందించడం, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డ్స్ మోనిటర్ చేయడం, సంజీవని వెల్‌నెస్ యాప్ ద్వారా మీ ఆరోగ్య సూచనలు పొందవచ్చు. డిజిటల్ హెల్త్ రికార్డ్స్‌తో ఒక ఏఐ డాక్టర్‌ను ఇవ్వడమే సంజీవని ముఖ్య ఉద్దేశం ముఖ్యమంత్రి పర్యటన వివరాలుఉదయం 10:45 గంటలకు దోర్నాల మండలం, గంటవానిపల్లెకు చేరుకుంటారు. 11 నుంచి మధ్యాహ్నం 12:20 గంటల వరకూ వెలిగొండ ప్రాజెక్టు సందర్శనతో పాటు, అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. వెలిగొండ ప్రాజెక్టు పర్యటన ముగించుకుని 12:35 గిద్దలూరు నియోజకవర్గం కృష్ణంసెట్టిపల్లికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 01.10 నుంచి 01.40 వరకు కృష్ణంసెట్టిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని పథకం లబ్ధిదారులు, వైద్య సిబ్బందితో సమావేశం అవుతారు. 01:45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 03.35 గంటలకు టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 06.15 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా

**- మార్కెట్ పరిస్థితులపై నిరంతర నిఘా పెట్టాలి**

**- పొగాకు రైతుల సమస్యలు, ఎరువుల పంపిణీపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి**

**- జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్**

అమరావతి, జూన్ 26 వర్జీనియా పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సరాసరి ధర కిలోకు రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరిగేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలాని, వర్జీనియా పొగాకు సాగు జరిగే జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఎరువుల లభ్యత, పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కంపెనీలు నిర్ణయించిన నిబంధనలకు లోబడి పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా నిల్వలు, రవాణా, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, కృత్రిమ కొరత, నిల్వదాచివేత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పొగాకు బోర్డు 168వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రి ప్రస్తావించారు. 2026?27 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఈఅఎ (ఈశ్రీబీవ అబీతీవట ఎతితీణతినితిజీ) పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఈఅఎ పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

# పల్నాడు జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలు

**ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష**

**ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశం**

అమరావతి,జూన్26 : పల్నాడు జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలపై ఉన్నతాధికారులతో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కలెక్టర్, ఎస్పీలతో మంత్రి మాట్లాడారు. యాక్సిడెంట్ స్పాట్స్ గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తూ నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వాహనం పాడైనా, ఏదైనా కారణం చేత రోడ్డు మీద ఆగిపోతే వెనక వచ్చే వాహనాలకు ఆ విషయం తెలిసేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీకి దిశానిర్దేశర చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల నగరవనం వద్ద రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందటం పట్ల మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్య వివరాలు తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. పల్నాడు జిల్లా మాచర్ల సమీపంలోని నగరవనం వద్ద లారీ, తుఫాను వాహనం ఢీకొనడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వేగంగా వెళ్తున్న కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి గురైన బాధితులు హైదరాబాద్‌కు చెందిన వారుగా పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నెల్లూరులో మొదలైన రొట్టెల పండుగ

**ఐదు రోజులపాటు కొనసాగనున్న పండుగ**

**దర్శనానికి భారీగా తరలివస్తోన్న భక్తులు**

నెల్లూరు, జూన్26: మతసామరస్యానికి ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన నెల్లూరులోని బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ప్రారంభమైంది. ఇది 5 రోజులపాటు కొనసాగనుంది. అమరుల సమాధుల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తోన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి బారా షహీద్ దర్గాకు తరలివచ్చిన భక్తులు సమాధులకు పూజలు నిర్వహిస్తున్నారు. పూజల కోసం భక్తులు క్యూలైన్లలో వేచిఉన్నారు. స్వర్ణాల చెరువు వద్ద వరాల రొట్టెలు పంచుకుంటున్న భక్తులతో పది ఘాట్లు కిటకిటలాడుతున్నాయి. భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసింది.బారా షహీద్ దర్గాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని మంత్రి నారాయణ అన్నారు. ఎంతో నమ్మకంతో దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తున్నారని, స్వర్ణాల చెరువులో నీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టిపెట్టామని చెప్పారు

# సినిమా

# మరో మూడు నెలల్లో వారణాసి పూర్తి

## ముఖ్యమైన షూటింగ్ పూర్తి చేశామన్న జక్కన్న



మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.

# మా ఇంటి బంగారం కోసం సమంతను ఒప్పించా: రాజ్




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. విడుదలైన తొలి వారం రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన ఈ సినిమా ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విజయాన్ని సెలబ్రేట్ చేసేందుకు హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నిర్మాత, దర్శకుడు రాజ్ నిడిమోరు చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమంత వ్యక్తిగత జీవితం, కెరీర్, ఈ సినిమా ప్రయాణం గురించి ఆయన పంచుకున్న విషయాలు అందరినీ భావోద్వేగానికి గురిచేశాయి.మేము ఎన్నో హిందీ ప్రాజెక్టులు చేశాం. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'స్త్రీ' వంటి ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. కానీ 'మా ఇంటి బంగారం' ఇచ్చిన తృప్తి మాత్రం పూర్తిగా భిన్నం. ఈ సినిమా నాకు గుండెకు చాలా దగ్గరైంది. తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణ నాకు జీవితాంతం గుర్తుండిపోతుంది' అని రాజ్ చెప్పారు. సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన సవాళ్లను గుర్తు చేసుకున్న రాజ్, ఒక ఆసక్తికర విషయాన్ని కూడా వెల్లడించారు. ఈ సినిమా ప్రారంభమైన సమయంలో సమంత వ్యక్తిగత జీవితం, ఆరోగ్యంపై బయట ఎన్నో రకాల ప్రచారాలు జరిగాయి. ఆ సమయంలో ఆమె సినిమాలకు దూరంగా ఉండాలనే ఆలోచనలో ఉండేది. నిజానికి ఇక సినిమాలు చేయకూడదని కూడా అనుకుంది. అయితే కనీసం ఈ ఒక్క సినిమా అయినా చేయాలని నేనే బలవంతం చేసి ఒప్పించాను అని రాజ్ వెల్లడించారు.


# మర్డర్ మిస్టరీలో తత్వం మూవీ




మర్డర్ మిస్టరీ జానర్‌లో.. ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ ఇచ్చేందుకు సిద్ధమవుతోన్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటూ.. సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. సైతాన్ సంతానమే గ్రహణం రోజు పుట్టి సైకోలుగా ప్రవర్తిస్తుంటారనే పాయింట్‌ని బేస్ చేసుకుని, ఈ సినిమా రూపుదిద్దుకున్నట్లుగా ట్రైలర్‌లో చూపించారు. అలాంటి టైమ్‌లో పుట్టిన ఓ వ్యక్తి చేసే హత్యల చుట్టూ కథని నడిపిస్తూ.. నిజంగా ఆ హత్యలను ఆ వ్యక్తే చేస్తున్నాడా? లేదంటే వేరే ఎవరైనా చేయిస్తున్నారా? అనే క్యూరియాసిటీని పెంచేలా ఈ ట్రైలర్‌ని కట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ టాప్‌లో ట్రెండ్ అవుతోంది.

# రణబాలి షూటింగ్‌లో విజయ్ గొంతెమ్మ కోర్కెలు

## సోషల్ మీడియా అసత్య ప్రచారాలను తిప్పికొట్టిన నిర్మాత




టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆయన నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్‌గా మారాయి. 'రణబాలి' చిత్రీకరణ సమయంలో విజయ్ దేవరకొండ ఐదు కారవాన్లు ఏర్పాటు చేయాలని కోరారని, తన వెంట పెద్ద సంఖ్యలో అసిస్టెంట్లు ఉండాలని డిమాండ్ చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వార్తలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. ఈ ప్రచారంపై ఇప్పటికే విజయ్ దేవరకొండ బృందం స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. హీరోపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంది. అసత్య కథనాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని విజయ్ టీమ్ హెచ్చరించింది. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి కూడా స్పందించారు. షూటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, విజయ్ దేవరకొండ నుంచి అసాధారణమైన డిమాండ్లు ఏవీ రాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయ్ ఎప్పుడూ పనిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారని, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారని నిర్మాత తెలిపారు. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇక 'రణబాలి' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'రణబాలి' చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తయింది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# దీవానా సినిమా సూపర్బ్ అన్న శ్రీవిష్ణు

## నేడు ఒకటి కొంటే రెండు టికెట్ల ఆఫర్



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఇటీవల విడుదలైన చిన్న చిత్రం 'దీవాన' పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సినిమా సక్సెస్ సాధించిన నేపథ్యంలో చిత్రబృందం తాజాగా 'థ్యాంక్యూ మీట్' నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు ప్రేక్షకులకు ఒక బంపర్ ఆఫర్ ప్రకటించి సర్‌ప్రైజ్ చేశారు. 'దీవాన' సినిమా తనకు విపరీతంగా నచ్చేసిందని పేర్కొన్న శ్రీవిష్ణు.. ఈ చిత్రాన్ని మరింత మంది ప్రేక్షకులకు చేరువ చేసేందుకు ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ చేశారు. శనివారం ఈ సినిమా ప్రదర్శితమవుతున్న ప్రతి థియేటర్‌లోనూ, మొదటి 25 టికెట్లకు గానూ ఒకటి కొంటే మరొకటి ఉచితం ఆఫర్‌ను వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ వినూత్న ఆఫర్ వల్ల సినిమాకు మౌత్ పబ్లిసిటీ మరింత పెరిగి, థియేటర్లలో లాంగ్ రన్ లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీవిష్ణు సినిమాపై తనకున్న ఫీలింగ్స్‌ను పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# ఆదిలాబాద్ లో గంజాయి రహిత జిల్లాగా మార్చా

- ఎమ్మెల్యే పాయల్ శంకర్
- మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత, ప్రజలు పోరాడాలి: ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, జూన్ 24 (విజన్ ఆంధ్ర): జూన్ 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఘనంగా 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథులుగా హాజరై మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరించి, అనంతరం జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 2000 మంది యువత, క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ సంఘీభావాన్ని చాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనలో జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిత్యం గమనిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలని, వ్యసనాలకు గురైన వారికి డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా, వాటి అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని సూచించారు. వ్యసనానికి గురైన వారిని గుర్తించి చికిత్స అందేలా కృషి చేయడం కూడా సామాజిక బాధ్యతేనని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ స్వయంగా 5 కిలోమీటర్ల పరుగును పూర్తి చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం పురుషులు, మహిళల విభాగాల్లో విజేతలైన తొలి పది మందికి సైకిళ్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. తదుపరి సంతకాల సేకరణ లో భాగంగా వాల్ ఆఫ్ ప్రామిస్ వద్ద అతిథులు సంతకాలు చేసి డ్రగ్స్ కు, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతామని తన సందేశాన్ని లిఖించారు. యాంటీ డ్రగ్ సోల్జర్ ఛాయాచిత్రం వద్ద ఫోటోలు తీసుకొని, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ తీసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి. మౌనిక, బి. సురేందర్ రావు, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, డిసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, ఎఫ్డిఓ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఇంటర్వ్యూలు పారదర్శకం

- బీఆర్ఎస్ ఆరోపణలు నిరాధారం ఇందిరాశోభన్



విజన్ ఆంధ్ర(26)హైదరాబాద్ : అంగన్వాడీ నియామకాల్లో ఇంటర్వ్యూల విధానంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్ విమర్శించారు, అంగన్వాడీ నియామకాలను అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అసత్య ప్రచారం చేస్తున్నారని, అంగన్వాడీ ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాదని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవలందించే కీలక బాధ్యత అని తెలిపారు, అభ్యర్థుల వ్యక్తిత్వం, మానసిక పరిపక్వత, పిల్లల పట్ల సున్నితత్వాన్ని అంచనా వేయడానికే ఇంటర్వ్యూలు ప్రవేశ పెట్టామని చెప్పారు, పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఇదే విధానం అమల్లో ఉందని, నియామకాల్లో 90శాతం మార్కులు విద్యార్హతలు, ఇతర అర్హతల ఆధారంగానే ఉంటాయని, ఇంటర్వ్యూకు కేవలం 10శాతం వెయిటేజ్ మాత్రమే ఉంటుందని ఇందిరా శోభన్ వివరించారు, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ పూర్తిగా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుందని స్పష్టం చేశారు, మంత్రి సీతక్కపై అసత్య ప్రచారం మాను కోవాలని హెచ్చరించిన ఇందిరాశోభన్, అర్హులైన అభ్యర్థులకు ఎలాంటి పక్షపాతం లేకుండా అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు, అంగన్వాడీ నియామకాలను అడ్డుకునే ప్రయత్నాలను బీఆర్ఎస్ వెంటనే విరమించు కోవాలని హెచ్చరించారు.

# "అమ్మో" చారిటబుల్ ట్రస్టులు..!

- సేవ పేరుతో దందా..!!
- సన్మానాల పేరుతో వసూళ్లు..!!
- నమ్మకంగా మోసం చేస్తున్న నిర్వాహకులు
- చర్యలు తీసుకోవాలంటున్న డివిజన్ ప్రజలు..

మెట్ పల్లి జూన్ 26 (విజన్ ఆంధ్ర): సేవ పేరుతో దందాలు చేస్తున్నవారు రోజు రోజుకి పెరిగిపోతున్నారు. నిజంగా సామాజిక సేవ కంటే, వసూళ్లే వారి లక్ష్యంగా పలు స్వచ్ఛంద సేవా సంస్థలను స్థాపిస్తున్నారు. పలు సేవా సమితుల పేరుతో ఇబ్బడిముబ్బడిగా జనాలను దోచుకుంటున్నారు. నిస్సహాయంగా ఉన్న వారికి సహాయం చేస్తామని సమాజంలోని పలువురు పెద్దల వద్దకు వెళ్లి డబ్బులు తీసుకుని కొత్తరకం మోసాలకు తెర తీస్తున్నారు. కొందరు సన్మానాల పేరుతో డబ్బులు వసూలు చేస్తూ సేవ అనే పదానికి మాయని మచ్చ తెస్తున్నారు.మెట్ పల్లి డివిజన్ లో మెట్ పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలతో సహా అనేక ప్రాంతాల్లో లో సోషల్ సర్వీస్ పేరుతో దందా జోరుగా సాగుతోంది. విభిన్న రంగాలలో పనిచేసే పలువురిని తమ సేవా సమితి పేరుతో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆహ్వానిస్తూ, ఒక్కొక్కరి వద్ద నుండి3000 వేల నుంచి 5000 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఇక ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ను, స్థానిక మున్సిపల్ చైర్మెన్, కాన్సిలర్ లను, స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్ లను పిలిచి వారితో కలిసి ఫోటోలు దిగి, ఆ తర్వాత ఆ ఫోటోలను తిరిగి దందా కోసం ఉపయోగించుకుంటున్నారు. వివిధ సేవా సమితులు ఏర్పాటు చేసిన వారి బ్యాక్ గ్రౌండ్ చూస్తే వారంతా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు. చిన్న చిన్న వృత్తులు చేసుకునే వారు. సేవా సమితి పేరుతో సమాజంలోని వ్యాపారవేత్తలను, రాజకీయ నాయకులను కలుస్తూ, నిజంగా సేవ చేయాలనే దృక్పథం ఉన్న వారి నుండి డబ్బులు వసూలు చేస్తూ కొంత మంది తమ పబ్బం గడుపుకుంటున్నారు. అంతేకాదు ఎవరికైనా సన్మానాలు చేయించుకోవాలని ఆలోచన ఉంటే వారి వద్ద నుండి దండిగానే డబ్బులు వసూలుచేసి దందా చేస్తున్నారు. ఇక వీరు నిర్వహించే సేవాసమితి లకు సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్లు కానీ రిజిస్టర్ లు కానీ పారదర్శకంగా ఉండవు. ఒక బ్యాంక్ ఎకౌంట్ కానీ, కనీసం ఐటీ రిటర్న్లు దాఖలు చేయడం కానీ ఏది ఉండదు. నకిలీ రిసిప్ట్ బుక్ లు పెట్టి వారి స్వచ్ఛంద సేవా సంస్థకు డబ్బులు విరాళంగా ఇచ్చిన వారికి రిసిప్ట్ లుఇస్తున్నారు. కొంత మందికి ఆ రిసిప్ట్ లు కుడా ఇవ్వడం లేదు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థల పైన, సేవా సమితుల పైన పోలీసుల నిఘా లేకపోవడంతో ఇలాంటి నకిలీ సేవా సంస్థలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి. చారిటి ల పేరుతొ నమ్మకంగా మోసం చేస్తున్న నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొవాలని, చారిటి ల పేరుతొ మోసం చేసే అనేక స్వచ్ఛంద సంస్థలు డివిజన్ వ్యాప్తంగా ఉన్నాయని, వాటిపైన కూడా దృష్టి సారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఓ.....తరం భవిష్యత్తు బకాయిలలో బందీ!!

-జాతీయ బీసీ యువజన సంఘం
జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ

రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 26 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు పేద కుటుంబాల కల ఒక్కటే"మా పిల్లలు చదివి జీవితంలో నిలదొక్కుకోవాలని" ఆ కలకు బలమైన ఆధారం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం. ఈ పథకం వల్ల వేలాది మంది పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీర్లు, డాక్టర్లు, ఫార్మసిస్టులు, ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఎదిగారని కానీ నేడు ఆ పరిస్థితులు లేవని జాతీయ బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియా విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.... ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారవచ్చునని, రాజకీయాలు మారవచ్చునని, కానీ పేద విద్యార్థిలల భవిష్యత్తు ఎప్పుడూ రాజకీయాలకు బలికాకూడదన్నారు. ఎన్నికల సమయంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని, విద్యార్థుల భవిష్యత్తు కాపాడుతామని ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారు. కానీ ఈరోజు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తుండగా, పేద కుటుంబాలు అప్పులు చేసి, నగలు తాకట్టు పెట్టి, పిల్లల చదువు కొనసాగించేందుకు పోరాడుతున్నాయని, ప్రభుత్వ చర్యలు శూన్యంగా మారాయన్నారు. ఒక రోజు కూలికి వెళ్లే తండ్రి తన కుమారుడికి ఇంజినీరింగ్ సీటు తెప్పించేందుకు జీవితమంతా కష్టపడుతున్నాడు. వ్యవసాయ కూలీ అయిన తల్లి తన కుమార్తె డిగ్రీ చదవాలనే ఆశతో తన అవసరాలన్నీ త్యాగం చేస్తోంది. ఆటో నడిపే తండ్రి, చిన్న ఉద్యోగి, రైతు, కార్మికుడుప్రతి



ఒక్కరూ తమ పిల్లల చదువునే కుటుంబ భవిష్యత్తుగా చూస్తున్నారు. అలాంటి కుటుంబాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం ఒక ప్రభుత్వ పథకం కాదుఅది వారి ఆశ, వారి ఆత్మవిశ్వాసం, వారి భవిష్యత్తు అని ఆయన తెలిపారు.

**ఈరోజు ప్రభుత్వం ఆలోచించాల్సిన ప్రశ్న ఒక్కటే........**

ప్రజా సంక్షేమ అభివృద్ధి అంటే రోడ్లు నిర్మించడం గొప్పదా? లేక ఒక పేద విద్యార్థిని చదివించడం గొప్పదా? అన్న అంశాలపై ఆలోచన చేస్తే భవనాలు మరో ఏడాది ఆలస్యంగా కట్టవచ్చునని, కొత్త ప్రాజెక్టులు కొన్ని నెలలు వాయిదా పడవచ్చునన్నారు. కానీ చదువు ఆగిపోయిన విద్యార్థి జీవితాన్ని, కోల్పోయిన విద్యా సంవత్సరాన్ని, విరిగిపోయిన కలలను ఎవ్వరూ తిరిగి ఇవ్వలేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యపై చేసే ఖర్చు సంక్షేమ వ్యయం కాదని, అది రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి ఈరోజు ప్రభుత్వం విడుదల చేసే ప్రతి రూపాయి రేపటి తెలంగాణను నిర్మించే ఇంజినీర్‌గా, డాక్టర్‌గా, శాస్త్రవేత్తగా, ఉపాధ్యాయుడిగా మారుతుందన్నారు. ఒక పేద విద్యార్థి కాలేజీ గేటు వద్ద ఫీజు కోసం నిలబడటం కంటే బాధాకరమైన దృశ్యం ఇంకొకటి ఉండదన్నారు. ఒక తల్లి తన మంగళసూత్రాన్ని తాకట్టు పెట్టి ఫీజు చెల్లించాల్సి రావడం అభివృద్ధి చెందిన సమాజానికి గర్వకారణం కాదని, ఒక తండ్రి అప్పుల కోసం తలుపులు తట్టాల్సి రావడం సంక్షేమ పాలనకు నిదర్శనం కాదని ఆయన హితవు పలికారు. ప్రభుత్వానికి అధికారాన్ని ఇచ్చింది ప్రజలేనని, ఆ ప్రజల్లో అత్యంత బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం కూడా ప్రభుత్వానిదే బాధ్యతన్నారు. అందుకే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, ఇకపై ప్రతి విద్యా సంవత్సరంలో నిర్ణీత గడువులో నిధులు విడుదలయ్యే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలి ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి చదువు ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల మధ్య చిక్కుకుపోయే పరిస్థితి మళ్లీ రాకూడదన్నారు.

**చివరగా ప్రభుత్వానికి ఒకే ఒక్క ప్రశ్న...**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విలువ ఉంటే, ఆ హామీలను నమ్మి కాలేజీల్లో చేరిన పేద విద్యార్థుల కన్నీళ్లకు విలువ లేదా? అని ఆయన ప్రశ్నించారు. ఒక రాష్ట్రం గొప్పదనాన్ని ఫ్లైఓవర్లు నిర్ణయించవు, ఆ రాష్ట్రంలో పేద పిల్లవాడు ఎంత నిర్భయంగా చదువుకోగలుగుతున్నాడో అదే నిర్ణయిస్తుందన్నారు. పేద విద్యార్థి భవిష్యత్తును కాపాడండిడని, ఎందుకంటే ఒక విద్యార్థి కల నెరవేరితే ఒక కుటుంబం నిలబడుతుందని ఆయన సూచించారు. ఒక కుటుంబం నిలబడితే సమాజం బలపడుతుందని, అదే నిజమైన అభివృద్ధి, అదే ప్రజా పాలనకు అసలైన అర్థం అని ఆయన అన్నారు.

# నారాయణపూర్‌లో మావోయిస్టులకు భారీ షాక్

- భారీ ఆయుధాల డంప్, రూ.24 లక్షల నగదు స్వాధీనం

చర్ల, జూన్ 26 (విజన్ ఆంధ్ర): ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల నెట్‌వర్క్‌పై భద్రతా బలగాలు మెరుపు దాడి చేశాయి, విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్లలో మావోయిస్టులు రహస్యంగా దాచి ఉంచిన భారీ ఆయుధాల నిల్వలను, అలాగే భారీ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు,

టెక్లా అడవుల్లో ఆయుధాల వేట

ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని టెక్లా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఆయుధాలను నిక్షిప్తం చేసినట్లు గమనించిన భద్రతా బలగాలు, వ్యూహాత్మకంగా గాలింపు చర్యలు చేపట్టాయి, ఈ తనిఖీల్లో ఇన్సాస్ రైఫిల్, ఎస్ఎల్ఆర్ తుపాకులు, .303 రైఫిళ్లు, 30-ఓసీ తుపాకులు, బీజీఎల్ లాంచర్‌తో పాటు పెద్ద మొత్తంలో మందుగుండు సామాగ్రి, డెటోనేటర్లు, కమ్యూనికేషన్ పరికరాలు లభ్యమయ్యాయి.

టోయామేటాలో రూ.24 లక్షల నగదు స్వాధీనం

మరోవైపు చిన్నేడోంగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోయామేటా



అటవీ కొండల్లో నిర్వహించిన ఆపరేషన్‌లో మావోయిస్టులు దాచిన రూ.24 లక్షల నగదును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు, మావోయిస్టుల ఆర్థిక వనరులకు ఇది పెద్ద దెబ్బ అని అధికారులు భావిస్తున్నారు

స్వాధీనం చేసుకున్న ప్రధాన ఆయుధాలు

రైఫిళ్లకు సంబంధించిన ఆయుధాలు అయినటువంటి ఇన్సాస్ ఒకటి, ఎస్ఎల్ఆర్ రెండు, 303 రెండు, 30 ఓసీ రెండు , సింగిల్ షాట్ ఒకటి, వీటితో పాటు మందుగుండు సామాగ్రి అయినటువంటి

ఇన్సాస్ రౌండ్లు ఇరవై ఒకటి, ఎస్ఎల్ఆర్ రౌండ్లు అరవై మూడు, .303 రౌండ్లు అరవై ఐదు, 30-ఓసీ రౌండ్లు ముప్పై ఆరు, ఇతర బుల్లెట్లు డెబ్బై ఎనిమిది, ఇవే కాకా ఇతర ఆయుధాలు బీజీఎల్ లాంచర్, డెటోనేటర్లు మూడు, బావోఫెంగ్ స్కానర్లు రెండు, ఆయుధాలు స్వాధ్యం చేసుకున్నారు.

శాంతి స్థాపనకు నిరంతర కృషి

నారాయణపూర్ పోలీసులు మాట్లాడుతూ మావోయిజం నిర్మూలనలో భాగంగా జిల్లాలోని సున్నిత ప్రాంతాల్లో నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు, మావోయిస్టుల కార్యకలాపాలను అడ్డుకుని, జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు, ఈ ఆపరేషన్ల ద్వారా మావోయిస్టుల వ్యూహాలను భగ్నం చేయడమే కాకుండా, వారి ఆర్థిక మూలాలను దెబ్బతీసినట్లయిందని పేర్కొన్నారు, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, ప్రాంత అభివృద్ధికి సహకరించాలని స్థానిక ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# సైబర్ టవర్స ఇక చరిత్రే




హైదరాబాద్ జూన్ 26, : హైదరాబాద్ నగర ఐటీ రంగానికి పునాది వేసిన మొట్టమొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం చరిత్రగా మారిపోనుంది. అమెరికాకు చెందిన ఈ బహుళజాతి సంస్థ 1987లో బేగంపేట కేంద్రంగా నగరంలోనే మొదటి ఐటీ కార్యకలాపాలను ప్రారంభించింది. అయితే.. ఇటీవల ఈ భవనంలోని భూగర్భ నీటి సంపు దెబ్బతినడంతో భవన భద్రత దృష్ట్యా యాజమాన్యం దీన్ని పూర్తిగా కూల్చివేస్తోంది. ఒకప్పటి ఐటీ వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ ఐకానిక్ భవనం స్థానంలో సరికొత్త కమర్షియల్ బిల్డింగ్ నిర్మించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.నేటి తరం యువతకు ఐటీ కారిడార్, హైటెక్‌సిటీ అనగానే అందరికీ గుర్తొచ్చే ఏరియాలు మాదాపూర్, గచిబౌలి, నానక్‌రామ్‌గూడ, రాయదుర్గం. ఎటు చూసినా ఆకాశాన్ని తాకే గగనతలాలు, అత్యాధునిక గ్లాస్ బిల్డింగులే నేటి ఐటీ నగర రూపురేఖలు. కానీ.. హైదరాబాద్ నగరానికి చెందిన మొదటి తరం ఐటీ ఉద్యోగులను, అనుభవజ్ఞులను అడిగితే వారికి మొదటగా గుర్తొచ్చే ప్రాంతం బేగంపేట. ఎందుకంటే భాగ్యనగరంలో ఐటీ సామ్రాజ్యానికి తొలి పునాది పడింది ఇక్కడే. నగరంలోనే నిర్మితమైన మొట్టమొదటి ఐటీ టవర్‌గా ఖ్యాతిగాంచిన ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం పూర్తిగా కాలగర్భంలో కలిసిపోతోంది. ఆ ఐటీ భవన సముదాయాన్ని కూల్చివేసేందుకు యాజమాన్యం రెడీ అయింది.అమెరికాకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ 1987లో బేగంపేటలో ఐటీ టవర్ నిర్మించింది. నగరంలో స్థాపించబడిన మొట్టమొదటి అంతర్జాతీయ బహుళజాతి సంస్థ ఇదే కావడం విశేషం. ఐటీ రంగంలో హైదరాబాద్ పేరు గ్లోబల్ మ్యాప్‌పైకి ఎక్కడానికి ఈ సంస్థే తొలి కారణం. దశాబ్దాల పాటు ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను తయారుచేసిన ఈ ఐకానిక్ భవనం ఇప్పుడు శాశ్వతంగా కనుమరుగవుతోంది. భవన భూగర్భంలో ఉన్న నీటి సంపు దెబ్బతినడం, పునాదులు బలహీనపడటంతో భవన భద్రతను దృష్టిలో ఉంచుకుని దానిని కూల్చివేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు కూల్చివేత పనులు జరుగుతున్నట్లు స్థానిక పోలీసులు ధృవీకరించారు. పాత భవనాన్ని పూర్తిగా తొలగించిన అనంతరం.. అదే స్థలంలో సరికొత్త అధునాతన కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది.మాదాపూర్‌లో సైబర్ టవర్స్‌ను నిర్మించి.. విప్రో, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ దేశీయ ఐటీ సంస్థలకు పెద్ద ఎత్తున భూములు కేటాయించేంత వరకు నగర ఐటీ రంగానికి బేగంపేట, అమీర్‌పేట ప్రాంతాలే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. అప్పట్లో అంతర్జాతీయ ప్రయాణాలకు అత్యంత అనువుగా.. నగర నడిబొడ్డున బేగంపేట విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాంతం ఐటీ హబ్‌గా ఎదగడానికి ప్రధాన కారణమైంది. ఆ రోజుల్లో బ్రిగేడ్, టాటా సెర్విజోల్, విప్రో ఎయిర్‌టెల్, ఇంటర్‌గ్రాఫ్ వంటి దిగ్గజ సంస్థలన్నీ బేగంపేట కేంద్రంగానే తమ కార్యకలాపాలను సాగించాయి.వీటితో పాటు మేఫిర్, సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లలో సత్యం కంప్యూటర్స్ సంస్థ తన కార్యకలాపాలను నడపగా.. పంజాగుట్టలో ఓఎస్ఐ, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో హెచ్ఎస్‌బీసీ, సియారా అట్లాంటిక్ సంస్థలు ఉండేవి. సోమాజిగూడ కేంద్రంగా ఏడీపీ, 24/7 కస్టమర్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు నగరంలో ఐటీ విప్లవానికి ఊతమిచ్చాయి. నాడు కొన్ని వందల మందితో ప్రారంభమైన ఐటీ ఉద్యోగుల ప్రస్థానం.. నేడు లక్షల మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరింది. ఎందరో మొదటి తరం సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉపాధినిచ్చి, జీవితాలను నిలబెట్టిన హైదరాబాద్ మొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ భవనం నేడు జ్ఞాపకంగా మిగిలిపోతుండటంతో పాత తరం టెక్కీలు తీవ్ర భావోద్వేగానికి లోనవుతున్నారు.

# కూలీ వేషంలో డ్రగ్స్ మాఫియా

## - జడ్చర్లలో బట్టబయలైన గంజాయి దందా

- బురెడ్డిపల్లి రోడ్డు రూట్ వాచ్‌లో 0.710 కిలోల గంజాయి పట్టివేత
- బీహార్ నుంచి తెచ్చి కంపెనీ కార్మికులకు 5గ్రా ప్యాకెట్ల విక్రయం
- కూలీ ముసుగులో దందా - ఇదే మీ పక్కన తిరుగుతున్న ప్రమాదం
- డ్రగ్స్ వద్దంటే వద్దు: ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ విప్లవ రెడ్డి
- సమాచారం ఇవ్వండి, మత్తుకు దూరంగా ఉండండి



జడ్చర్ల, జూన్ 26,(విజన్ ఆంధ్ర): డబ్బు కోసం యువత జీవితాలతో ఆడుకుంటున్న డ్రగ్స్ మాఫియా మరోసారి జడ్చర్లలో బట్టబయలైంది. కూలీ ముసుగులో బాలానగర్ పరిధిలో గంజాయి సప్లై చేస్తున్న బీహార్ వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేయడం యువతకు పెద్ద హెచ్చరిక. గురువారం రాత్రి 9 గంటలకు బురెడ్డిపల్లి రోడ్డు వద్ద రూట్ వాచ్ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆకాష్ పటేల్‌ను పట్టుకున్నారు. తనిఖీలో అతని వద్ద 0.710 కిలోల గంజాయి, మొబైల్ ఫోన్ లభించాయి. బీహార్ నుంచి కిలో 20 వేలకు తెచ్చిన గంజాయిని 5 గ్రాముల చిన్న ప్యాకెట్లుగా చేసి 300కు బాలానగర్ కంపెనీల కార్మికులకు అమ్ముతున్నాడు. రోజంతా కూలీగా పనిచేస్తూ, రాత్రికి డ్రగ్స్ దందా సాగించేవాడు. మీ పక్కనే తిరుగుతున్న ప్రతి కొత్త ముఖం డ్రగ్స్ సప్లయర్ కాకపోవచ్చు, కానీ అప్రమత్తంగా ఉండటం మన బాధ్యత అని ఈ ఘటన రుజువు చేస్తోంది. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.డ్రగ్స్ వద్దంటే వద్దు. క్షణిక ఆనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. ఎవరైనా గంజాయి విక్రయం, రవాణా గురించి సమాచారం ఉంటే వెంటనే ఎక్సైజ్‌కు తెలియజేయండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం అని ఇన్స్పెక్టర్ విప్లవ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐ.కార్తీక్ రెడ్డి, ట్రైనీ గణేష్, హెడ్ కానిస్టేబుల్ మల్ల కంటయ్య, కానిస్టేబుల్ పద్మ పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.